PRAJASAKTI Regd.No. 15795/68

సిబీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 264 | విజయవాడ, ఆదివారం 27 ఏప్రిల్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 27 April 2025 | Rs

## 'కొల్లేరు'కు శాశ్వత పరిష్కారం చూపండి

- సుప్రీంకోర్టులో ప్రభుత్వం ఇంప్లీడ్ పిటిషన్ వేసి వాస్తవాలు చెప్పాలి : వి. శ్రీనివాసరావు
- కొల్లేరు గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటన

3



## పంజాబ్-కోల్‌కతా మ్యాచ్ వర్షార్పణం

- ఛేదనలో నైట్‌రైడర్స్‌లో ఇన్నింగ్స్‌కు వర్షం అడ్డంకి
- ఇరుజట్లకు ఒక్కో పాయింట్

8

## మావోయిస్టులపై
# మళ్లీ పేలిన తూటా

- కర్రెగుట్టల్లో పోలీసు కాల్పులు
- 38 మంది మృతి?

**ఛత్తీస్‌గఢ్ :** తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. శనివారం ఉదయం జరిగిన ఈ కాల్పుల్లో 38 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. ఉదయం 28 మంది మావోయిస్టులు మృతి చెందినట్టుగా... సాయంత్రం వరకు ఆ సంఖ్య 38కి చేరినట్టుగా ప్రచారం జరిగింది. ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. దీనిపై అటు ప్రభుత్వం నుంచి కానీ, ఇటు అధికారుల నుంచి కానీ ఎలాంటి అధికారిక సమాచారమూ అందలేదు.

మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా పెద్ద ఎత్తున భద్రతా బలగాలు చేపట్టిన భారీ కూంబింగ్ ఆపరేషన్ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకున్నది. గత కొన్ని రోజులుగా కేంద్ర బలగాల కూంబింగ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయి. ఇందులో భాగంగా కేంద్ర పారామిలిటరీ బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరుగుతున్నాయి. ఈ కాల్పుల్లో ఇదివరకే ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం అందగా.. శనివారం నాడు ఆ సంఖ్య 38కి చేరినట్టు తెలుస్తోంది.

**మోస్ట్‌వాంటెడ్ హిడ్మా టార్గెట్‌గా..**

కేంద్ర పారామిలటరీ బలగాల నేతృత్వంలో కర్రెగుట్టల్లో గత కొన్ని రోజుల నుంచి కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. ఏరియల్ సర్వే ద్వారా ఎప్పటికప్పుడు బలగాలకు సమాచారం అందుతోంది. మావోయిస్టు మోస్ట్ వాంటెడ్ అయిన హిడ్మా, దేవ టార్గెట్‌గా కూంబింగ్ కొనసాగుతున్నట్టు సమాచారం. వేల సంఖ్యలో బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయనీ, మావోయిస్టులను రౌండప్ చేశాయని శుక్ర వారం ప్రచారం జరిగింది. ఈ క్రమంలో కర్రెగుట్టల్లో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన బీకర కాల్పుల్లో 38 మంది మావోయిస్టులు చనిపోయినట్టు సమాచారం అందింది.

**అణువణువూ జల్లెడ**

పూజారికాంకేర్, గంజపర్తి, నంబి, భీమవరంపాడు, కస్తూరిపాడు ప్రాంతాల్లో విస్తరించి ఉన్న కర్రెగుట్ట అడవుల్లో భద్రతా బలగాల కూంబింగ్ ఐదోరోజు కొనసాగింది. శుక్రవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. తెలంగాణ, ఛత్తీస్‌గడ్, మహారాష్ట్రకు సరిహద్దుగా ఉన్న వాజేడు ఏజెన్సీ, వెంకటాపురం ప్రాంతాలను భద్రతా బలగాలు ఆధీనంలోకి తీసుకుని సెర్చ్ ఆపరేషన్ కొనసాగించాయి. గతంలో ఈ కర్రెగుట్టపైకి వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఉండేది. కానీ కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో భాగంగా భద్రతా బలగాలు వ్యూహం మార్చాయి. ఒకవైపు నుంచి కాకుండా మొత్తం నాలుగువైపుల నుంచి చుట్టుముట్టి, కర్రెగుట్ట అటవీ ప్రాంతాన్ని జల్లెడ పట్టి ఒక్కో ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటూ ముందుకు సాగాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలు కర్రెగుట్టలను అన్నివైపులా నుంచి చుట్టుముట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య కాల్పులు జరిగాయి. సిబ్బందికి కావాల్సిన ఆహారం, తాగునీరు, ఎమర్జెన్సీ ఐటమ్స్ ఎప్పటికప్పుడు వారికి మరో టీమ్ చేరవేసింది. మావోయిస్టులు మరో ప్రాంతానికి మిగతా 7లో

# తీరప్రాంత దశ-దిశ మారుస్తాం...

## మత్స్యకారుల అభివృద్ధికి ప్రణాళికలు

### బుడగట్లపాలెంలో పైలట్ ప్రాజెక్టుగా సీ వీడ్ కల్చర్
### ఆర్టిఫిషియల్ రీఫ్స్‌తో ఆదాయం పెంపునకు చర్యలు
### వేట నిషేధ సాయం పంపిణీలో సిఎం చంద్రబాబు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి**

రాష్ట్రంలో తీరప్రాంత దశ-దిశను మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో శనివారం ఆయన మత్స్యకార సేవలో భాగంగా వేట నిషేధం సాయం పంపిణీ చేశారు. అనంతరం స్థానిక మత్స్యకారులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వివిధ అంశాలను ప్రస్తావించారు. రాష్ట్ర వ్యాప్తంగా తీర ప్రాంతానికి ఆనుకుని 555 గ్రామాలున్నాయని ఆయన చెప్పారు. ఆ గ్రామాలన్నింటి దశ-దిశను మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా మత్స్యకారుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని అన్నారు. రాష్ట్రంలో తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి రూ.1,990 కోట్లను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. సముద్రంలో సీవీడ్ (నాచు) పెంపకం ద్వారా మత్స్యకారులు మంచి ఆదాయం సంపాదించే అవకాశం ఉందన్నారు. బుడగట్లపాలెంలో దాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టి, విజయవంతమైన తర్వాత రాష్ట్రంలోని అన్నీ తీర గ్రామాల్లో అమలు చేస్తామని ప్రకటించారు. సముద్రంలో ఆర్టిఫిషియల్ రీఫ్స్ (కృత్రిమ కొండలు) ఏర్పాటు చేయడం ద్వారా చేపల వేట కోసం వెచ్చించే ఇంధనం, సమయంలో 30 శాతం వరకు ఆదా అవుతుందన్నారు. దీనివల్ల మూడు రెట్ల వరకు ఆదాయం వస్తుందని వివరించారు. మత్స్యకారులకు వేట నిషేధం సాయం కింద రాష్ట్ర వ్యాప్తంగా 1,29,178 మందికి రూ.259 కోట్లు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర పేరుతో రూ.300 కోట్లు ఖర్చు చేసినా ఎవరికైనా మేలు చేకూరిందా? అని చంద్రబాబు ప్రశ్నించారు. దేశంలో మత్స్య సంపద ఉత్పత్తిలో 29 శాతం మన రాష్ట్రానిదేనని, 32 శాతం మేర ఎగుమతులు చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర మత్స్య, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్లలో మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. గత ప్రభుత్వం అనర్హులకు వేట నిషేధ సాయం అందించి నిబంధనల పేరుతో అర్హులైన 27 వేల మందిని తొలగించిందని అన్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ జిల్లాలోనే అన్ని వనరులున్నా మత్స్యకారులు గుజరాత్, చెన్నయ్ వెళ్లాల్సిన అవసరమేమిటని, ఇక నుంచి వలసలను లేకుండా చేస్తామని అన్నారు. ఎన్నికల హామీ మేరకు వేట నిషేధ సాయాన్ని రూ.10 వేలు నుంచి రూ.20 వేలుకు పెంచి మాట నిలబెట్టుకున్నామని తెలిపారు.



మత్స్యకారులకు వేట నిషేధ సాయం చెక్కును అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**మత్స్యకారులతో మాటామంతీ**

బుడగట్లపాలెం సముద్రతీరం వద్ద మత్స్యకారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడారు. చేపల వేట సందర్భంగా వారు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఎండు చేపలు ఎండబెట్టే విధానం, అమ్మకం వంటి విషయాలపై మత్స్యకార మహిళలను అడిగి తెలుసుకున్నారు.

**బంగారు కుటుంబాలతో సంభాషణ**

పి-4లో భాగంగా బంగారు కుటుంబం కింద ఎంపికైన రెండు కుటుంబాలు, ఇద్దరు మార్గదర్శులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులు, వారి జీవనం వంటి వివరాలను అడిగి తెలుసుకుని... అక్కడే ఉన్న మార్గదర్శులతో వారికేం చేయదలుచుకున్నారో చెప్పమన్నారు. కార్యక్రమంలో మంత్రులు మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, కొల్లు రవీంద్ర, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**ఢిల్లీ ఎయిమ్స్ స్థాయికి**
**కెజిహెచ్ అభివృద్ధి**
సిఎం చంద్రబాబు

2

పోప్ ఫ్రాన్సిస్‌కు తుది వీడ్కోలు పలుకుతున్న అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ తదితర దేశాధినేతలు, కేథలిక్ ఆధ్యాత్మిక వేత్తలు (వార్త 7లో)

## 44,676 ఎకరాల భూ సమీకరణ

- రాజధానికి రెండో దశలో 11 గ్రామాలు
- వారం రోజుల్లోపు నోటిఫికేషన్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాజధాని అమరావతి విస్తరణకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పుడున్న 54 వేల ఎకరాలకు తోడు అదనంగా 44,676 ఎకరాలు సమీకరించనున్నారు. దీనికోసం మూడు మండలాల పరిధిలో 11 గ్రామాలను గుర్తించారు. కొత్తగా సేకరించే గ్రామాలతో కలిపి రాజధాని ప్రాంతం మొత్తం లక్ష ఎకరాలకు చేరుకుంటుంది. వారం రోజుల్లో నోటిఫికేషన్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు సమీకరణకు నోటిఫికేషన్ ఇవ్వగానే సిఆర్‌డిఎ సమీకరణ ప్రక్రియ చేపట్టనుంది. 2015లో తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల పరిధిలో ప్రస్తుత రాజధానిగా నిర్ణయించిన ప్రాంతంలో సమీకరించిన భూముల్లో రైతులకు ఇప్పటి వరకూ ప్లాట్లు అభివృద్ధి చేసి ఇవ్వలేదు. కొత్తగా మరోసారి పూలింగు అంటే రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇన్నర్ రింగురోడ్డుకు ఆనుకుని ఉన్న అన్ని ప్రాంతాలతోపాటు, ఎర్రుపాలెం, నంబూరు రైల్వేలైన్‌కు అవసరమైన భూములను కలిపి సమీకరణ చేయనున్నారు. ఇటీవల మంత్రి నారాయణ రాజధాని చుట్టుపక్కల స్మార్ట్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు భూ సమీకరణ చేస్తామని, ప్రజలు అంగీకరించకపోతే సేకరణకు వెళతామనీ ప్రకటించారు. ఆయన అన్నదే తడవుగా పూలింగు పరిధిలోకి వచ్చే గ్రామాల్లో కూటమి పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు సమావేశాలు ఏర్పాటు చేశారు. అభ్యంతరాలున్నా రైతులందరూ అంగీకరించినట్లు ప్రకటించారు. కొత్తగా పూలింగు చేపట్టబోయే గ్రామాల్లో తుళ్లూరు మండల పరిధిలోని హరిశ్చంద్రాపురం, వడ్డమాను రెవెన్యూ గ్రామాలను పూర్తిగా చేర్చారు. హరిశ్చంద్రాపురంలో 2,429 ఎకరాలు, వడ్డమానులో 1,937 ఎకరాలను సమీకరించనున్నారు. పెదపరిమిలో 6,513 ఎకరాలు తీసుకోనున్నారు. అమరావతి మండల పరిధిలోని వైకుంఠపురంలో 3,360 ఎకరాలు, ఎండ్రాయిలో 2,167, కర్లపూడిలో 2,947, మోతడకలో 2,345, నిడుముక్కలలో 2,013 ఎకరాలు సమీకరణ కింద తీసుకోనున్నారు. తాడికొండ మండల పరిధిలో తాడికొండలో 12,797 ఎకరాలు సమీకరణ పద్ధతిలో తీసుకోనున్నారు. కంతేరులో 3,671, మంగళగిరి మండలం కాజలో 4,492 ఎకరాలు మొత్తం 44,676 ఎకరాలు సమీకరణ కింద తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు నోటిఫికేషన్ ఇచ్చిన వెంటనే కార్యాచరణ ప్రారంభించేందుకు వీలుగా సిఆర్‌డిఎ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు మిగతా 7లో

## నీటి కుంటలో మునిగి నలుగురు మృతి

**ప్రజాశక్తి-ములకలచెరువు**

అన్నమయ్య జిల్లా ములకలచెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు, వారి వెంట వచ్చిన మరో చిన్నారి నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దందువారిపల్లి రాజీవ్ కాలనీకి చెందిన దంపతులు ఈశ్వరమ్మ, మలేష్ (36) తమ దుస్తులు ఉతికేందుకు సమీపంలోని పెద్దచెరువుకు వెళ్తుండగా వారి వెంట తన ఇద్దరు పిల్లలు లావణ్య (12), నందకిషోర్ (9) మరో చిన్నారి నందిత వెళ్లారు. చెరువు కుంటలో ముగ్గురు చిన్నారులు అడుకుంటూ లోతుల్లోకి జారిపోయారు. గమనించిన మల్లేష్ వారిని కాపాడేందుకు చెరువు కుంటలోకి దూకాడు. చెరువు కుంట లోతుగా ఉండడంతో పిల్లలతో పాటు మల్లేష్ నీట మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది చెరువులోకి దిగి వారిని కాపాడే ప్రయత్నం చేశారు. అప్పటికే నలుగురు మృత్యువాత పడ్డారు.

## ఏనుగు దాడిలో రైతు మృతి

**ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు (తిరుపతి జిల్లా)**

ఏనుగుల దాడిలో రైతు మృతి చెందారు. తిరుపతి జిల్లాలో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఫారెస్ట్ రేంజర్ వెంకట రమణ తెలిపిన వివరాల మేరకు... చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల పంచాయతీకి చెందిన సిద్ధయ్య (65) తనకున్న 25 గుంటల వ్యవసాయ భూమిలో మిరప సాగు చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఈ పంటకు నీరు పెట్టి తిరిగి వస్తుండగా రోడ్డు పక్కన చెట్ల మధ్య ఉన్న ఏనుగు ఒక్కసారిగా దాడి చేసి ఆయనను చంపేసింది. అదే రోజు ఉదయం చిట్టేచర్లకు సమీపంలోని బొగ్గలవారిపల్లె వద్ద వరి పంట పొలంలో ఏనుగు ఉండడాన్ని గమనించిన రైతులు అటవీ శాఖాధికారులకు సమాచారమిచ్చారు. రైతులు, ఫారెస్టు సిబ్బంది కలిసి ఏనుగును అడవిలోకి తరిమేశారు. అయితే, దానితోపాటు అదే ప్రాంతంలో ఉన్న మరో ఏనుగును ఎవరూ గమనించలేదు. అక్కడ మరో ఏనుగు ఉన్న విషయం తెలియని సిద్ధయ్య అక్కడికి సమీపంలోని తన పొలానికి వెళ్లారు. తిరిగి వస్తున్న ఆయనపై ఏనుగు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు అటవీ శాఖాధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అటవీ శాఖాధికారుల నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణమని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. తొలుతే సరిగా పరిశీలించి రెండో ఏనుగునూ అడవిలోకి మళ్లించి ఉంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదని వారు అంటున్నారు. ఏనుగులు పంట పొలాలను ధ్వంసం చేస్తుండడం, మనుషులపై దాడి చేసి చంపేస్తుండడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నా నివారణ చర్యలు తీసుకోవడం లేదని, దీంతో, ఇటువంటివి పునరావృతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## తటస్థ దర్యాప్తునకు సిద్ధం

- పాక్ ప్రధాని ప్రకటన

**ఇస్లామాబాద్ :** పహల్గాం ఉగ్ర దాడిపై 'తటస్థ' దర్యాప్తునకు సిద్ధంగా వున్నామని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. తటస్థంగా, పారదర్శకంగా, విశ్వసనీయంగా జరిగే ఏ దర్యాప్తుకైనా పాకిస్తాన్ సిద్ధమేనని చెప్పారు. అబోటాబాద్ నగరంలోని మిలటరీ అకాడమీలో శనివారం జరిగిన కార్యక్రమంలో షరీఫ్ ఈ ప్రకటన చేశారు. దేశ సార్వభౌమాధికారాన్ని ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడానికి, ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనడానికి తమ సైన్యం సంసిద్ధంగా వుందన్నారు. ఈ నెల 22న పహల్గాంలో జరిగిన విషాదకరమైన ఘటన నేపథ్యంలో పాకిస్తాన్ నిందలను ఎదుర్కొనాల్సి వస్తోందని ఆయన అన్నారు. సింధు జలాల ఒప్పందాన్ని ఏకపక్షంగా భారత్ నిలిపివేయడం తగదని వ్యాఖ్యానించారు. శాంతియుతంగానే సమస్యను పరిష్కరించుకోవాలన్నది తమ అభిమతమన్నారు. అంతకు ముందు పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో సంక్షోభాన్ని సృష్టించేందుకే భారత్ ఇలాంటి దాడులను చేస్తోందన్నారు. తమ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే భారత్ ఇలాంటి వాటికి పాల్పడుతోందని బిల్వాల్ భుట్టో అన్నారు.

## ఎయు ఘనమైన వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె మధుమూర్తి

## డిఎస్‌సికి మార్కుల అర్హత వద్దు

- అభ్యర్థులకు నష్టం
- మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

2

# అరటికి ఆ'ధర'ణేదీ?

- టన్నుకు రూ.ఐదు వేలే!
- నిలిచిన ఎగుమతులు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు

**ప్రజాశక్తి- కడప ప్రతినిధి**

రాష్ట్రంలో అరటి ధరలు రోజురోజుకూ పాతాళానికి పడిపోతున్నాయి. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి మాసాల ధరలతో పోలిస్తే మార్చి, ఏప్రిల్ మాసాల్లో ఐదు రెట్లు ధర పడిపోవడంతో అరటి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. 2024-25 ఖరీఫ్ సీజన్లో రాష్ట్రంలో 1,44,987 ఎకరాల్లో అరటిని సాగు చేశారు. ఉమ్మడి కడప జిల్లాలో 36,827 ఎకరాలు, అనంతపురం జిల్లాలో 27,365 ఎకరాలు, తూర్పుగోదావరి జిల్లాలో 13,193 ఎకరాలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 14,422 ఎకరాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 9,739 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 9,191 ఎకరాల్లో అధిక విస్తీర్ణంలో సాగులో ఉంది. ఉమ్మడి కడప జిల్లాలో పులివెందుల, రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లోని ప్రాంతాల్లోని 51 మండలాల్లోని గణనీయంగా సాగు చేశారు. ఎకరా విస్తీర్ణంలో అరటి సాగుకు రూ.రెండు లక్షల వరకూ పెట్టుబడి పెట్టారు.

ఎకరాకు 20 నుంచి 25 టన్నుల దిగుబడి వస్తోంది. గత జనవరి, ఫిబ్రవరిలో టన్ను ఒక్కంటికీ సగటున రూ.25 వేల ధర పలికింది. ప్రస్తుతం టన్నుకు ఐదు వేల రూపాయలు మించి రావడం లేదు. దీంతో,ఎకరా ఒక్కంటికీ లక్ష రూపాయల నుంచి రూ.75 వేల వరకూ రైతులు నష్టపోతున్నారు. గత జనవరి, ఫిబ్రవరి మాసాల్లో పులివెందుల ప్రాంతానికి చెందిన నాణ్యమైన అరటికి విదేశీ ఎగుమతుల నేపథ్యంలో రూ.28 వేల వరకూ ధర పలికింది. గత మార్చి నుంచి సింగపూర్, మలేషియా, ఇండోనేషియా దేశాలకు ఎగుమతులు నిలిచిపోయాయని వ్యాపారులు చెప్తున్నారు. ఢిల్లీ, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు ఎగుమతులు తగ్గడం గోరుచుట్టుపై రోకలిపోటులా మారింది. షూట్ పేరుతో గెల ఒక్కంటికీ డజను అరటి పళ్లను దళారులు ఉచితంగా తీసేసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లో ధరల పతనం, దళారుల దోపిడీ, ప్రకృతి వైపరీత్యాలు, పెరిగిన పెట్టుబడుల మూలంగా అప్పుల పాలవుతున్నామని అరటి రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ధరల స్థిరీకరణ నిధి నుంచి గిట్టుబాటు ధర కల్పించి అరటి రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వం ఆదుకోవాలి**

అరటి టన్ను ధర రూ.ఐదు వేలకు పడిపోవడం ఆందోళనకరం. ఎకరా సాగుకు రూ.రెండు లక్షల చొప్పున పెట్టుబడి పెట్టి నాలుగు ఎకరాల్లో అరటిని సాగు చేశాను. పంట చేతికి వచ్చే సమయానికి ధర అమాంతంగా పడిపోయింది. ప్రభుత్వం అరటి రైతులను ఆదుకోవాలి.

**- కె.అమరనాథరెడ్డి, రైతు, కర్నపాపాయపల్లి, లింగాల మండలం**

## జివిఎంసి డిప్యూటీ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై టిడిపి కూటమి సభ్యులు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాస తీర్మానానికి 74 మంది సభ్యులు మద్దతు తెలిపారని జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్, ప్రిసైడింగ్ అధికారి ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. విశాఖ జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో డిప్యూటీ మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై కౌన్సిల్ సమావేశాన్ని ఆయన శనివారం నిర్వహించారు. టిడిపి కూటమి పార్టీకి చెందిన కార్పొరేటర్లు 63 మంది, ఎక్స్‌అఫీషియో సభ్యులైన ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు 11 మంది హాజరయ్యారు. సమావేశంలో అవిశ్వాస తీర్మానానికి కోరం సరిపోయినందున తీర్మానం ప్రవేశపెట్టారు. 74 మంది సభ్యులు అవిశ్వాసానికి వారి మద్దతును తెలిపారు. ప్రతిపాదనకు వ్యతిరేకంగా గానీ, తటస్థంగా గానీ ఎవరూ లేరని ప్రిసైడింగ్ అధికారి తెలిపారు. ఈ సమావేశాన్ని వైసిపి కార్పొరేటర్లు, వైసిపి ఎక్స్‌అఫీషియో సభ్యులు బహిష్కరించారు. ఇటీవల జివిఎంసి మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాసాన్ని కూడా టిడిపి కూటమి నెగ్గిన విషయం తెలిసిందే.

**గంటా, విష్ణుకుమార్ రాజు మధ్య వాగ్వాదం**

డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం అనంతరం కారెక్కి వెళ్లిపోవడానికి సిద్ధమవుతూ విశాఖ ఉత్తర నియోజకవర్గానికి చెందిన బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుపై భీమిలి టిడిపి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి మధ్య జరిగిన ఘర్షణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వైజాగ్ ఫిలిం సిటీ క్లబ్ లీజు వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌కు విష్ణుకుమార్ రాజు వినతిపత్రం ఇవ్వడంతో గంటాలో ఆవేశం రగిలింది. ఫిలిం సిటీ క్లబ్ తన నియోజకవర్గ పరిధిలోకి వస్తుందని, ఆరుగురు ఎమ్మెల్యేలతో కలిసి కలెక్టర్‌కు వినతి ఇచ్చినప్పుడు తనకు కనీసం సమాచారం ఇవ్వాలనిపించలేదా ? అంటూ ఆవేశానికి లోనయ్యారు. మీరు అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చామని విష్ణుకుమార్ రాజు వివరణ ఇచ్చారు. ఈ ఘటనతో కూటమిలో విభేదాలు ఒక్కొక్కటిగా బహిర్గతమవుతున్నాయని పలువురు వ్యాఖ్యానించారు.

## నేడు గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ సదస్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ సదస్సు విజయవాడలో ఆదివారం జరగనుంది. గ్రంథాలయ వ్యవస్థను పరిరక్షించాలనే అంశంపై ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పనర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యాన మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ సదస్సు జరగనుంది. 'విద్యా సంస్థలు – గ్రంథాలయాలు', 'సాంకేతిక యుగం – పుస్తక పఠనావశ్యకత', 'పౌర గ్రంథాలయాలు– సమస్యలు,– పునర్నిర్మాణం', 'పౌర గ్రంథాలయాలు–సాహిత్యం ప్రాధాన్యత' అనే అంశాలపై పలువురు ప్రసంగించనున్నారు. విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ వి బాలసుబ్రమణ్యం ప్రారంభోపన్యాసం చేయనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు రావి శారద, పాపినేని శివశంకర్, సయ్యద్ సలీం, మధురాంతకం నరేంద్ర, పెనుగొండ లక్ష్మీనారాయణ, వెన్నా వల్లభరావు, పి సత్యవతి, అలపర్తి వెంకటసుబ్బారావు, దాసరి వెంకటరమణ, వేంపల్లి షరీఫ్, భాషా ఉద్యమకారుడు రమేష్, రచయిత నల్లి ధర్మారావు తదితరులు పాల్గొంటారు.

## రెన్యువల్ ఉత్తర్వులివ్వాలి

- సిఎస్‌కు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ జెఎసి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు రెన్యువల్ ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ జెఎసి కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్‌కు జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, కో–ఛైర్మన్ బి కాంతారావు శనివారం లేఖ రాశారు. ఏళ్ల తరబడి కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరిని కొనసాగింపు ఉత్తర్వులు ఏప్రిల్ నుంచి జారీ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఉత్తర్వులు లేకపోవడంతో ఏప్రిల్ వేతనాల చెల్లింపులు ట్రెజరీ నుంచి ఇబ్బంది ఏర్పడుతుందని వివరించారు. కావున వీరందరినీ కొనసాగిస్తూ వెంటనే రెన్యువల్ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

## ఆస్తి ఇవ్వలేదని తల్లిదండ్రుల హత్య

ప్రజాశక్తి-పూసపాటిరేగ (విజయనగరం జిల్లా)

ఆస్తి కోసం కన్న కొడుకే తల్లిదండ్రులను ట్రాక్టర్‌తో ఢీకొట్టి దారుణంగా హత్య చేసిన సంఘటన విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చల్లవానితోట పంచాయతీ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నడుపూరి కళ్లలు గ్రామానికి చెందిన పాండ్రంకి అప్పలనాయుడు (55), జయమ్మ (53) దంపతులకు కుమారుడు రాజశేఖర్, కుమార్తె రాధ ఉన్నారు. వీరికి 80 సెంట్ల పొలం ఉంది. కుమార్తె రాధ భర్త అకాల మరణం చెందాడు. దీంతో తల్లిదండ్రులు తమకున్న 80 సెంట్ల భూమిలో 20 సెంట్లను కుమార్తెకు రాశారు. సోదరికి ఆస్తిలో వాటా ఇవ్వడం ఇష్టంలేని రాజశేఖర్ తల్లిదండ్రులపై కక్ష పెంచుకుని, రెల్లివలసలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. శనివారం పొలం దగ్గర తల్లిదండ్రులకు, కుమారుడికి స్వల్ప వివాదం జరిగింది. తనకు రూ.12 లక్షల వరకు అప్పు ఉందని, పొలం అమ్మాలని ఒత్తిడి చేశాడు. వారు అంగీకరించకపోవడంతో ట్రాక్టర్‌తో ఢీకొట్టి పరారయ్యాడు. అప్పలనాయుడు, జయమ్మ అక్కడక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలానికి విజయనగరం డిఎస్‌పి శ్రీనివాసరావుతోపాటు క్లూస్‌టీం, భోగాపురం రూరల్ సిఐ వెంకటరావు, ఎస్‌ఐ దుర్గాప్రసాద్ చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# ఢిల్లీ ఎయిమ్స్ స్థాయికి కెజిహెచ్ అభివృద్ధి

- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

దేశ రాజధాని ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) స్థాయిలో విశాఖలోని కింగ్ జార్జి హాస్పటల్ (కెజిహెచ్)ను అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రూ.50 కోట్లతో నిర్మించిన సెంటినరీ భవనాన్ని శనివారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఆంధ్ర మెడికల్ కళాశాలకు ఎంతో మంచి పేరు ఉందని తెలిపారు. దీనిలో చదివిన సుమారు వెయ్యి మంది విద్యార్థులు విరాళాలు అందించి, అన్ని సదుపాయాలతో అద్భుతమైన భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. ఇదే కళాశాలలో చదివిన మిగతా వైద్యులు వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కెజిహెచ్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా చేయాలనేది తమ ప్రభుత్వ ఆలోచనన్నారు. కెజిహెచ్‌కు లెవెల్ టు కేన్సర్ సెంటర్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ దేశంలోనే ఒక మోడల్ కాలేజీగా ఎదగాలన్నారు. అన్ని రంగాలలో టెక్నాలజీ ఎంతో పురోగతిని సాధిస్తోందని, ఆ మార్పులను వైద్య రంగంలో అమలు చేయాలని సూచించారు. నూతన పద్ధతిలో ఆన్‌లైన్ సేవలను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఈసరికే వాట్సాప్ గవర్నన్స్ ప్రవేశపెట్టి వెయ్యి రకాల సర్వీసులను అందుబాటులోకి తెచ్చామని, వైద్యులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్య కుమార్ యాదవ్, డాక్టర్ డోలా బాల శ్రీ వీరాంజనేయ స్వామి, వంగలపూడి అనిత, ఎంపీ ఎం.శ్రీ భరత్ పాల్గొన్నారు.

సెంటినరీ భవనం శిలాఫలకం వద్ద సిఎం చంద్రబాబు

## ప్రధాని బహిరంగ సభకు ముమ్మర ఏర్పాట్లు

- 5000 మంది రైతులకు సీటింగ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని పనుల పున:ప్రారంభం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ మే 2న పాల్గొననున్న బహిరంగసభకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బహిరంగ సభలో మూడు వేదికలు నిర్మిస్తున్న ప్రభుత్వం ఒక వేదికపై 30 మంది విఐపిలు, మరోవేదికపై 20 మంది కూర్చునేలా ఏర్పాట్లు చేసింది. మూడో వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గంటన్నర సేపు ప్రధాని రాజధాని పరిధిలో ఉంటారు. ఎమ్మెల్యేలు, ఎంపిలకు సభా వేదిక ముందు భాగాన సీటింగ్ ఏర్పాటు చేశారు. వారి వెనుక మూడు గ్యాలరీల్లో రైతులకు అవకాశం కల్పించారు. ఒక గ్యాలరీలో రెండువేల సీట్లు, మరోక గ్యాలరీలో 1900, మూడో గ్యాలరీలో 1100 సీట్లు ఏర్పాటు చేశారు.

అలాగే వచ్చిన వారందరికీ మంచినీళ్లు, అల్పాహారం ఉండేలా సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. అన్ని రోడ్లకూ ముందు రోజు నుండే లైటింగ్ ఏర్పాటు చేయాలని, గ్రామాలను సుందరీకరించాలని నిర్ణయించారు. దీనికోసం సుమారు రూ.6 కోట్లు ఖర్చు చేయనున్నారని తెలిపింది. రోడ్ల రిపేర్లు, కొత్త రోడ్ల ఏర్పాటు, పార్కింగు, మంచినీరు, విద్యుత్, ఆర్‌టిసి బస్సుల ఏర్పాటు కోసం భారీ మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

**30 మంది రైతులకు సన్మానం**

ల్యాండ్ పూలింగులో కీలకంగా వ్యవహరించడంతో పాటు, రాజధాని కోసం ఆందోళనల్లో పాల్గొని., అరెస్టులైన విజయవంతంగా శిబిరాలు నిర్వహించిన వారిన వేదికపై సన్మానించనున్నట్లు తెలిసింది. జాయింట్ యాక్షన్ కమిటీలో భాగంగా ఏర్పాటైన రైతు సమన్వయ కమిటీ సభ్యులు తొమ్మిది మందిని కూడా సత్కరించనున్నారు.

వీరితోపాటు శిబిరాలు నిర్వహించిన మరో 11 మంది, 10 మంది మహిళలు మొత్తం 30మందిని వేదికపైనే సన్మానించి గౌరవించే ఏర్పాట్లు చేసింది. వీరిలో ఉమామహేశ్వరరావు, రాజశేఖరరెడ్డి, కిరణ్, నరసింహారావు, శ్రీనివాసరావు, సతీష్‌చంద్ర, రమేష్, భాను, నరేంద్ర, చలపతిరావు, గణేష్, సాహెబ్‌జాన్, బవసయ్య, గిరిజ, వరప్రసాదు, రామారావు, దుర్గ, సాంబశివరావు, సురేంద్ర, చిన్నా, అప్పారావు, గోవిందమ్మ, వరప్రసాదు, అనిత, సుధాకర్, శ్యామ్‌కిషోర్, సత్యనారాయణ, శైలజ ఉన్నట్లు తెలిసింది. ప్రభుత్వ సూచనల మేరకు చివరి క్షణాల్లో వీటిల్లో మార్పులు చేర్పులు కూడా ఉండే అవకాశం ఉంది.

## వదంతులు వ్యాప్తి చేసే వారిపై చర్యలు

- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పహల్గామ్ ఉగ్ర దాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర భద్రతా సలహా' పేరుతో హై అలెర్ట్ జోన్స్ ప్రకటించినట్లు ఎటువంటి ప్రకటన జారీ చేయలేదని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను ప్రజలు నమ్మొద్దని ఆయన కోరారు.

## మే 20 దేశవ్యాప్త సమ్మెకు ఐద్వా మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని, దొడ్డిదారిన మరలా రైతు చట్టాలను అమలు చేస్తున్న ప్రయత్నాలను విరమించాలని దేశవ్యాప్తంగా మే 20న జరగనున్న కార్మిక సమ్మెకు ఐద్వా రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కరోనా సమయంలో పార్లమెంటులో ఎటువంటి చర్చ లేకుండా నాలుగు లేబర్ కోడ్లను దొడ్డిదారిన తెచ్చిందని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు.

లేబర్ కోడ్లు అమల్లోకి వస్తే కార్మికుడు పోరాడి సాధించుకున్న అనేక హక్కులు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. విస్తారమైన శ్రామిక మహిళలు అసంఘటిత రంగంలో అత్యంత హీనమైన వేతనాలకు పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి పనిగంటలు, భద్రత, ఇఎస్ఐ, పిఎఫ్, మెటర్నిటీ సదుపాయాలు గురించి కనీస ఆలోచన లేదని పేర్కొన్నారు. శ్రమ పోర్టల్‌లో నమోదు చేసుకుంటున్న కార్మికులకు ఎలాంటి సదుపాయాలు కల్పించలేదని తెలిపారు. ఇంటాబయటా అదనపు పనిచేస్తూ కూడా నామమాత్రపు వేతనాలు తీసుకుంటున్న మహిళా శ్రామికులందరినీ గుర్తించాలని, వారికి కార్మిక చట్టాలు వర్తింపజేయాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ కల్పించేందుకు చట్టం చేయాలన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మిక, కర్షకులు చేయనున్న సమ్మెలో యావత్ మహిళాలోకం కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# శాస్త్రీయ దృక్పథం కోసం ప్రజలను చైతన్యపరచాలి

- రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని కాపాడుకోవాలి
- జనవిజ్ఞాన వేదిక పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడం కోసం ప్రజలను చైతన్య పరచడంతో పాటు, రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని కాపాడుకోవాలని జనవిజ్ఞాన వేదిక పిలుపునిచ్చింది. రెండురోజుల పాటు జరగనున్న జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కమిటీ సమావేశాలు విజయవాడలోని ఎంబివికెలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలకు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ఎం గేయానంద్ అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా హాజరైన పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ సైన్స్– ప్రజాస్వామ్యం విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉన్నాయన్నారు..మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక తత్వం నిలుస్తుందని, దానిపై జరిగే దాడిని సైన్స్‌పై జరిగే దాడిగానే భావించాలని అన్నారు. మతోన్మాద దాడి, కార్పొరేట్ దాడి నుండి ప్రజలను రక్షించాలని చెప్పారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శాస్త్రీయ విద్య ద్వారానే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణం కోస కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ నిరుద్యోగ యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని చెప్పారు. మరో మాజీ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు (ఐవి) మాట్లాడుతూ అశాస్త్రీయ భావనలు, అభివృద్ధి నిరోధక సాంప్రదాయాలు, పద్ధతులు, దోపిడీని, పీడనను, వివక్షను ప్రశ్నించే విధంగా ప్రజలను సైన్స్ ఉద్యమం చైతన్య పరచాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ (ఎఐపిఎస్ఎన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులు రెడ్డి, వైఎస్ నాగేశ్వరరావు, కోశాధికారి రాజశేఖర్ రాహుల్, ఎడ్యుకేషన్ సభ్ కమిటీ రాష్ట్ర కన్వీనరు గొంటి గిరిధర్, సమత రాష్ట్ర కన్వీనరు జి.నిర్మల, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనరు సిహెచ్ జయప్రకాష్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డాక్టర్ కాలేషా బాబా, బి,మాణిక్యం, కార్యవర్గ సభ్యులు జి.మురళీధర్, అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# డిఎస్‌సికి మార్కుల అర్హత వద్దు

- అభ్యర్థులకు నష్టం
- మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్‌సిలో ఇంటర్, డిగ్రీ, పిజిలలో వచ్చిన మార్కుల శాతంతో సంబంధం లేకుండా అనుమతినివ్వాలని పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డిఎస్‌సికి ఎస్‌సి, ఎస్‌టి, బిసిలను దూరం చేసే కుట్ర జరుగుతోందని విమర్శించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశం జరిగింది. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్నతో కలిసి లక్ష్మణరావు మాట్లాడుతూ.. 16,347 పోస్టులతో డిఎస్‌సి నోటిఫికేషన్‌ను రాష్ట్రప్రభుత్వం విడుదల చేయడాన్ని స్వాగతించారు. నిరుద్యోగులు ఐక్యంగా అనేక పోరాటాలు చేసి ఈ నోటిఫికేషన్‌ను సాధించుకున్నారని చెప్పారు. ఈ నోటిఫికేషన్‌లో లోపాలు ఉన్నాయని, వీటిని తక్షణమే ప్రభుత్వం పరిష్కరించి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డిఎస్‌సికి దరఖాస్తు చేసుకునే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, వికలాంగ అభ్యర్థులకు డిగ్రీలో 45 శాతం మార్కులు ఉండాలని నిబంధన విధించారని తెలిపారు. డిగ్రీలో 40 శాతం మార్కులతో బిఇడి చేసి, టెట్ రాసిన అభ్యర్థులకు ఇప్పుడు 45 శాతం మార్కులు ఉండాలనే నిబంధన వల్ల నష్టం జరుగుతోందని వివరించారు. బిఇడి, డైట్ చేసి టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు ఇప్పుడు ఎందుకు అనర్హులు అయ్యారో చెప్పాలని అన్నారు. ఈ నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారుల అనాలోచిత విధానాల వల్ల అభ్యర్థులు రోడ్డుమీదకు వచ్చే పరిస్థితులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిఎస్‌సి పరీక్షలతోపాటే ఎపిపిఎస్‌సి, డిగ్రీ, జూనియర్ లెక్చరర్లు, తదితర పోస్టులకు పరీక్షలు నిర్వహించనుందని వివరించారు. దీంతోపాటు సిలబస్ రీత్యా అభ్యర్థులకు శిక్షణ పొందేందుకు 90 రోజుల సమయం ఇవ్వాలని కోరారు. ఒకే జిల్లాకు ఒకే పేపర్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏడేళ్లుగా నోటిఫికేషన్ లేదని, కావున అభ్యర్థుల వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు సమయంలో అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు ఇచ్చిన వెబ్‌సైట్, టోల్‌ఫ్రీ నెంబర్లు పనిచేయడం లేదన్నారు. ఎడిట్ ఆప్షన్, సబ్జెక్టు ఎంపికలను చూపించడం లేదని వివరించారు. తక్షణమే ఈ సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు శివ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సజ్జల శ్రీధర్ రెడ్డికి మే 6 వరకు రిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మద్యం స్కాం కేసులో సజ్జల శ్రీధర్ రెడ్డికి విజయవాడ ఎసిబి కోర్టు మే 6 వరకు రిమాండ్ విధించింది. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన శ్రీధర్ రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి శనివారం విజయవాడ కోర్టులో ప్రవేశపెట్టారు. అనంతరం ఆయనను విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

ఈ కేసులో ఎ6గా సిట్ ఎఫ్ఐఆర్‌లో ఆయన పేరును పొందుపరిచింది. 2019లో వైసిపి ప్రభుత్వ హయాంలో మద్యం విధానం ముసుగులో ముడుపులు ఎలా కొల్లగొట్టవచ్చనే విషయం కోసం ఏర్పాటుచేసిన రెండు సమావేశాల్లోనూ శ్రీధర్ రెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు సిట్ పేర్కొంది.

## పోలవరం సర్వే సాంకేతికంగా జరగలేదు

- వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వడానికి చేసిన సర్వే సాంకేతికంగా జరగలేదని, 2017 కటాఫ్ డేట్ పెట్టారని, అప్పటికి 18 ఏళ్ల నిండని వాళ్లను పరిగణనలోకి తీసుకోలేదని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితులు శనివారం విజయవాడలో వైఎస్ షర్మిలను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అప్పుడు 17 ఏళ్లు ఉన్న వాళ్లు ఇప్పుడు 25 ఏళ్ల వయసుకు వచ్చారని, ముంపు ప్రాంత బాధితుల సంఖ్యపై మళ్లీ సర్వే చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఇచ్చిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో ఇళ్లకు కనీస వసతులు కూడా లేవన్నారు. భూమి కోల్పోయిన వారికి ఇచ్చిన భూమిపై కూడా ఎటువంటి హక్కులు లేవన్నారు. నేటికీ 95 వేల కుటుంబాలకు న్యాయం చేయాల్సి ఉందని, కేవలం 11 వేల కుటుంబాలకు దక్కింది అరకొర పరిష్కారమేనని పేర్కొన్నారు.

ప్రాజెక్టును ఫేజ్–1, ఫేజ్–2 అంటూ ముక్కలు చేశారని, 45.7 మీటర్ల ఎత్తు ప్రాజెక్టును 41.15 మీటర్లకు కుదించారని, దీనికి కారణం గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఎత్తు తగ్గించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో చీలిక తెచ్చారన్నారు. పోలవరం ప్రాజెక్టును బిజెపి ప్రభుత్వం అన్యాయం చేసిందని, 45 మీటర్లు ఎత్తు కడితేనే పోలవరం ప్రాజెక్టు అవుతుందని, లేని పక్షంలో అది లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అవుతుందన్నారు. 41 మీటర్ల ఎత్తుకు జగన్, బిజెపితో సర్దుకుపోయారని, అదే విధానాన్ని ఇప్పుడు చంద్రబాబు అమలు చేస్తున్నారని షర్మిల విమర్శించారు. నిర్వాసితులకు ఇవ్వాల్సిన రూ.33 వేల కోట్లను మిగుల్చుకోవడానికి ఎత్తు తగ్గించారన్నారు.

## ప్రతి ఇంటి నుంచి ఓ పారిశ్రామికవేత్త తయారవ్వాలి : మంత్రి నారాయణ

ప్రజాశక్తి–నెల్లూరు

ప్రతి ఇంటి నుంచి ఓ పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే ముఖ్యమంత్రి ఆశయాలకు అంకురార్పణంగా నెల్లూరులో స్మార్ట్ స్ట్రీట్‌ను ప్రారంభిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద స్మార్ట్ స్ట్రీట్ వెండార్స్‌కు ఇస్తున్న మూడు రోజుల శిక్షణ ముగింపు సభలో ఆయన మాట్లాడారు. మహిళలు పెద్ద పెద్ద వ్యాపారాలు చేసే స్థాయికి ఎదగాలనేదే తన అభిమతమన్నారు. వ్యాపారం విజయవంతంగా నిర్వహించాలంటే కొద్దిగా మెలకువలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుంటుందని ముఖ్యమంత్రి నమ్మకమని, అందుకనుగుణంగా గతంలో డ్వాక్రా, మెప్మా మహిళలకు రూ. 2500 కోట్ల విలువ చేసే ఇసుక వ్యాపారాన్ని అందజేశామన్నారు. నెల్లూరులోని నిరుపేదలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చానని, అందులో భాగంగా మొదటి దశలో 163 మంది వీధి వ్యాపారులను ఎంపిక చేసి వారితో స్మార్ట్ బజార్లను నిర్వహింపజేస్తున్నామని తెలిపారు.

# ఎయు ఘనమైన వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె మధుమూర్తి
- ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఎంతో ఘనమైన వారసత్వాన్ని కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయం అభ్యున్నతికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది వేడుకల ప్రారంభ దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖ బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శతాబ్ద కాలంగా ఎయు అనేక మంది జీవితాలను స్పృశించిందని అన్నారు. దేశ, ప్రపంచ ప్రగతికి దోహదపడిందని తెలిపారు. తనకు ఇక్కడ చెప్పలేనన్ని అపురూప జ్ఞాపకాలు ఉన్నాయని విద్యార్థిగా తన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైన్స్ టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ సాంకేతికతల వృద్ధికి పెట్టుబడిని పెడుతోందని తెలిపారు. త్వరలో రాష్ట్రంలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు అవుతుందని చెబుతూ దాని ప్రాముఖ్యతను వివరించారు. విశిష్ట అతిథి ఐఐటి పాలక్‌డ్ డైరెక్టర్ ఎ.శేషాద్రి శేఖర్ మాట్లాడుతూ.. సమగ్ర విద్యను అందించాల

# 'కొల్లేరు'కు శాశ్వత పరిష్కారం చూపండి

- మూడో కాంటూరుకు కుదించి ఉపాధి, అభివృద్ధి చేపట్టాలి
- సుప్రీంకోర్టులో ప్రభుత్వం ఇంప్లీడ్ పిటిషన్ వేసి వాస్తవాలు చెప్పాలి : వి. శ్రీనివాసరావు
- కొల్లేరు గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటన


తమ సమస్యలను సిపిఎం బృందానికి వివరిస్తున్న కొల్లేరు ప్రజలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి.. ఉపాధి, అభివృద్ధి పనులు చేపట్టి ప్రభుత్వం అక్కడి ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. కొల్లేరు గ్రామాల్లో శనివారం సిపిఎం బృందం పర్యటించింది. మాధవపురం పక్షుల కేంద్రం, పెదఎడ్లగాడి వద్ద కొల్లేరు ప్రాంతాన్ని పరిశీలించింది. గుడివాకలంక, కొవ్వాడలంక గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు ఘంటసాల నాగరాజు, జయమంగళ తిరుపతి వెంకన్న అధ్యక్షతన జరిగిన సభల్లో అక్కడి గ్రామస్తులు తాతపూడి చందు, దొరబాబు, కొల్లేరు నాయకులు ఘంటసాల వెంకటలక్ష్మి, ఘంటసాల మహాలక్ష్మిరాజు, ఇతర పెద్దలు మాట్లాడారు. 2006 నుంచి వారు పడుతున్న కష్టనష్టాలను చెబుతూ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఉపాధి లేక ఇక్కడి ప్రజలు వలసపోతున్నారని, అభివృద్ధి పనులు పూర్తిగా నిలిపివేశారని తెలిపారు. ఐదో కాంటూరులో లేని గ్రామాలను సైతం ధ్వంసం చేశారని, జిరాయితీ భూములను సైతం ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొవ్వాడ లంక, తదితర గ్రామాల ప్రజలకు సెంటుభూమి కూడా లేకుండా పోయిందన్నారు. ఆది నుంచి కొల్లేరు గ్రామాల ప్రజలకు సిపిఎం అండగా ఉందని, గతంలో నిర్వహించిన ఉద్యమాలను గుర్తు చేశారు. తమ సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఆయా సభల్లోనూ, పెద ఎడ్లగాడి వంతెనపై మీడియాతోనూ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తమ భవిష్యత్తు ఏమిటనే భయం కొల్లేరు ప్రజల్లో కనిపిస్తోందన్నారు. మూడు, ఐదు కాంటూరుల మధ్య మూడు లక్షల మంది ప్రజలు నలిగిపోతున్నారని తెలిపారు. పర్యావరణానికి ఎవరూ వ్యతిరేకం కాదని, ఇక్కడి పక్షులు, ప్రజలు ఎప్పటి నుంచో కలిసిపోయారని అన్నారు. జబ్బు ఒకటైతే మందు మరొకటి వేస్తున్నారని ప్రభుత్వాన్ని విమర్శించారు. అప్పట్లో జలగం వెంగళరావు ప్రభుత్వం 118 జిఒ ద్వారా సొసైటీలు ఏర్పాటు చేసి చేపల చెరువులను ప్రోత్సహించిందన్నారు. వాటిని ఇప్పుడు సుప్రీంకోర్టు ఉత్తర్వుల పేరుతో కొట్టేస్తున్నారని చెప్పారు. కొల్లేరులో విధ్వంసం ఆపాలంటూ ఢిల్లీలో 15 ఏళ్ల క్రితమే సిపిఎం పోరాటం జరిపిందని గుర్తుచేశారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి గ్రామాలను కాపాడి, అభివృద్ధిని చేపట్టి శాశ్వత పరిష్కారం చేపట్టాలని డిమాండ్ చేశారు. కొల్లేరు ప్రజలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**ఇప్పటికైనా సుప్రీంకోర్టుకు వాస్తవాలు చెప్పండి**

ఇప్పటికైనా ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసి వాస్తవ పరిస్థితులను కోర్టుకు వివరించాలని శ్రీనివాసరావు కోరారు. రెగ్యులేటర్ల నిర్మాణం చేపడితే వరదలను నివారించవచ్చునన్నారు. వన్య ప్రాణులను కాపాడాలని కోరారు. మూడో కాంటూరుకు కుదించినా టూరిజం అభివృద్ధికి బోలెడన్ని అవకాశాలు ఉన్నాయన్నారు. ముందుగా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఇక్కడి ప్రజలకు అభయం ఇచ్చి కలిసికట్టుగా ముందుకు సాగేలా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ.. పర్యావరణం ఉండాలంటే ముందు ప్రజలు ఉండాలన్నారు.

2006 ఆపరేషన్ కొల్లేరు సమయంలో జరిగిన పోరాటంలో సిపిఎం నాయకులను అప్పటి ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా జైల్లో సైతం పెట్టిందన్నారు. 120 జిఒ కొల్లేరుకు ఉరితాడు వంటిదని అప్పుడే చెప్పామని, ఇప్పుడు అదే రుజువైందని అన్నారు. కొల్లేరు కాలుష్యానికి ఇక్కడి ప్రజలు కారణం కాదని, పరిశ్రమలు కారణమని తెలిపారు. సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ... కొల్లేరు ప్రజలకు అండగా ఉంటామని, సమస్య పరిష్కారమయ్యే వరకూ కొల్లేరు ప్రజలవైపే నిలబడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా నాయకులు ఆర్.లింగరాజు, డిఎస్‌విడి.ప్రసాద్, కె.శ్రీనివాస్, పిల్లి రామకృష్ణ, లెనిన్, కట్టా భాస్కర్, మానుకొండ వీర్రాజు, ఇస్సాక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## 'ఉర్సా'కు కేటాయింపులను రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖలో రూ.250 కోట్ల విలువ కలిగిన 60 ఎకరాల భూమిని ఉర్సా ఐటి కంపెనీకి ధారాదత్తం చేయడాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం తీవ్రంగా ఖండించారు. అది బోగస్ కంపెనీ అని, తక్షణమే కేటాయించిన భూములను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడుతో కలిసి జగదాంబలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఐటి ఉద్యోగాల కల్పన పేరుతో విశాఖలో ఉన్న అత్యంత విలువైన కొండలను, ప్రభుత్వ భూములను ప్రయివేట్ ఐటి సంస్థలకు టిడిపి కూటమి ప్రభుత్వం కట్టబెడుతోందన్నారు. పదిహేనేళ్లుగా ఐటి ఉద్యోగాలు కల్పిస్తామని ఆశలు చూపించి భూములను కాజేస్తున్నారని విమర్శించారు. విశాఖపట్నం హిల్ నెంబర్ 3లో మూడున్నర ఎకరాలు, కాపులుప్పాడలో 56 ఎకరాలు భూమిని ఐటి కంపెనీలకు కేటాయించారని తెలిపారు. ఉద్యోగాలు కల్పించని, రిజిస్ట్రేషన్‌లేని కంపెనీలకు ఆఘమేఘాలమీద కేటాయింపులు జరిగిపోయాయన్నారు. రెండు నెలలు క్రితమే రిజిస్ట్రేషన్ అయిన ఉర్సా కంపెనీకి కారుచౌకగా భూములను ధారదత్తం చేయడమంటే భూములను కాజేయడమేనని విమర్శించారు. సుమారు రూ.250 కోట్ల విలువైన ప్రజల ఆస్తులను ప్రయివేట్ వ్యక్తులకు, సంస్థలకు కట్టబెట్టడం సరికాదన్నారు. ఉర్సాకు కేటాయించిన భూములను తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రుషికొండ భూములను టిసిఎస్ కంపెనీకి ఎకరం 99 పైసల చొప్పున కట్టబెట్టారన్నారు. కోట్ల రూపాయల విలువ కలిగిన భూములను కారుచౌకగా ఎందుకు కట్టబెడుతున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కంపెనీలతో చేసుకున్న ఎంఒయులను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. లూలూ కంపెనీకి, అదానీ డేటా సెంటర్ వంటి వాటికి కారుచౌకగా ప్రభుత్వ స్థలాలను అప్పగిస్తూ, ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగాల కల్పన పేరుతో బోగస్ ఐటి కంపెనీలకు భూములను కట్టబెడుతుంటే సిపిఎం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. గతంలో బ్రాండిక్స్ కంపెనీకి ఎకరం రూపాయి చొప్పున వెయ్యి ఎకరాల భూమిని 99 ఏళ్ళకు ఇచ్చారన్నారు. 60 వేల ఉద్యోగాలు కల్పిస్తామని ఎంఒయు చేసుకుని నేటికి 22 వేల మందికి మాత్రమే ఉపాధి చూపిందని తెలిపారు. రాయితీలు పొందిన బ్రాండిక్స్ నేడు అధిష్టాన్ కంపెనీగా పేరు మార్చుకున్న విషయాన్ని గుర్తు చేశారు. జగ్గునాయుడు మాట్లాడుతూ విశాఖ నడిబొడ్డులో విప్రో, సత్యం (నేడు టెక్ మహీంద్ర) వంటి అనేక ఐటి కంపెనీలను భూములిచ్చినా ఉద్యోగాలు కల్పన మాత్రం నామమాత్రంగానే ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు ఎంత భూమిని ఐటి కంపెనీలకు కట్టబెట్టింది? ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారు? అన్న విషయాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## 'ఉపాధి' కార్మికుడు మృతి

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

గన్నెరాజు (ఫైల్)

శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలంలోని ఇసకలపాలెం సమీపంలోని సాగునీటి కాలువలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన గుజ్జల గన్నెరాజు (67) శనివారం అకస్మాత్తుగా మృతి చెందాడు. శనివారం ఉదయం మిగతా కార్మికులతో కలిసి ఉపాధి హామీ పనులకు గన్నెరాజు వెళ్లారు. సాగునీటి కాలువలో మట్టి, పిచ్చిమొక్కలు తొలగిస్తుండగా అకస్మాత్తుగా అక్కడికక్కడే కుప్పకూలిపోయి మరణించారు. టెక్నికల్ అసిస్టెంట్ లలితమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీరాములు సమాచారం మేరకు ఎపిఒ బి.పార్వతి సంఘటనా స్థలానికి చేరుకుని కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

## హార్బర్ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు

- మంత్రి బిసి.జనార్దన్‌రెడ్డి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి (కాకినాడ జిల్లా)

హార్బర్‌ను పరిశీలిస్తున్న మంత్రి జనార్దన్ రెడ్డి

కాకినాడ జిల్లా యు.కొత్తపల్లిలోని ఉప్పాడ-రామన్నపాలెం సమీపంలో నూతనంగా చేపట్టిన ఫిషింగ్ హార్బర్‌ను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి.జనార్దన్‌రెడ్డి తెలిపారు. హార్బర్ నిర్మాణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా టిడిపి పిఠాపురం నియోజవర్గం ఇన్‌ఛార్జ్ ఎస్‌వివిఎస్‌ఎస్.వర్మ హార్బర్ నిర్మాణం వల్ల తలెత్తుతున్న పలు సమస్యలను ఆయనకు వివరించారు.

గత వైసిపి పాలనలో మినీ హార్బర్ పనుల్లో అనేక సమస్యలు ఎదురయ్యాయని తెలిపారు. హార్బర్ పనుల నిర్మాణానికి రూ.361 కోట్ల నిధులను విడుదల చేసినట్లు తెలిపారు. మత్స్యకార సంఘం నాయకులు మాట్లాడుతూ హార్బర్ నిర్మించిన విధానం వల్ల వేటకు వెళ్లి తిరిగి వస్తున్న మత్స్యకారుల బోట్లు గట్టును ఢీకొని బోట్లు ధ్వంసం అవుతున్నాయని, మత్స్యకారులు మత్స్యాత పడుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ హార్బర్‌లో తలెత్తుతున్న సమస్యలను సిఎం చంద్రబాబు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఐదు నెలల్లో ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇస్తున్న భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచినట్లు తెలిపారు.

## విభిన్న వాతావరణ పరిస్థితులు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రంలో ఒక వైపు ఎండల తీవ్రత నెలకొని ఉండగా మరొక వైపు అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం నెలకొందన్నారు. శనివారం వైఎస్ఆర్ జిల్లా సిద్దవటంలో 42.5డిగ్రీలు, విజయనగరం జిల్లా గోస్పాడులో 42.2డిగ్రీలు, విజయనగరం జిల్లా తుమ్మికపల్లిలో 41.9డిగ్రీలు, ప్రకాశం జిల్లా పునుగోడులో 41.8 డిగ్రీలు, కర్నూలు జిల్లా లద్దగిరిలో 41.1డిగ్రీలు చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. వీటితో ఆటు వైఎస్ఆర్ జిల్లాలో 24చోట్ల, సంద్యాలలో 22, ప్రకాశంలో 14 చోట్ల మొత్తం మీద 95 ప్రాంతాల్లో 40 డిగ్రీల కంటే అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈనెల27న అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం, కాకినాడ జిల్లా జగ్గంపేట, కిర్లంపూడి, ఏలేశ్వరం మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు. వడగాడ్పులు వీచే మండలాల్లో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 7,కాకినాడలో 3, తూర్పుగోదావరిలో 5, ఏలూరులో 2 మండలాలు ఉన్నాయని తెలిపారు.

## యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి నాగేంద్రబాబు కన్నుమూత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సికె.నాగేంద్రబాబు (ఫైల్‌ఫోటో)

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర పూర్వ కార్యదర్శి, అనంతపురం జిల్లా సీనియర్ నేత సికె.నాగేంద్ర బాబు (70) కన్నుమూశారు. దీర్ఘకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన అనంతపురం ప్రజాశక్తి కాలనీలోని ఆయన స్వగృహంలో శుక్రవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. శనివారం సాయంత్రం అనంతపురం నగరంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. 2021 జులై 31న ప్రధానోపాధ్యాయుడిగా ఆయన ఉద్యోగ విరమణ చేశారు. నాగేంద్రబాబు మృతిపై యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా కమిటీలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. నాగేంద్రబాబు భౌతికకాయంపై యుటిఎఫ్ జెండాను కప్పి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉపాధ్యాయుడిగా, యుటిఎఫ్ నాయకుడిగా విద్యా రంగం సమస్యల పరిష్కారంలో నాగేంద్రబాబు చేసిన పోరాటాలను పలువురు కొనియాడారు. యుటిఎఫ్, ఎపిటిఎఫ్, ఎస్‌టియు, వైఎస్ఆర్‌టియు, జెవివి, డివైఎఫ్ఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ఇతర ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, పాతతరం నేతలు నివాళులర్పించారు.

## అమరావతిలో కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్మాణాలపై మోడీ స్పష్టతనివ్వాలి

- భూముల కేటాయింపు, నిర్మాణాల పురోగతిపై శ్వేతపత్రం విడుదల చేయాలి : సిహెచ్ బాబూరావు
- రాజధాని ప్రాంతంలో సిపిఎం బృందం పర్యటన

తుళ్లూరు సమీపంలో జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయం కోసం భూమిని కేటాయించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిహెచ్ బాబూరావు తదితరులు

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని అమరావతిలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల నిర్మాణాలపై ప్రధాని మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలని, భూముల కేటాయింపు, నిర్మాణాల పురోగతిపై శ్వేతపత్రం విడుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. 2015 అక్టోబర్ 22న రాజధాని అమరావతికి మోడీ శంకుస్థాపన చేయగా తొమ్మిదిన్నరేళ్లు గడిచినా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు ఎందుకు జరగలేదో రాష్ట్ర ప్రజలకు వివరించాలన్నారు. వచ్చే నెల 2న అమరావతికి ప్రధాని మోడీ రానున్న నేపథ్యంలో రాజధాని ప్రాంతంలో సిపిఎం బృందం శనివారం పర్యటించింది. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల నిర్మాణం కోసం కేటాయించిన భూములను పరిశీలించింది. అనంతరం తుళ్లూరులోని ప్రజాసంఘాల కార్యాలయంలో బాబూరావు మాట్లాడుతూ.. రాజధానిలో 41 కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం 300 ఎకరాలకుపైగా స్థలం కేటాయించినా నిర్మాణాలు జరగడం లేదన్నారు. కొన్ని సంస్థలు నిర్మాణాలు మొదలు పెట్టకముందే అనుమతులు రద్దవుతున్నాయని తెలిపారు. తుళ్లూరులో జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నూతన కార్యాలయ నిర్మాణం రూ.50 కోట్లతో జరగాల్సి ఉండగా కేవలం ప్రహరీ నిర్మాణంతో సరిపెట్టారని, అక్కడ పిచ్చి చెట్లు పెరిగాయని, కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యానికి ఇదొక తార్కాణమని వివరించారు. ఇందిరా గాంధీ ఓపెన్ యూనివర్సిటీ నిర్మాణం కోసం 50 ఎకరాలు కేటాయిస్తే.. ఎనిమిది సెంట్లలోనే నిర్మిస్తున్నారని తెలిపారు. హెచ్‌పిసిఎల్, బిఎస్ఎన్ఎల్, హడ్కో, ఇండియన్ నావీ వంటి సంస్థలు, సిండికేట్, ఆంధ్రా, కెనరా తదితర బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు, ఇతర సంస్థలకు భూములు కేటాయించినా నిర్మాణాల ఊసే లేదని చెప్పారు. టిడిపి, బిజెపి, జనసేన కూటమి అధికారంలో ఉన్నా రాజధానిలో కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం కొట్టచ్చినట్లు కనిపిస్తోందని తెలిపారు. రాజధాని నిర్మాణానికి మరో 44 వేల ఎకరాలు తీసుకునే విషయంలో ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు గందరగోళం రేకెత్తించేలా ఉన్నాయని, రాజధాని ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ ఈసారైనా రాజధాని నిర్మాణంపై శ్రద్ధ చూపాలన్నారు. పరిశీలనలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, నాయకులు ఎం.భాగ్యరాజు, జె.నవీన్ ప్రకాష్, కె.ఆంజనేయులు, షేక్ జానీ, బక్కిరెడ్డి, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## గ్లోబల్ టాప్ 25 క్లబ్‌లోకి రిలయన్స్

- రూ.10 లక్షల కోట్లకు నికర విలువ

**న్యూఢిల్లీ :** ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) గ్లోబల్ టాప్ 25 విలువైన కంపెనీల్లో ఒక్కటిగా చేరింది. 118 బిలియన్ డాలర్ల నికర విలువ (రూ.10 లక్షల కోట్లు)తో మైక్రోసాఫ్ట్, అల్ఫాబెట్, సౌదీ ఆరామ్కో సరసన చేరింది. చమురు నుంచి టెలికం రంగాల్లో రాణిస్తోన్న ఆర్ఐఎల్ అంతర్జాతీయంగా 21వ అత్యంత విలువైన కంపెనీగా నిలిచిందని బ్లూమ్‌బర్గ్ డాటా వెల్లడించింది. రిలయన్స్ మార్కెట్ కాపిటలైజేషన్ 140 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది టోటల్ ఎస్ఎ, బిపి పిఎల్‌సి కంటే ఎక్కువ. నిఫ్టీ 50లోని 19 కంపెనీల మార్కెట్ విలువతో సమానం. 2024-25 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4) ఫలితాలను రిలయన్స్ ఇండస్ట్రీస్ శుక్రవారం ప్రకటించింది. కంపెనీ లాభాలు 2.4 శాతం పెరిగి రూ.19,407 కోట్లకు చేరినట్లు తెలిపింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ.5.5 డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 2.4 లక్షల కోట్ల నుంచి రూ. 2.6 లక్షల కోట్లకు చేరింది. 2025 మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఆర్ఐఎల్ నికర లాభాలు రూ.69,648 కోట్లకు చేరింది. కంపెనీ నికర విలువ రూ.10 లక్షల కోట్లతో రికార్డు నెలకొల్పింది. గతేడాది ప్రపంచ వ్యాపార సమస్యాత్మకంగా నిలిచిందని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేష్ అంబానీ అన్నారు. బలహీన ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో మెరుగైన పనితీరును కనబర్చినట్లు తెలిపారు.

**ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అనంత్ అంబానీ**

ముకేష్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీని ఆర్ఐఎల్‌కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. మే 1 నుంచి ఇది అమల్లోకి రానుందని ఆకంపెనీ తెలిపింది. వచ్చే ఐదేళ్లపాటు అనంత్ ఈ హోదాలు కొనసాగనున్నారు. ప్రస్తుతం ఆయన నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు.

## 'స్విగ్గీ సిక్సెస్'ను ప్రారంభించిన స్విగ్గీ

**న్యూఢిల్లీ :** ప్రస్తుత క్రికెట్ సీజన్‌తో ప్రతీ సిక్స్‌పై భారీగా ఆదాలను అందించేలా స్విగ్గీ సిక్సెస్'ను ప్రారంభించినట్లు స్విగ్గీ తెలిపింది. క్రికెట్ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారం జరుగుతున్న సమయంలో సిక్స్ కొట్టిన ప్రతిసారి ఆర్డర్లపై యూజర్లు గరిష్ఠంగా 66 శాతం లేదా రూ.266, రూ.166, రూ.66ను తగ్గింపును పొందవచ్చని పేర్కొంది. స్విగ్గీలోని 50వేల పైగా రెస్టారెంట్లలో ఈ ఆఫర్లను అందిస్తున్నామని పేర్కొంది. ఈ ఆఫర్ లైవ్ క్రికెట్ మ్యాచ్ సమయంలో సిక్స్ కొట్టిన క్షణం నుంచి కేవలం పది నిముషాలు మాత్రమే చెల్లుబాటు అవుతుందని ఆ సంస్థ ప్రతినిధి సిద్ధార్థ భాకూ తెలిపారు.

## ఇద్దరు కౌలు రైతుల ఆత్మహత్య

ప్రజాశక్తి - నందవరం, వెల్దుర్తి

బోయ రంగన్న (ఫైల్)

వీరారెడ్డి (ఫైల్)

కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక, చేసిన అప్పులకు వడ్డీల భారం అధికంగా మారడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇద్దరు కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మృతుల కుటుంబసభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. కర్నూలు జిల్లా నందవరం మండలంలో బోయ రంగన్న (55) ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిరప, ఉల్లి తదితర పంటలు సాగు చేస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా పంటలు దిగుబడి రాకపోవడంతో సుమారు రూ.20 లక్షల వరకు అప్పులు మిగిలాయి. అప్పుల భారం భరించలేక గురువారం సాయంత్రం పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు ఆయనను తొలుత ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం ఆ తర్వాత కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి రంగన్న మృతి చెందారు. ఆయనకు భార్య శాంతమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

పల్నాడు జిల్లా వెల్దుర్తి గ్రామానికి చెందిన పులుసు వీరారెడ్డి (44) తనకున్న రెండెకరాల సొంత పొలంతోపాటు తొమ్మిది ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి పంట సాగు చేస్తున్నారు. మూడేళ్ల నుంచి సరైన దిగుబడులు లేకపోవడంతో రూ.25 లక్షలకుపైగా అప్పులయ్యాయి. అప్పులు తీరే మార్గం లేకపోవడంతో శుక్రవారం తన పొలంలోని చెట్టుకు ఉరేసుకుని మృతి చెందారు. శనివారం ఉదయం అటుగా వెళ్లిన వారు గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

## వివేకా కేసులో సాక్షుల మృతిపై విచారణ

- పరమేశ్వర్‌రెడ్డిని విచారించిన సిట్ బందం
- విచారణకు రమ్మని రంగన్న భార్యకు నోటీసులు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

పరమేశ్వం రెడ్డిని తీసుకెళ్తున్న పోలీసులు

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో సాక్షులుగా ఉన్న వారు ఒక్కొక్కరుగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై సిట్ విచారణ చేపట్టింది. వివేకా హత్య కేసులో మొత్తం ఆరుగురు సాక్షులు మృతి చెందిన విషయం తెలిసిందే. కీలక సాక్షి రంగన్న మృతితో ఈ కేసును టిడిపి కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. వరుసగా సాక్షులు మృతి చెందడంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. రంగన్న కేసును పోలీసులు తిరగదోడుతున్నారు. రంగన్నకు ముందు సాక్షులైన కె.శ్రీనివాసరెడ్డి 2019 సెప్టెంబర్ 3న, వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వాహన డ్రైవర్ నారాయణ యాదవ్ 2019 డిసెంబర్ 6న, డాక్టర్ ఇసి.గంగిరెడ్డి 2020 అక్టోబర్ 3న, గంగాధర్‌రెడ్డి 2022 జూన్ నెలలో, డాక్టర్ అభిషేక్‌రెడ్డి 2025 జనవరి 10న మరణించారు. దీనిపై గత కొంతకాలంగా పులివెందులలో సిట్ అధికారులు విచారిస్తున్నారు. పట్టణంలో నివాసం ఉంటున్న శ్రీనివాస్‌రెడ్డి బామ్మర్ది కసునూరు పరమేశ్వర్‌రెడ్డి ఇంటికి శనివారం సిట్ బందం వెళ్లి ప్రత్యేక వాహనంలో విచారణ కోసం లింగాల పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లారు. అక్కడ సుదీర్ఘంగా విచారించి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఈ కేసులో మరో కీలక సాక్షి, మృతుడు రంగన్న భార్య సుశీలమ్మను విచారణకు రావాల్సిందిగా సిట్ అధికారులు నోటీసు ఇచ్చారు. వివేకా కేసులో సాక్షులుగా ఉన్న వారి మృతి వెనుక మిస్టరీ ఏమిటన్న దానిపై సిట్ అధికారులు ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది.

## పిపిపిలో ఆర్‌టిసి డిపోల అభివృద్ధి

- మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-మడకశిర (సత్యసాయి జిల్లా)

ప్రభుత్వ, ప్రయివేటు సంయుక్త ఆధ్వర్యంలో ఆర్‌టిసి డిపోలను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో రాబోయే ఒకటిన్నర సంవత్సరంలో రెండు వేల ఎలక్ట్రికల్ బస్సులు రోడ్లపై తిరగడానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.రాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. మడకశిర డిపో నుంచి కదిరి - అనంతపురం వయా ముదిగుబ్బ, బత్తలపల్లి, కదిరి- రాయచోటి వయా

సంపాదకీయం

# విద్యా కుసుమాలు!

'ఎ దగడానికెందుకురా తొందరా-ఎదర బతుకంతా చిందర వందరా..' అంటారు ఒక సినీ గీతంలో ఆరుద్ర. విద్యార్థి దశలో ఎదుర్కునే పరీక్షలు, వాటిని అధిగమించడానికి పడే తిప్పలు... వేసే తెల్లమొఖాలను కూడా ఈ పాటలో ఆయన ప్రస్తావిస్తారు. 'మ్యాటనీ ఆట ఉంది. బోటనీ పాఠముంది ... సోదరా, ఏది బెస్టురా.?.. అంటే 'ఉందిగా సెప్టెంబర్..మార్చిపైనా..' అంటూ వాయిదా పద్ధతులను తలచుకునే తరం కూడా మారింది. ఇప్పటి విద్యార్థులకు పరీక్షలు వాటి ఫలితాలు జీవన్మరణ సమస్యలుగా మారాయి. నూటికి నూరు శాతం మార్కులు, అత్యుత్తమ ర్యాంకులు కొలబద్దలుగా నిలిచాయి. పోటీ ప్రపంచపు తూకపు రాళ్లలో ఒక్క గ్రాము అటు ఇటూ అయినా విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల తరువాత నలుగురు, ఇంటర్మీడియట్ ఫలితాల తరువాత ఇద్దరు ఆత్మహత్యలకు పాల్పడినట్లు వచ్చిన వార్తలే నిదర్శనం. వెలుగు చూడనివి ఇంకొన్ని ఉండవచ్చు. ఒక అధ్యయనం ప్రకారం రాష్ట్రంలో ప్రతిరోజూ ఒక విద్యార్థి బలవన్మరణం పాలవుతున్నాడు. వీరిలో అత్యధికులు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు చెందిన వారేనన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్.సి.ఆర్.బి) గణాంకాల ప్రకారం 2014 నుండి 2022 వరకు రాష్ట్రంలో 3,690 మంది విద్యార్థులు (వీరిలో 1,609 మంది బాలికలు) అర్ధాంతరంగా జీవితాలను ముగించారు. ఈ ఎనిమిదేళ్ల కాలంలో కారణాలు ఏవైనా విద్యార్థుల ఆత్మహత్యలు 72 శాతం రాష్ట్రంలో పెరిగాయి. ఇటీవల పాత్రికేయులు ఇదే విషయాన్ని విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో ప్రస్తావించగా, విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్న విషయాన్ని అంగీకరిస్తూనే 'దానికో ప్యాట్రన్ (పద్ధతి) లేదని చెప్పారు. విద్యావ్యవస్థకు దాపురించిన ఈ దుస్థితికి కారణాలను ఆయన చెప్పలేదు.

'డబ్బుకు లేదే సిగ్గు, ఎగ్గు, న్యాయం...అదుంటే ఏ పనైనా ఖాయం' అని ఒక సినీ కవి రాస్తారు. ఉదారవాద ఆర్థిక సంస్కరణల యుగంలో అన్నింటికి దబ్బే కొలబద్ద! హద్దుల్లేని పెట్టుబడి లాభాల వేటలో ఖండాంతరాలు దాటి పరుగులు తీస్తుంటే, విద్య, వైద్యం, గౌరవప్రదమైన జీవితం వంటి కనీస అవసరాలు సామాన్యులకు ఎండమావులుగా మారుతున్నాయి. వాటి కోసమే తల్లిదండ్రులు తమ చిన్నారులను పరీక్షల, ర్యాంకుల ఎడారుల్లో పరుగులు పెట్టిస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పని చేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులదీ ఇదే స్థితి. ఎప్పటికప్పుడు కొత్త ర్యాంకర్లను ఉత్పత్తి చేయకుంటే వేలాడుతున్న కత్తి వారి మెడమీద పడటం ఖాయం! ఈ భయోత్పాత స్థితే అభం, శుభం తెలియని పసిపిల్లలకు మరణశాసనమౌతోంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం పూచీ పడాలి. వాటిని ప్రాథమిక హక్కులుగా మార్చాలి. ఈ స్ఫూర్తిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లి, వారిని కదిలించే బాధ్యతను అభ్యుదయ శక్తులు తీసుకోవాలి. భవిష్యత్తు పట్ల భయంలేని సమాజంలోనే కదా వేల ఆలోచనలు వికసించేది! 'వేర్ ద మైండ్ ఈజ్ వితవుట్ ఫియర్...' అంటారు విశ్వకవి రవీంద్రుడు!

పుట్టగానే పరిమళించే పువ్వుల పక్కనే, ఒక్క పుట్టుకలోనే రెండు జన్మలెత్తి ఇంద్రధనస్సు రెక్కలు తొడుక్కున్న సీతాకోకచిలుకలు ఉంటాయి. ఆ సీతాకోకచిలుకలు లేకుంటే, వాటి కష్టమే లేకుంటే పువ్వులెక్కడ? జీవరాశి మనుగడ ఎక్కడ? ప్రకృతిలో ప్రతి జీవికి తనదైన ప్రత్యేక నైపుణ్యం ఉంటుంది. మనుషులకు, విద్యార్థులకూ అంతే! పాఠశాల దశలో అష్టకష్టాలు పడిన ఐన్‌స్టిన్, థామస్ అల్వా ఎడిసన్, మన భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్‌లు సాధించిన ఘనతలే దీనికి ఉదాహరణలు. 'కృషి ఉంటే మనుషులు రుషులు (మేధావులు) అవుతారు...మహా పురుషులవుతారు...తరతరాలకు తరగని వెలుగవుతారు. ఇలవేలుపులౌతారు.' అంటే ఇదే! తమకు నచ్చిన అంశంపై విద్యార్థులు దృష్టి సారించాలి. పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. అందుకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత! ఆ బాధ్యతను అవి నెరవేర్చకుంటే నిలదీయాలి. పిరికితనం మాని పోరాడాలి! 'అధ్యయనం...పోరాటం! విద్యార్థి లోకపు నినాదంగా మారాలి! అప్పుడు మాత్రమే నిర్భీతితో విద్యా కుసుమాలు వికసిస్తాయి. యువతరం శిరమెత్తుతుంది. నవతరం గళం విప్పుతుంది.

**మీ బానిసత్వాన్ని మీరే పోగొట్టుకోవాలి. అందుకు దేవుడి మీద కానీ మహానుభావుల మీద కానీ ఆధారపడవద్దు.**
**- బి.ఆర్.అంబేద్కర్,**
**భారత రాజ్యాంగ నిర్మాత.**

# నవ కాశ్మీరం నుంచి పీహాల్గాం దాకా...

**కాశ్మీర్‌లో మా మూలనరం అలాగే ఉన్నదని జనరల్ మునీర్ ప్రకటించిన రెండు మూడు రోజుల్లోనే ఇంతటి హత్యాకాండ జరిగింది. ఎప్పుడో మహమ్మద్ అలీ జిన్నా, గోల్వాల్కర్ వంటి వారు ముందుకు తెచ్చిన ద్విజాతి సిద్ధాంతాన్ని కూడా జనరల్ మునీర్ ప్రస్తావించటం దుర్బుద్ధితోనే. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రాజకీయ, ఆర్థిక, దుస్సాహస చర్యలు టారిఫ్ యుద్ధాలతో ప్రపంచం తికమక పడుతున్న సమయంలోనే-ఆ దేశ ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ పన్నెండేళ్ల తర్వాత భారత సందర్శనకు వచ్చిన సమయంలోనే ఈ అమానుషానికి పాల్పడటంలో స్పష్టమైన, కచ్చితమైన, రాజకీయ, వ్యూహాత్మక సంకేతాలు ఉన్నాయి. కాశ్మీర్‌లో పర్యాటక రంగం పునరుద్ధరణ జరగకుండా ఆదిలోనే అడ్డుకోవడం దుండగుల పథకంగా కనిపిస్తుంది. ఎందుకంటే పారిశ్రామిక, వ్యవసాయ అవకాశాలు, అభివృద్ధి లేని ఆ రాష్ట్రంలో పర్యాటకమే ప్రధాన జీవనోపాధిగా కొనసాగుతుంది.**



ప్రస్తుతం

తెలకపల్లి రవి

జమ్ము కాశ్మీర్ లోని పహల్గాం ఉగ్రవాద దాడి భారత దేశాన్నే కాక ప్రపంచాన్నే దిగ్భ్రాంతికి గురిచేసింది. ఉగ్ర దాడిలో ఇంత పెద్ద సంఖ్యలో అమాయకులు బలికావడం ఇటీవలి కాలంలో ఇదే మొదటిసారి. ప్రకతి సౌందర్యానికి, పర్యాటకానికి పేరుగాంచిన మినీ స్విట్జర్లాండ్‌లో ఆహ్లాదకరంగా యాత్రకు వెళ్లిన పౌరులను చుట్టుముట్టి తలలో కాల్చి మరీ ప్రాణాలు తీయడం భయోత్పాతం సృష్టించడం కోసమే. మృతుల మత విశ్వాసాలను తెలుసుకొని మరీ హత్య చేశారన్నది మీడియాలో ప్రధానంగా వెల్లడవుతున్న కథనం. దీన్నిబట్టి ఇది మతపరమైన దాడిగా చిత్రించే ప్రయత్నాలు కూడా ఆయా శక్తులు తీవ్రం చేస్తున్నాయి. ఈ ఘాతుకానికి కారణమైన ద రెసిస్టెన్స్ ఫోర్స్ (టి.ఆర్.ఎఫ్) లష్కరితోయిబాకు ముసుగు మాత్రమేనని నిఘా వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి జాతి, మత, కుల, సాంస్కృతిక తదితర ముద్రలతో దురభిమానాలను రగిలించి ప్రజలను విభజించటం, విద్వేషాలు పెంచడం కుటిల రాజకీయాలలో భాగమే. పహల్గాం మారణకాండ భారతదేశాన్ని దెబ్బతీయటానికి జరిగిందేగాక మతపరమైన ఉద్వేగాల వైపు మళ్ళించటం నిజంగానే ఒక పెద్ద కుట్ర. ఉగ్రవాద బృందాలలోనూ ఒక ఆదిల్ ఉండగా ఈ నరహంతకుల బారి నుంచి యాత్రికులను కాపాడేందుకు సాహసంతో ప్రాణాలర్పించిన పోనీ రైడర్ పేరు కూడా ఆదిల్. తన కొడుకు ఉగ్రవాదుల నుంచి యాత్రికులను రక్షించినందుకు గర్విస్తున్నానని ఆదిల్ తండ్రి మహమ్మద్ గొప్పగా చెప్పారు. పాకిస్తాన్ సైన్యాధిపతి జనరల్ మునీర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన వెంటనే ఈ ఘాతుకం జరగడం కూడా యాదృచ్ఛికం కాదు. తన మనుగడ కోసం మరోసారి కాశ్మీర్‌లో చొరబాట్ల ద్వారా తీవ్రవాదాన్ని ఎగదోసేందుకు పాకిస్తాన్ సైనిక శక్తులు ఇదే సరైన అదను అని భావించినట్టు కనిపిస్తుంది. కాశ్మీర్‌లో మా మూలనరం అలాగే ఉన్నదని జనరల్ మునీర్ ప్రకటించిన రెండు మూడు రోజుల్లోనే ఇంతటి హత్యాకాండ జరిగింది. ఎప్పుడో మహమ్మద్ అలీ జిన్నా, గోల్వాల్కర్ వంటి వారు ముందుకు తెచ్చిన ద్విజాతి సిద్ధాంతాన్ని కూడా జనరల్ మునీర్ ప్రస్తావించటం దుర్బుద్ధితోనే. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రాజకీయ, ఆర్థిక, దుస్సాహస చర్యలు టారిఫ్ యుద్ధాలతో ప్రపంచం తికమక పడుతున్న సమయంలోనే-ఆ దేశ ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ పన్నెండేళ్ల తర్వాత భారత సందర్శనకు వచ్చిన సమయంలోనే ఈ అమానుషానికి పాల్పడటంలో స్పష్టమైన, కచ్చితమైన, రాజకీయ, వ్యూహాత్మక సంకేతాలు ఉన్నాయి. కాశ్మీర్‌లో పర్యాటక రంగం పునరుద్ధరణ జరగకుండా ఆదిలోనే అడ్డుకోవడం దుండగుల పథకంగా కనిపిస్తుంది. ఎందుకంటే పారిశ్రామిక, వ్యవసాయ అవకాశాలు, అభివృద్ధి లేని ఆ రాష్ట్రంలో పర్యాటకమే ప్రధాన జీవనోపాధిగా కొనసాగుతుంది. దేశంలోని వివిధ ప్రాంతాలకు సంకేతాలు పంపడానికి కూడా టూరిస్టులపై దాడి ప్రభావం చూపుతుంది. ఇద్దరు తెలుగువారు కూడా ఈ హత్యాకాండలో బలయ్యారు.

### ఉద్రిక్తతలకు పరాకాష్ట

సహజంగానే భారతదేశం దీనిపై తీవ్రంగా స్పందించింది. సౌదీ అరేబియా నుంచి ముందుగానే వచ్చేసిన ప్రధాని మోడీ తగు సమాధానం ఇస్తామని ప్రకటించారు. ఆ మరుసటి రోజు బీహార్ లోని మధుబనిలో రాజకీయ సభలో మాట్లాడుతూ ప్రధానమంత్రి ఊహించలేని స్థాయిలో తమ జవాబు ఉంటుందని హెచ్చరించారు. ఆ టెర్రరిస్ట్ గడ్డను తుడిచేస్తామని ప్రకటించారు.1960 నుంచి మూడు యుద్ధాలు తట్టుకొని కొనసాగుతున్న సింధూ జలాల ఒప్పందం నిలిపివేస్తున్నట్లు ఇండియా ప్రకటించింది. దేశంలోని పాకిస్తానీలు వెంటనే వెనక్కి వెళ్లాలని ప్రభుత్వం అల్టిమేటం జారీ చేసింది. పాక్ జాతీయుల వీసాలను రద్దు చేసింది. తమ తమ రాష్ట్రాల్లోని పాకిస్తాన్ పౌరులను గుర్తించి పంపేయాలని అధికారులను ఆదేశించింది. సైనిక దళాల ప్రధాన అధికారి ద్వివేది కాశ్మీర్‌లో పర్యటించి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సక్సేనాతో చర్చలు జరిపారు. సరిహద్దుల్లో కాల్పుల ఘటనలు, ఒక ఉగ్రవాది ఇల్లు పేల్చివేత అటు ఇటు మరికొన్ని మరణాలు సంభవించాయి. ఇందుకు ప్రతిగా పాకిస్తాన్ ప్రభుత్వం సిమ్లా ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేయడం అంటే యుద్ధం ప్రకటించడమేనని పాకిస్తాన్ వ్యాఖ్యానించింది. 1972 ఇందిరా గాంధీ, భుట్టోల సిమ్లా ఒప్పందం ఇరు దేశాలు సమస్యలను ద్వైపాక్షిక చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని, మరో దేశానికి చోటు ఇవ్వరాదని నిర్దేశిస్తున్నది. దాని రద్దు పర్యవసానాలు చాలా వుంటాయి. అదే విధంగా పాకిస్తాన్ భారత విమానాలకు గగనతలాన్ని మూసివేసింది. అమెరికాతో సహా ఇరుగు పొరుగు దేశాలు ఉగ్రదాడిని ఖండించాయి. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్ రెండు దేశాలు సంయమనం చూపాలని పిలుపునిచ్చారు. ఇలా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరాయి.

### రాజకీయ నేపథ్యం

దేశంలో వక్ఫ్ చట్టం, ప్రార్థనా స్థలాల చట్టం మార్పులు రాజకీయ న్యాయ పోరాటాలకు దారితీస్తున్న సమయం. పెద్ద రాష్ట్రాలైన బీహార్, ఉత్తర ప్రదేశ్ తర్వాత కేరళ, బెంగాల్, గుజరాత్, తమిళనాడు వంటివి వరుసగా ఎన్నికలకు వెళ్ళ తున్న సందర్భం. ఒకే దేశం ఒకే ఎన్నిక వంటి రాజకీయ, రాజ్యాంగ అంశాలు చర్చ నడుస్తున్న సమయం. మరీ ముఖ్యంగా కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చబడిన జమ్ముకాశ్మీర్‌లో తొలిసారిగా ఎన్నికైన ఓమర్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం హయాంలో కాశ్మీర్ జీవనాధారమైన పర్యాటక రంగం ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటూ వేసవి యాత్రికుల సందడి పెరుగుతున్న సమయం. మరో రెండు మాసాల్లో జులైలో అమర్‌నాథ్ యాత్ర కూడా ప్రారంభం కానుంది. మరో వంక చూస్తే పాకిస్తాన్ ఆర్థికంగా పూర్తి దివాలా తీసి రాజకీయ అస్థిరతలో అంత: కలహాల్లో చిక్కి సైన్యం పట్టు పెరుగుతున్న తరుణం. ప్రజల మద్దతుతో ఎన్నికైన ఓమర్ ప్రభుత్వం నిలదొక్కుకోవడానికి సహకరించకపోగా కేంద్రం సర్వాధికారాలు గుప్పిట్లో పెట్టుకోవడం వల్ల ఉపాధి అవకాశాలు పెరక్క అసంతృప్తి వ్యాపిస్తున్నదని పరిశీలకులు చెబుతూ వచ్చారు. ప్రశాంతత నెలకొనగానే కాశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర ప్రతిపత్తిని ఇస్తామని సుప్రీంకోర్టుకు పార్లమెంటుకు హామీ ఇచ్చిన మోడీ ప్రభుత్వం దాన్ని వెంటనే అమలు చేసి రాష్ట్ర ప్రభుత్వాన్ని బలోపేతం చేయాలని ప్రజాస్వామ్య శక్తులు కోరుతూ వచ్చాయి. శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో స్థానిక ప్రజల ముఖ్యంగా యువత స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు ఆటంకం కల్పించడంపై ఆందోళన వ్యక్తమవుతూ వస్తోన్న సమయంలో ఈ దాడి అనేక విధాల కాశ్మీర్‌ను మరింతగా కష్టాలపాలు చేసే ప్రమాదం పొంచి వుంది.

### నిఘా, భద్రతా వైఫల్యం

ఈ దాడుల తర్వాత జరిగిన అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాలు కేంద్రం తీసుకునే చర్యలకు పూర్తి మద్దతు ప్రకటిస్తూనే పూర్వపరాలను ప్రశ్నించాయి. నిఘా విభాగం నుంచి ముందస్తు సమాచారాలు అందలేదా? భద్రతా దళాలు అప్రమత్తంగా లేవా? ఇలాంటి ప్రశ్నలు వచ్చాయి. జమ్ము కాశ్మీర్ శాంతిభద్రతలు పూర్తిగా కేంద్రం అధీనంలోనే ఉన్నాయి. ఆర్టికల్ 370 రద్దు తర్వాత రూపుదాల్చిందంటున్న నవ కాశ్మీరం (నయా కాశ్మీర్) ఒక్కసారిగా పహల్గాంకు ఎందుకు చేరిందని ప్రముఖ పాత్రికేయుడు రాజ్‌దీప్ సర్దేశాయ్ వంటి వారు ప్రశ్నించారు. ఎందుకంటే పాక్ జనరల్ వ్యాఖ్యలకు ముందే ఏదో కుట్ర తలపెట్టారని కథనాలు వస్తూనే ఉన్నాయి. తాము ముందే నిఘా సమాచారం అందించినప్పటికీ భద్రతా లోపం జరిగిందని కేంద్రం చూచాయిగా అంగీకరించింది. అయితే బైసరన్ లోయకు పర్యాటకులను అనుమతిస్తున్నట్లు అధికారులు తెలియజేయలేదని వ్యాఖ్యానించింది. ఏడాది పొడుగునా జరిగే బైసరన్ పర్యాటకం గురించి ప్రత్యేకించి తెలియజేయడం ఏమీ ఉండదని రాష్ట్ర పోలీసులు చెబుతున్నారు. ఇక్కడే స్పష్టమైన సమాచారం, సమన్వయ లోపం కనిపిస్తుంది. వాస్తవానికి నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం విఫలం అయిందని అభిప్రాయం కలిగించటానికి కేంద్రం ప్రయత్నిస్తోందని కాశ్మీర్ సిపిఎం సీనియర్ నాయకుడైన యూసఫ్ తరిగామి ఆ పార్టీ 24వ మహాసభ సందర్భంగానే వ్యాఖ్యానించారు. ఇప్పుడైనా రాష్ట్రానికి పూర్తి అండదండలు ఇవ్వడం ద్వారా ప్రజలకు ఉపాధి కల్పన, విశ్వాసం పాదుకొల్పాలని రాష్ట్రంలో జరిగిన అఖిలపక్ష సమావేశం కోరింది.

### అవాంఛనీయం..అత్యవసరం..

ఈ ఘటనల తర్వాత దేశంలో కొన్ని చోట్ల విశ్వవిద్యాలయాల్లో ఇతర కేంద్రాల్లో కాశ్మీర్ విద్యార్థులపై దాడులు జరగటం ఆందోళన కలిగిస్తుంది. హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, చండీగఢ్, ఉత్తరాఖండ్‌లలో సంఘ పరివార్ సంస్థలు వేధింపులకు దిగుతున్నట్లు వార్తలు వచ్చాయి. డెహ్రాడూన్‌లో అనేక మంది విద్యార్థులు విద్యాసంస్థలను వదిలి వెళ్లిపోవాల్సిన పరిస్థితి. ఉత్తర ప్రదేశ్‌లో ఆమిటీ యూనివర్సిటీలో కాశ్మీర్ విద్యార్థిని తీవ్రంగా కొట్టిన వీడియో వైరల్ అయింది. దీనిపై జమ్ము కాశ్మీర్ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ కన్వీనర్ నశీర్ కుహామి ఫిర్యాదు చేశారు. మీడియా చర్చల్లో కూడా కొంతమంది నేతలు తీవ్ర భాషతో విద్వేషాలు పెంచడం దృష్టికి వచ్చింది. గతంలో ఎన్నికలకు ముందు పుల్వామా, బాల్కోట్ వంటి ఘటనలు అప్పటి సర్జికల్ స్ట్రైక్స్ పదేపదే ప్రస్తావిస్తూ ఈసారి యుద్ధం వచ్చేసినట్టు మాట్లాడటం పరిష్కారం చూపదు. ప్రధాన పత్రికల సంపాదకీయాలు యుద్ధం పరిష్కారం కాదని నొక్కి చెప్పాయి. చైనాకు, పాకిస్తాన్‌కు సంబంధాలు నిజమైనప్పటికీ ఇలాంటి విషయాల్లో మద్దతు ఇస్తున్నట్లు కొంతమంది చిత్రించటం కూడా వాస్తవ దూరమే. అమెరికా ఆదేశాలతోనే తాము ఉగ్రవాదాన్ని పోషించే తప్పు పని చేశామని పాకిస్తాన్ రక్షణ మంత్రి కాజా ఆసిఫ్ చెప్పారు. దాడి చేసిన వారు స్వాతంత్ర్య యోధులని పాక్ ఉప ప్రధాని ఇషార్ ఖాన్ అంటే, కీలుబొమ్మ ప్రధాని షెహబాజ్ షరీఫ్ దీనిపై తటస్థ దర్యాప్తునకు సిద్ధమంటున్నారు. ఏమైనప్పటికీ దేశ సమైక్యతను కాపాడుకుంటూ దుష్ట శక్తుల విషయంలో అప్రమత్తత పాటించడం కాశ్మీర్‌ను బలోపేతం చేయడం అవశ్యం.

**ఆర్టికల్ 370 రద్దు తర్వాత రూపుదాల్చిందంటున్న నవ కాశ్మీరం (నయా కాశ్మీర్) ఒక్కసారిగా పహల్గాంకు ఎందుకు చేరిందని ప్రముఖ పాత్రికేయుడు రాజ్‌దీప్ సర్దేశాయ్ వంటి వారు ప్రశ్నించారు. ఎందుకంటే పాక్ జనరల్ వ్యాఖ్యలకు ముందే ఏదో కుట్ర తలపెట్టారని కథనాలు వస్తూనే ఉన్నాయి. తాము ముందే నిఘా సమాచారం అందించినప్పటికీ భద్రతా లోపం జరిగిందని కేంద్రం చూచాయిగా అంగీకరించింది. అయితే బైసరన్ లోయకు పర్యాటకులను అనుమతిస్తున్నట్లు అధికారులు తెలియజేయలేదని వ్యాఖ్యానించింది. ఏడాది పొడుగునా జరిగే బైసరన్ పర్యాటకం గురించి ప్రత్యేకించి తెలియజేయడం ఏమీ ఉండదని రాష్ట్ర పోలీసులు చెబుతున్నారు. ఇక్కడే స్పష్టమైన సమాచారం, సమన్వయ లోపం కనిపిస్తుంది. వాస్తవానికి నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం విఫలం అయిందని అభిప్రాయం కలిగించటానికి కేంద్రం ప్రయత్నిస్తోందని కాశ్మీర్ సిపిఎం సీనియర్ నాయకుడైన యూసఫ్ తరిగామి ఆ పార్టీ 24వ మహాసభ సందర్భంగానే వ్యాఖ్యానించారు. ఇప్పుడైనా రాష్ట్రానికి పూర్తి అండదండలు ఇవ్వడం ద్వారా ప్రజలకు ఉపాధి కల్పన, విశ్వాసం పాదుకొల్పాలని రాష్ట్రంలో జరిగిన అఖిలపక్ష సమావేశం కోరింది.**

అభిప్రాయం

## మరో గ్రంథాలయ ఉద్యమం

గ్రంథాలయం విజ్ఞానం, వికాసానికి నెలవు. రకరకాల పుస్తకాల కొలువు. ఎన్నటికీ ఇవ్వకూడదు సెలవు. స్వాతంత్ర్య ఉద్యమానికి వారధి. అయ్యంకి వెంకట రమణయ్య సారథి. రచయితలూ పాఠకుల పాలిట పెన్నిధి. ఊరూరా వెలసిన పౌర గ్రంథాలయాలు. అవి ఆధునిక దేవాలయాలు.

గ్రంథాలయ మహాసభలు ప్రగతికి చేయూత. విజయవాడలో తొలిగా జరిగిన ఘనత. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి చతురత. వెరసి భాండాగార సంఘానికి శ్రీకారం. ఆంధ్ర దేశంలో గ్రంథాలయాలకొచ్చెను ఆకారం. ఉద్యమాలకు ఆనాడే అయ్యెను పురిటిగడ్డ. ఎందరో వైతాళికులు అవతరించిన తెలుగు గడ్డ. కవితా వచన రీతులూ ప్రకియలకిది అడ్డా. ఆధునిక సాహిత్యంలో ఎన్నెన్నో మార్పులు. తెలుగు సాహిత్యం తొక్కెను కొత్త పరవళ్లు.

గ్రంథాలయాల్లో అరకొర వసతులు. సిబ్బందికి సకాలంలో అందని వేతనాలు. సంస్థకు నిధి జమచేయని పాలకులు. కొనుగోళ్ల ఊసు లేని కొత్త పుస్తకాలు. పేరుకు మాత్రమే అవి భాండాగారాలు. నిండా నిండాయి గాఢాంధకారాలు. గ్రంథాలయాలను కాపాడడం బాధ్యత. పునరుజ్జీవం పోయడం తక్షణ ఆవశ్యకత. ఉవ్వెత్తున ఉద్యమిస్తే దిగివచ్చును ప్రభుత. పుస్తక ప్రేమికులారా చేయి చేయి కలిపి రండి. కదం కదం కలిపితే బతుకును గ్రంథాలయాలు.

**- చెన్నాప్రగడ వి.ఎన్.ఎస్. శర్మ,**
**ఎన్టీఆర్ జిల్లా కో-కన్వీనర్,**
**ఏపీ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక.**

నెమ్మెర్ల

## ఊరికి మొనగాడు

అనగనగా అదొక ఊరు. ఆ ఊరిలో రకరకాల ప్రజలు కలసి మెలసి జీవించేవారు. చాలాకాలం పాటు ఆ ఊరికి ఒక వ్యక్తి రాజుగా ఉన్నాడు. ఆ రాజు తనకు చేతనైనంత రీతిలో పరిపాలన చేసేవాడు.

ఇలా వుండగా... ఈ ఊర్లో కొందరు చాలా కాలంగా ఎన్నికై పాలన చేస్తున్న రాజుని ఎలాగైనా ఓడించాలని ప్రయత్నిస్తున్నారు. కాని వీలు కావటం లేదు. అందువల్ల కొత్త దారి వెతుక్కున్నారు. ఆ ఊర్లోని ప్రజల మధ్య గొడవలు పెట్టారు! అంతేకాక పక్కఊరి నుండి పెను ప్రమాదం పొంచి ఉందని, ఆ ఊరు మన ఊరి మీద దాడి చేసి, మన ఊరిని నామరూపాలు లేకుండా చేస్తుందని, అందుకు ఆ ఊరిని ఓడించే మొనగాడిని రాజుగా ఎన్నుకోవాలని, అలాంటి మొనగాడు, 56 అంగుళాల ఛాతీ కలిగిన వాడు తమ వద్ద ఉన్నాడని, ఆయన్నే ఆ ఊరికి రాజు ఎన్నుకోవాలని ప్రచారం చేశారు. దాంతో ప్రజలు పాత రాజును ఓడించి కొండంత నమ్మకంతో 56 ఇంచుల ఛాతీ గల వ్యక్తిని రాజును చేశారు. ఆ రాజు ఎంతో వినమ్రంగా, తాను ఆ ఊరికి కాపలాదారుగా ఉంటానని ప్రజలకు వాగ్దానం చేశాడు. ప్రజలు ఎంతో ఆనందపడ్డారు.

ఆ తర్వాత ఆ ఊర్లో చలామణిలో ఉన్న డబ్బును రాజు రద్దు చేశాడు. "మన ఊర్లోని డబ్బును పక్క ఊరి వారు ఎత్తుకొనిపోయి నకిలీ డబ్బును తయారు చేస్తున్నారు! మనం కొత్తగా డబ్బును తయారు చేసుకుందాం! అప్పుడు దొంగలు దిక్క తోచక ఛస్తారు!" అని రాజు ప్రకటించాడు.

చాలా కష్ట, నష్టాలు వచ్చినా, పాత డబ్బులు చెల్లక ప్రాణాలే పోయినా, రాజు మాటలు విశ్వసించిన ప్రజలు అన్నీ సహించారు!

ఇంతలో పక్క ఊర్లోని కొందరు, ఈ ఊరి చివరిలో కావలి కాస్తున్న కొందరు భటులను కాల్చి చంపారు! అంతకు ముందు ఆ దొంగలు పొలిమేర వరకు మాత్రమే వచ్చేవారు. కాని రాజు కాపలాదారు అయ్యాక ఏకంగా ఊర్లోకి వచ్చి భటులనే ఎలా కాల్చి చంపారో ప్రజలకు అంతపట్ట లేదు!

కాని రాజు గర్జించాడు. దొంగల అంతు తేలుస్తానని శపథం చేశాడు. పొద్దునే రచ్చబండ వద్ద "మన రాజుగారు' పక్కనున్న ఊరిపై అర్ధరాత్రి మెరుపు దాడి చేయించారు. వారికి కోలుకోలేని నష్టం జరిగింది! ఇక మన వైపు కన్నెత్తి కూడా చూడలేరు!" అని చాటింపు వేశారు.

మైకంలోకి వెళ్ళిన ప్రజలు రాజును మరోసారి గెలిపించారు!

కొంతకాలం గడిచింది. పక్క ఊరికి చేవ చచ్చిందని, ఆ ఊరి జనం ఆడుక్కు తింటున్నారని, వంది మాగధులు ప్రచారం చేస్తూనే ఉన్నారు!




**రాజు విదేశాలకు వెళ్ళటం, ఆ దొంగలు వచ్చి దాడి చేయటం, ఇదంతా ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్నట్లుంది! మన రాజుకి 56 ఇంచుల ఛాతీ ఉంది కదా! ఎన్నో తెలివితేటలున్న మంత్రులు, అనితరసాధ్యమైన శక్తిగల గూఢాచారులున్నారు కదా! లక్షల సైన్యం ఉంది కదా! అయినా ఆ దొంగలు మన ఊరి మధ్యలోకి ఎలా వస్తున్నారు? వారు అన్నేసి తుపాకులు పట్టుకు వస్తుంటే మన గూఢచారులు వారిని ఎందుకు పసిగట్టలేక పోతున్నారు? మన రాజు అంటే పక్క ఊరి దొంగలకు భయమే ఉంటే ఇదంతా జరుగుతుందా?" తిని ప్రశ్నించింది పెద్దమ్మ.**

ఊర్లోకి కొందరు చుట్టాలు వచ్చారు! తమ ఇంటికి వచ్చిన చుట్టాలకి తమ ఊళ్ళోని తోటను చూసి రమ్మని పంపించారు ఆ గ్రామస్తులు! ఆ తోటలో వారు తిరుగుతుండగానే, మరోసారి పక్క ఊరి దొంగలు వారి మీద విరుచుకు పడ్డారు. ఒక్కొక్కరిని నిలబెట్టి కాల్చి చంపేశారు. సరిగ్గా అదే సమయానికి రాజుగారు విదేశాల్లో ఉన్నారు! వెంటనే పర్యటనను రద్దు చేసుకుని తిరిగి వచ్చారు! కాని తోటకు వెళ్ళలేదు! కనీసం చనిపోయిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించలేదు! వారికి మనోధైర్యాన్ని ఇచ్చే ప్రయత్నం కూడా చేయలేదు! నేరుగా "రచ్చబండ వద్దకు వెళ్ళి... దొంగల ఊరి సంగతి తేలుస్తాం! వారికి మంచినీళ్ళు కూడా పుట్టకుండా చేస్తాం!" అంటూ వీరోచిత ఉపన్యాసం ఇచ్చాడు.

ఊరి జనం, వంది మాగధులు రెచ్చిపోయి చప్పట్లు కొట్టారు! మహారాజుకి జయజయ ధ్వానాలు చేశారు!

ఒక్క పేదరాసి పెద్దమ్మ మాత్రం చప్పట్లు కొట్టలేదు! జయ జయధ్వానాలు చేయలేదు! పైగా కోపంతో చూస్తోంది!

"ఏయ్... ముసిలిదానా! మన రాజుగారు ఆ దొంగల అంతు చూస్తానంటే నీ మొహంలో సంతోషం కనబడటం లేదు! ఏంటి సంగతి?" అని ప్రశ్నించాడు! ఒక మాగధుడు.

"ఏమో నాయనా, పాత రాజు ఉన్నపుడు పక్క ఊరి దొంగలు దొంగతనం మాత్రమే చేసేవారు! మీ మాటలు నమ్మి, ఈయనను రాజుని చేస్తిమి! అదేమి విచిత్రమో అప్పటి నుండి ఆ దొంగల దారుణాలు పెరిగిపోయాయి! ఏక

## ప్రాంతీయ ఆర్థిక అసమానతలతోనే
# అధిక నష్టం

- ట్రంప్ సుంకాల ప్రభావంపై ఆర్థిక నిపుణుల మనోగతం
- ఉత్తరాదిపై రాజకీయ ఉదాశీనత
- ఈశాన్య రాష్ట్రాలను విస్మరించారు
- కొన్ని రాష్ట్రాలపైనే ఆధారం

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ నెల 10వ తేదీన వాణిజ్య భాగస్వామ్య దేశాలపై ప్రతీకార సుంకాలు విధించిన విషయం తెలిసిందే. భారతీయ ఉత్పత్తులపై ఆయన 26 శాతం సుంకాలు విధించారు. ఆ వెంటనే స్టాక్ మార్కెట్లు కుప్పకూలిపోయాయి. ఐటీ, ఫార్మ రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయన్న వార్తలు వచ్చాయి. అయితే ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయమేమంటే ఎగుమతుల విషయంలో భారత్ సాధిస్తున్న విజయాలు కేవలం కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పరిమితమై ఉన్నాయి. మన దేశం నుంచి జరుగుతున్న ఎగుమతులలో గుజరాత్ అగ్రస్థానంలో ఉంది. అక్కడి నుండి 33.5 శాతం ఎగుమతులు జరుగుతున్నాయి. గుజరాత్‌తో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి జరుగుతున్న ఎగుమతులు దేశం నుంచి జరుగుతున్న మొత్తం ఎగుమతులలో 70 శాతానికి పైబడి ఉన్నాయి. అంటే ఈ రాష్ట్రాలపై ట్రంప్ విధించిన నూతన సుంకాల కారణంగా వెంటనే ప్రభావం పడుతుంది. అయితే ట్రంప్ ప్రభుత్వం సుంకాల నుంచి 90 రోజుల పాటు తాత్కాలిక విరామం ప్రకటించడంతో ఆయా రాష్ట్రాలు కొంత ఊపిరి పీల్చుకున్నాయి.

### ఎగుమతులలో అసమానతలు

ప్రధానంగా ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ఎగుమతులు ఒకేలా జరగడం లేదు. వాటి మధ్య తీవ్రమైన అసమానతలు ఉన్నాయి. ఉదాహరణకు అధిక జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి కేవలం 4.97 శాతం ఎగుమతులు మాత్రమే జరుగుతుండడం గమనార్హం. మధ్యప్రదేశ్, రాజస్థాన్ నుంచి అయితే మొత్తం ఎగుమతులలో కేవలం 2.15 శాతం ఎగుమతులు మాత్రమే జరుగు తున్నాయి. ఈ అసమానతలకు కారణం ఆయా రాష్ట్రాలలో వనరులు లేకపోవడం కానేకాదు. రాజకీయ చిత్తశుద్ధి, వ్యవస్థాగతమైన జడత్వమే దీనికి ప్రధాన కారణం.

### కనీస సౌకర్యాలకు నోచుకొని ఈశాన్యం

గుజరాత్‌లో ప్రత్యేక ఆర్థిక మండళ్లు, లాజిస్టిక్స్‌పై దృష్టి సారిస్తున్నారు. పెట్టుబడులపై ఆ రాష్ట్రానికి ఓ స్పష్టత ఉంది. అయితే ఉత్తర భారతదేశంలోని అనేక రాష్ట్రాలు తయారీ రంగాన్ని ప్రోత్సహించడం కంటే కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అక్కడి నుండి జరిగే నగదు బదిలీల పైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. ఇక ఈశాన్య రాష్ట్రాల పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఈ ప్రాంతం 5,400 కిలోమీటర్ల అంతర్జాతీయ సరిహద్దును పంచుకుంటున్నప్పటికీ ఎగుమతులలో దాని వాటా కేవలం 0.13 శాతం మాత్రమే. నాగాలాండ్, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు రవాణా, గిడ్డంగులు, పంపిణీ, సరఫరాల విషయంలో బాగా వెనుకబడి ఉన్నాయి. అక్కడ డ్రై పోర్టులు, వాణిజ్య కారిడార్లు, గిడ్డంగులు కూడా లేవు. అంటే దీనర్థం ఇతర ప్రాంతాల కంటే ఈశాన్య భారతం వెనుకబడి ఉన్నదని కాదు. కాకుంటే అది ఎన్నడూ ఇతర ప్రాంతాలతో కలిసిపోలేదు.

### అతిగా ఆధారపడితే ముప్పే

అమెరికా ఉత్పత్తులపై భారత్ సగటున 52 శాతం సుంకాలు విధిస్తే ట్రంప్ ప్రభుత్వం అందుకు ప్రతిగా మన వస్తువులపై 26 శాతం సుంకాలు విధించింది. ప్రస్తుతం భారత్‌తో అమెరికా వాణిజ్య లోటు 46 బిలియన్ డాలర్లు. మన దేశం నుంచి ఎగుమతి అవుతున్న వస్తువులలో సుమారు 18 శాతం అమెరికాకే వెళుతున్నాయి. ట్రంప్ విధించిన సుంకాలు ఔషధాలు, టెలికం పరికరాలు, ఆభరణాల ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతాయి. 2023-24లో మన దేశం నుంచి అమెరికాకు జరిగిన 77.8 బిలియన్ డాలర్ల విలువ కలిగిన వస్తువుల ఎగుమతులలో ఈ మూడింటి విలువ 17.8 బిలియన్ డాలర్లు. వీటి తయారీ పరిశ్రమలన్నీ ప్రధానంగా మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలలోనే ఉన్నాయి. ఇలా కొన్ని రాష్ట్రాలపైనే ఆధారపడే విధానాన్ని కేంద్రం మార్చుకోని పక్షంలో, అలాగే దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఎగుమతులు జరిగేలా చూడని పక్షంలో ఇబ్బందులు తప్పవు. ఆగ్నేయాసియాకు సరిహద్దున ఉన్న మణిపూర్, మిజోరం రాష్ట్రాల నుంచి ఎగుమతులే జరగడం లేదు. ఎగుమతి విధానాన్ని రూపొందించే పట్టికలో కూడా ఆ రాష్ట్రాలకు చోటు లేదు.

### బయటపడిన లోపాలు

భారత ఆర్థిక వ్యవస్థ, వాణిజ్య సంబంధాలు, కరెన్సీ మార్కెట్లపై అమెరికా సుంకాలు స్వల్ప, దీర్ఘకాలిక ప్రభావాలు చూపుతాయని ఆర్థిక విశ్లేషకుడు అంకుర్ శర్మ తెలిపారు. ఇప్పటికే ఎగుమతులు అధికంగా జరుగుతున్న రాష్ట్రాల పైనే ఈ ప్రభావం ఉంటుంది. ట్రంప్ సుంకాలు భారత ఆర్థిక ఫెడరలిజంలో రెండు విభిన్న లోపాలను బయట పెట్టాయి. హిందీ రాష్ట్రాలలో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు రాజకీయ ఉదాశీనతకు నిదర్శనాలు. ఈ రాష్ట్రాలలో వాణిజ్య సంబంధమైన మౌలిక సదుపాయాలు లేవని, లాజిస్టిక్స్ పనితీరు అధ్వానంగా ఉన్నదని నిటి ఆయోగ్ సూచిక చెప్పింది.

### ప్రభుత్వం ఏం చేయాలంటే...

ఈ అసమానతలను నివారించాలంటే కేంద్రం ఏం చేయాలి? నగదు బదిలీలపై ఆయా రాష్ట్రాలు ఎక్కువగా ఆధారపడడాన్ని నివారించాల్సి ఉంటుందని నిపుణులు సూచించారు. భూమి, కార్మిక విధాన సంస్కరణలు, లాజిస్టిక్స్ ఫలితాలు, ఎగుమతుల వైవిధ్యంతో ముడిపెట్టి నిధులను అందజేయాలి. 2029 నాటికి రూ.1.5 లక్షల కోట్ల విలువైన ఎగుమతులు జరపాలని రాజస్థాన్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈశాన్య రాష్ట్రాలకు సాధికారత కల్పించడం కూడా కేంద్రం బాధ్యతే. ఆ ప్రాంతాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని కేంద్రం ఎన్ని డప్పులు కొట్టుకున్నా మిజోరం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో సరిహద్దును పంచుకుంటున్న దేశాలకు ఒక్క వాణిజ్య కారిడార్ కూడా లేదు. కొల్‌కతాను సముద్రం ద్వారా మయన్మార్‌తో కలపడానికి ఉద్దేశించిన కలడాన్ మల్టీ మోడల్ ప్రాజెక్ట్, భారత్-మయన్మార్-థాయ్‌లాండ్ త్రైపాక్షిక పైవే నిలిచిపోయాయి. ఇంఫాల్, ఐజ్వాల్ వంటి రాష్ట్రాలలో పట్టణ పాలన, వాణిజ్య మౌలిక సదుపాయాలు ఇప్పటికీ జాతీయ ప్రాధాన్యతలతో అనుసంధానం కాలేదు. ఈశాన్య ప్రాంతంలోని వాణిజ్య ఇంటిగ్రేషన్ మిషన్ ద్వారా మన దేశం ప్రయోజనం పొందవచ్చు. అందుకోసం సరిహద్దు ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పన, గిడ్డంగుల నిర్మాణం, వ్యవసాయాధారిత సంస్థల ఏర్పాటు జరగాల్సి ఉంటుంది. మరీ ముఖ్యంగా జాతీయ వాణిజ్య వ్యూహాలలో ఈశాన్య రాష్ట్రాల విధానాలకు స్థానం కల్పించాలి.

ప్రస్తుతం మన ఎగుమతి వ్యవస్థ ఉత్తరాదిని రాజకీయంగా అంటరాని ప్రాంతంగా చూస్తోంది. ఈశాన్య ప్రాంతాన్ని అసలు పట్టించుకోవడం లేదు. ఇది ఎంతమాత్రం సమర్థనీయం కాదు. ఇప్పుడు మనం సహకార ఫెడరలిజం నుంచి పనితీరు ఫెడరలిజంకు మారాల్సి ఉంటుంది. ఉత్తరాదిని 21వ శతాబ్దపు ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఈశాన్యాన్ని ఓ సరిహద్దు ప్రాంతంగా కాకుండా వ్యూహాత్మక ఆర్థిక మండలిగా చూడాలి. వాణిజ్య ఏకీకరణ అనేది ప్రసంగాల ద్వారా కాకుండా విధానం, మౌలిక వసతుల కల్పన, ప్రాతినిధ్యం ద్వారా జరగాలి. ట్రంప్ ప్రభుత్వ నిర్ణయంతో ప్రమాదంలో పడింది కేవలం ఎగుమతుల పరిమాణమే కాదు. అది భారత ఆర్థిక పొందికను కూడా ప్రమాదంలో పడేస్తోంది.

---

## అసభ్యకర పోస్టులు పెట్టేవారికి చంద్రబాబు అండ

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సోషల్ మీడియాలో వైసిపి నాయకులపై అసభ్యకర పోస్టులు పెడుతున్న వారికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అండదండలు ఉన్నాయని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐటిడిపి పేరుతో డబ్బులు, బహుమతులు ఇచ్చి మంత్రి నారా లోకేష్ ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. టిడిపి అధికారిక సోషల్ మీడియాలో మార్ఫింగ్ ఫొటోలు పెడుతున్నారన్నారు. సీమరాజా, ఆర్‌పి, సూపర్ సుబ్బు, చేబ్రోలు కిరణ్ టిడిపి చెబ్బుకొమ్మలేనని విమర్శించారు. అలాగే ఉర్సాకు భూములు కేటాయింపు వెనుక మంత్రి లోకేష్ ఉన్నారని వైసిపి నాయకులు పుత్తా శివశంకర్‌రెడ్డి విమర్శించారు. అక్టోబర్‌లో అమెరికాలో పర్యటించిన లోకేష్... ఉర్సా ప్రతినిధులను కలిసి వచ్చారని, ఈ ఏడాది కంపెనీని ఏర్పాటు చేశారని తెలిపారు.

---

నిందితులు ఉపయోగించిన

## రెండో మోటారు సైకిల్ లభ్యం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

టిడిపి నేత వీరయ్యచౌదరి హత్య కేసులో నిందితులు ఉపయోగించిన రెండో మోటారుసైకిల్‌ను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. సిసి ఫుటేజీల ఆధారంగా నేరస్తులు వెళ్లిన మార్గాల్లో పోలీసులు అన్వేషణ సాగించారు. ఎట్టకేలకు నిందితులు వినియోగించిన స్కూటర్‌ను చీమకుర్తిలో స్వాధీనం చేసుకున్నారు. వీరయ్యతో శత్రుత్వం ఉన్న వినోద్ వాహనంగా పోలీసులు గుర్తించారు. మద్యం, రేషన్ బియ్యం, ఇసుక వ్యవహారాల్లో వీరయ్యతో విభేదాలున్న వ్యక్తుల పాత్ర కీలకంగా ఉందని ప్రాథమికంగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. హత్యలో పాల్గొన్న నేరస్తులు దొరికితే సూత్రధారులు ఎవరు? పాత్రధారులు ఎవరనే దానిపై స్పష్టత రానుంది. వీరయ్యకు రాజకీయంగానూ, ఇతర విషయాల్లో శత్రుత్వం ఉన్న అమ్మన(బ్రో)లుకు చెందిన వీరగంధం దేవేంద్రనాథ్‌చౌదరి, మరికొందరిని పోలీసులు విచారిస్తున్నారు.

---

## విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. అత్యంత విలువైన ఈ స్టీల్‌ప్లాంట్ దేశానికే గర్వకారణమని, అటువంటి ప్రభుత్వ రంగ సంస్థను ప్రయివేటుకు కట్టబెట్టాలని చూస్తోన్న కేంద్ర ప్రభుత్వ తీరును ప్రజలంతా ఐక్యంగా ఖండించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1535వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎఐటియుసి కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు లేకపోవడం వల్లే ఖర్చు అధికమై లాభాలు తక్కువగా వస్తున్నాయని అన్నారు. సొంతగనులు కేటాయిస్తే లాభాల బాటలో దూసుకుపోతుందని తెలిపారు. లక్షల మంది కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

---

## యూట్యూబ్ చూసి దొంగతనం

- ఆరుగురు నిందితుల అరెస్ట్ : ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

యూట్యూబ్‌లో వీడియోలను చూసి ఇంటి దొంగతనానికి పాల్పడిన ఘటన కర్నూలు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. కేసు వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు ఆర్‌టిసి డిపో మేనేజర్ సర్దార్ హుస్సేన్ తన కుటుంబంతో కలిసి ఈ నెల 13న ఓ ఫంక్షన్‌కు హైదరాబాద్ వెళ్లారు. స్పైస్ డాభాలో పనిచేసే యువకుడు షేక్షావలి, మరో ఐదుగురు బాలురు కలిసి యూట్యూబ్‌లో చూసిన వీడియో ఆధారంగా హుస్సేన్ ఇంటిలో 13వ తేదీ రాత్రి చోరీ చేశారు. తన ఇంటిలో చోరీ జరిగిందని హైదరాబాద్ నుంచి 14న తిరిగి వచ్చిన హుస్సేన్ గమనించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చోరీకి పాల్పడిన కర్నూలుకు చెందిన షేక్షావలి, మరో ఐదుగురు శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

---

## రన్యారావు బెయిల్ పిటిషన్ కొట్టివేత



**బెంగళూరు :** అక్రమ బంగారం తరలించిన కేసులో అరెస్టు అయిన కన్నడ నటి రన్యారావుకు ఎదురుదెబ్బ తగిలింది. తమకు బెయిల్ మంజూరు చేయాలంటూ రన్యారావు, మరో నిందితుడు తరుణ్ కొండూరు రాజు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ఇప్పటికే తీర్పు రిజర్వు చేసిన కర్ణాటక హైకోర్టు.. తాజాగా దానిని కొట్టివేసింది. ఈ కేసులో రన్యారావుకు బెయిల్ ఇవ్వకూడదని డిఆర్ఐ అధికారులు న్యాయస్థానంలో వాదనలు వినిపించిన అనంతరం న్యాయమూర్తి జస్టిస్ ఎస్ విశ్వనాథ్ శెట్టి నిందితుల పిటిషన్‌ను తోసిపుచ్చారు. దుబాయ్ నుంచి బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ రన్యారావు గత నెలలో బెంగళూరు విమానాశ్రయంలో దొరికిపోయిన విషయం తెలిసిందే. ఆమె వద్ద నుంచి 14.7 కిలోల బంగారాన్ని డిఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు ఈ కేసులో రన్యా సహా ముగ్గురిని అరెస్టు చేశారు. ముందుగా ఆమె తనను ఇందులో బెదిరించి ఇరికించారని, తనకేమీ సంబంధం లేదని తప్పించుకోవడానికి ప్రయత్నించినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే దర్యాప్తులో భాగంగా ఈ అక్రమ రవాణాలో కొన్నేళ్లుగా ఆమె ప్రధాన పాత్ర పోషించినట్లు తెలిసిందన్నారు. ఆభరణాల వ్యాపారి సాహిల్ జైన్ ఎ3గా కస్టడీలోకి తీసుకున్నారు. అతడిని ఏప్రిల్ 7 వరకు జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. దీంతో బెయిల్ కోసం రన్యారావు కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. బెయిల్ విషయంలో ఆర్థిక నేరాల ప్రత్యేక న్యాయస్థానం, 64వ సెషన్స్ కోర్టులో ఇప్పటికే ఆమెకు నిరాశ ఎదురైంది.

---


**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

**RACPC మంగళగిరి బ్రాంచ్, 1వ అంతస్తు, సిఎ-5, సిఎఫ్‌సి ఏరియా, హోండా షోరూమ్ వెనుక, ఆటోనగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503.**

**స్వాధీనత ప్రకటన**

**(APPENDIX-IV) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002**

**రూల్ 8(1) ననుసరించి (స్థిరాస్థి కొరకు)**

**EB HTL A/c No.38399822731**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RACPC మంగళగిరి బ్రాంచ్, మంగళగిరి, గుంటూరు జిల్లా** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13(12) కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో సదరు నోటీసు తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొనబడిన బకాయి **(1) హెచ్‌టిఎల్ తేది.22.07.2024 నాటికి రూ.17,27,980/- (అక్షరాల పదిహేడు లక్షల ఇరవై ఏడు వేల తొమ్మిది వందల ఎనభై రూపాయలు మాత్రమే)** కాంట్రాక్టువల్ రేటు ప్రకారం వడ్డీతో ఖర్చులు, ఛార్జీలు మొ।నవి సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **ఋణగ్రహీతలు : 1) శ్రీ గోసాల వి.ఎన్.డి. ప్రసాద్, తండ్రి: రామారావు,** సి-404, శ్రీ బాలాజీ ఇంద్ర ప్రస్థ అపార్ట్‌మెంట్, గాంధీ నగర్, గోళ్ళండ X రోడ్డు దగ్గర, సికింద్రాబాద్, గాంధీ నగర్, హైదరాబాద్, తెలంగాణ-500080. **2) శ్రీమతి గోసాల జ్యోత్స్న, భర్త: గోసాల వి.ఎన్.డి. ప్రసాద్,** సి-404, శ్రీ బాలాజీ ఇంద్ర ప్రస్థ అపార్ట్‌మెంట్, గాంధీ నగర్, గోళ్ళండ X రోడ్డు దగ్గర, సికింద్రాబాద్, గాంధీ నగర్, హైదరాబాద్, తెలంగాణ-500080. **3) శ్రీమతి గోసాల జ్యోత్స్న, భర్త: గోసాల వి.ఎన్.డి. ప్రసాద్,** డి.నెం.3-232, ఫ్లాట్ నెం.305, 3వ అంతస్తు, అంజనాద్రి అపార్ట్‌మెంట్, ఇప్పటం రోడ్డు, అత్మకూరు గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా-522503 వారిని కోరుతూ **తేది.22.07.2024 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన పేర్కొన్న ఋణగ్రహీత డిమాండ్ నోటీసు జారీ చేసిన తరువాత **రూ.2,03,000/-** చెల్లించగా ఋణగ్రహీత/హామీదారు ఇప్పుడు **(1) హెచ్‌టిఎల్ తేది.23.04.2025 నాటికి రూ.16,45,192/- (అక్షరాల పదహారు లక్షల నలభై ఐదు వేల నూట తొంభై రెండు రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీ, కాస్ట్, ఛార్జీలు మొ।వితో కలిపి చెల్లించవలసి.

ఋణగ్రహీత సదరు బకాయి సొమ్మును తిరిగి చెల్లించటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం, 2002 నందలి రూల్ 8 ప్రకారం దిగువ వివరించిన ఆస్తిని తేది **23.04.2025** న **లాంఛనాత్మకంగా స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీత & ప్రజానీకమునకు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ఋణగ్రహీత/హామీదారు మరియు యావన్మంది సాధారణ ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తితో జరిపే ఏ లావాదేవీలైనా **(1) హెచ్‌టివిఎల్ తేది.23.04.2025 నాటికి రూ.16,45,192/- (అక్షరాల పదహారు లక్షల నలభై ఐదు వేల నూట తొంభై రెండు రూపాయలు మాత్రమే)** తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మొ।నవి **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RACPC మంగళగిరి బ్రాంచ్, మంగళగిరి, గుంటూరు జిల్లా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

**స్థిరాస్తి వివరములు**

**ఎ-షెడ్యూల్ :** గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్ యొక్క పరిధి మరియు అధికార పరిధి, మంగళగిరి మండలం, ఆత్మకూరు గ్రామం మరియు పంచాయితీ యొక్క డి.నెం.176/2, సర్వే నెం.176/1బి నందు విస్తీర్ణం 1304.0 చ।గ।।లలోని మొత్తం భూమి. **హద్దులు : తూర్పు:** ఇతరుల ఆస్తి, **దక్షిణం :** కొండా ప్రకాష్ రెడ్డి మరియు ఇతరులు యొక్క ఆస్తి, **పడమర :** కొండా రెడ్డి మరియు ఇతరులు యొక్క ఆస్తి, **ఉత్తరం :** కొండా ప్రకాష్ రెడ్డి మరియు ఇతరుల రోడ్డు విస్తరణ కొరకు పంచాయితీకి గిఫ్ట్‌గా ఇచ్చిన భూమి.

పై నాలుగు హద్దుల యందు విస్తీర్ణం 1304 చ।గ।।లు లేదా 1090.31 చ।మీ।।లు స్థలంలోని అవిభాజ్యమైన, నిర్దిష్టపరచని ఉమ్మడి వాటా 48 చ।గ।।లు లేదా 40.13 చ।మీ।।లు స్థలం.

**బి-షెడ్యూల్ :** ఎ-షెడ్యూల్ ఆస్తి నందు నిర్మింపబడిన "అంజనాద్రి" అను పేరు మరియు స్టైల్‌లో అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ 3వ అంతస్తులోని **ఫ్లాట్ నెం.305** తో ఉన్న అపార్ట్‌మెంట్ ఫ్లాట్. ఈ ఆస్తి **శ్రీమతి గోసాల జ్యోత్స్న, భర్త: గోసాల వి.ఎన్.డి. ప్రసాద్ గారికి చెందినది. దస్తావేజు నెం.7077/2019, తేది.18.04.2019 ప్రకారం. హద్దులు : తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** కామన్ కారిడార్, **ఉత్తరం :** లిఫ్ట్ మరియు ఓపెన్ టు స్కై.

ఈ హద్దుల యందు నివాసయోగ్యమైన అపార్ట్‌మెంట్ ఫ్లాట్ 1075 చ।అ।లు ప్లింత్ & కామన్ ఏరియా మరియు స్టిల్ట్ ఫ్లోర్ నందు 120 చ।అ।ల పార్కింగ్‌తో కలదు.

**తేది : 23.04.2025**
**ప్రదేశం : మంగళగిరి**

**సం/- అధీకృత అధికారి,**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**



**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

**అస్సెట్ రికవరీ బ్రాంచి (79170),**
**విజయవాడ, లోకేబెట్: 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, పిపి-520001.**

**స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)**

**(Rule 8(1)) of Security Interest (Enforcement) Rules 2002)**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం.54) ప్రకారము యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీతలు: మెస్సర్స్ ఎన్.ఎం. అగ్రో ఎక్స్‌పోర్ట్స్,** డి.నెం.40-9-101/3, బెంజ్ సర్కిల్ దగ్గర, సాయి నగర్, విజయవాడ, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-520010. **1(ఎ) శ్రీ నాదెండ్ల హరి రామకృష్ణ (మరణించిన),** మేనేజింగ్ పార్టనర్ ప్రాతినిధ్యం వహిస్తున్న చట్టరిత్య వారసులు శ్రీమతి బడిగినేని శివ లీలారాణి (సీనియర్ అసోసియేట్), భర్త: నాదెండ్ల హరి రామకృష్ణ (లేట్), ప్రస్తుతం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పని చేస్తున్నారు, లాల్‌గూడ బ్రాంచి, డి.నెం. 12-5-35, బి/2, మర్రిదీప్, తార్నాక దగ్గర, సికింద్రాబాద్, తెలంగాణ-500017. **1(బి) శ్రీ. మండలనేని పవన్ కుమార్ (భాగస్వామి),** తండ్రి: ఎం.నాగేశ్వరరావు, ఆర్/ఓ. డి.నెం. 26-41-103, 4వ లైన్, ఏ.టి. అగ్రహారం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004. **2(ఎ) శ్రీ. మండలనేని జగదీష్ కుమార్ (హామీదారు),** తండ్రి:ఎం.నాగేశ్వరరావు, ఆర్/ఓ డి.నెం. 26-41-103, 4వ లైన్, ఏ.టి. అగ్రహారం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004. **2(బి) శ్రీమతి మండలనేని నాగలీల (హామీదారు),** తండ్రి: ఎం.నాగేశ్వరరావు, ఆర్/ఓ డి.నెం. 26-41-103, 4వ లైన్, ఏ.టి. అగ్రహారం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004. **2(సి) శ్రీమతి మండలనేని ఝాన్సీలక్ష్మి (హామీదారు),** భర్త: ఎం.నాగేశ్వరరావు, ఆర్/ఓ. డి.నెం. 26-41-103, 4వ లైన్, ఏ.టి. అగ్రహారం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004. వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.3,75,17,700.00** (అక్షరాలా మూడు కోట్ల డెబ్భై ఐదు లక్షల పదిహేడు వేల ఏడు వందల రూపాయలు మాత్రమే) + వడ్డీ, ఇతర ఖర్చులు, నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **తేది. 27.12.2024**న డిమాండ్ నోటీసు జారీ చేయబడింది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **తేదీ.23-04-2025**న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనము చేసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.3,75,17,700.00** (అక్షరాలా మూడు కోట్ల డెబ్భై ఐదు లక్షల పదిహేడు వేల ఏడు వందల రూపాయలు మాత్రమే) వడ్డీ మరియు ఇతర ఖర్చులతో ఛార్జీకి లోబడి వుండునని ఇందు మూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

తనఖా పెట్టిన సదరు ఆస్తుల విమోచనకు ఋణగ్రహీతలు వారికి నిర్దేశించిన కాల వ్యవధి సదరు చట్టములోని సెక్షన్ 13కు అనుబంధమైన సబ్ సెక్షన్(8) ప్రకారం కలిగియుండురని తెలియజేయడమైనది.

**స్థిరాస్తి వివరములు**

**ఐటమ్ నెం.1:** గుంటూరు జిల్లా, గుంటూరు సబ్‌జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరు మున్సిపల్ పాత వార్డ్ నెం. 17, కొత్త వార్డ్ నెం. 32, బ్లాక్ నెం. 4, టి.ఎస్.నెం.68

# అవంటెల్ ఆదాయంలో 11 శాతం వృద్ధి

**హైదరాబాద్ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో అవంటెల్ లిమిటెడ్ నికర లాభాలు 8.05 శాతం పెరిగి రూ.4.46 కోట్లుగా నమోదయ్యాయి.

ఇదే సమయంలో కంపెనీ ఆదాయం 10.97 శాతం వృద్ధితో రూ.248.48 కోట్లకు చేరింది. 2024-25లో తుది డివిడెండ్ కింద ప్రతీ ఈక్విటీ షేర్‌పై 0.20 శాతం చెల్లించాలని ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. ఇందుకోసం జూన్ 12ను రికార్డ్ తేదిగా తీసుకుంది.

# విద్వేషాల బజారులో ప్రేమ దుకాణం తెరిచాం

## భారత్ సమ్మిట్ ప్లీనరీలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ రాజకీయాల్లో పాతతరం అంతరించిపోయిందనీ, మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో యువత రాజకీయాల్లోకి రావాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు. 'విద్వేశాల బజారులో ప్రేమ దుకాణం తెరిచాం' అని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాస్వామ్య రాజకీయాల్లో చాలా మార్పులొచ్చాయన్నారు. గడిచిన పదేళ్లలో దేశంలో ఏం జరిగిందో అందరికీ తెలుసన్నారు. ప్రభుత్వ పాలసీలపై లోతుగా చర్చించాల్సి ఉందని చెప్పారు. చట్టసభల్లో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం కూడా రావడం లేదన్నారు. విపక్షాలు తమ గొంతు వినిపించేందుకు కొత్త వేదికలు వెతుక్కోవాల్సి వస్తోందని వివరించారు. శనివారం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసిసి నోవాటెల్‌లో రెండోరోజు భారత్ సమ్మిట్ ఫ్లీనరీ ముగింపులో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య రాజకీయాలు మారిపోయాయి. పదేళ్ల నాటి పరిస్థితులు ఇప్పుడు లేవన్నారు. మోడ్రన్ సోషల్ మీడియాతో అంతా మారిపోయిందనీ, ఇప్పుడంతా మోడ్రన్ రాజకీయమేనన్నారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నాలుగు వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టానని గుర్తు చేశారు. పాదయాత్ర మొదల్లో తనతో కొద్ది మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. రోజులు గడుస్తున్న కొద్దీ తనతో వేలాది మంది నడిచారని గుర్తు చేశారు. ప్రజలతో మమేకం అయ్యేందుకు ప్రయత్నించి విజయం సాధించినట్టు తెలిపారు. దేశ ప్రజలకు ప్రేమను పంచేందుకు పాదయాత్రను మొదలు పెట్టామన్నారు. ఈ యాత్రలో ఎన్నో విషయాలు తెలుసుకున్నట్టు చెప్పారు.

# కార్స్ 24లో ఉద్యోగులపై వేటు

**న్యూఢిల్లీ :** యూజ్డ్ కార్ల విక్రయ వేదిక కార్స్24 తమ వందలాది ఉద్యోగులపై వేటు వేసింది. దాదాపు 200 మంది సిబ్బందికి ఉద్వాసన పలికింది. ఆ సంస్థ నుంచి ఇటీవల సాఫ్ట్‌బ్యాంక్ తమ పెట్టుబడులను వెనక్కి తీసుకున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలుస్తోంది. గత కొన్ని వారాలుగా కొన్ని క్లిష్ట నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని కార్స్24 సిఇఒ విక్రమ్ చోప్ర పేర్కొన్నారు. ఈ క్రమంలోనే 200 మంది తీసివేయాల్సి వచ్చిందన్నారు. కొన్ని నెలలుగా తమ అంచనాలకు అనుగుణంగా ప్రాజెక్టులను డెలివరీ చేయలేకపోయామన్నారు.

## పసిపాపపై లైంగికదాడి

ప్రజాశక్తి - మేడికొండూరు (గుంటూరు జిల్లా)

నాలుగేళ్ల పసిపాపపై 55 ఏళ్ల వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన గుంటూరు జిల్లాలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడికొండూరు మండలం మందపాడుకు చెందిన పసిపాపను అదే గ్రామానికి చెందిన నిందితుడు రాజు తన ఇంటికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పాప తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పసిపాపను వైద్య పరీక్షల నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు తరలించారు.

## మా గ్రామంలోకి రావద్దు

- రెవెన్యూ అధికారులను అడ్డుకున్న గిరిజనులు
- అదాని పవర్ ప్లాంట్‌కు మారిక కొండను కట్టబెట్టనుండడంపై ఆగ్రహం

ప్రజాశక్తి- వేపాడ (విజయనగరం జిల్లా)

రెవెన్యూ అధికారులను, సిబ్బందిని విజయనగరం జిల్లా వేపాడ మండలంలోని మారిక గ్రామానికి రానీయకుండా స్థానిక గిరిజనులు అడ్డుకున్నారు. మారిక భూములను అదాని కంపెనీకి కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యాన శనివారం ఈ కార్యక్రమం చేపట్టారు. గ్రామానికి వస్తున్న డిప్యూటీ తహశీల్దార్ సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మి, రెవెన్యూ సిబ్బందిని కొత్తగా నిర్మిస్తున్న రహదారిపైనే అడ్డగించారు. తమ గ్రామానికి రావద్దని నినాదాలు చేశారు. అదానికి మారిక కొండను, తమ భూములను ఇచ్చే ప్రతిపాదనను, తమ గ్రామాన్ని ఖాళీ చేయించే ఆలోచనను విరమించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు చల్లా జగన్ మాట్లాడుతూ గిరిజనుల పక్షాన కాకుండా అదాని సేవలో రెవెన్యూ అధికారులు మునిగితేలడం అన్యాయమన్నారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా గ్రామ గిరిజనులు స్వతంత్రంగా బతుకుతున్నారని, పచ్చని కొండపై అధారపడి జీవిస్తూ ఇప్పుడిప్పుడే కనీస సౌకర్యాలకు నోచుకుంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో 'గ్రామం మొత్తాన్ని అదానికి రాసిచ్చాం.. ఇక్కడి నుంచి పొండి' అంటే గిరిజనులు ఏమవ్వాలని ప్రశ్నించారు. అమాయక గిరిజనులను రోడ్డున పడేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. అదాని పవర్ ప్లాంట్‌కు భూములివ్వబోరని తేల్చి చెప్పారు. డిప్యూటీ తహశీల్దార్ సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మి మాట్లాడుతూ గిరిజనుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అనంతరం అక్కడి నుంచి వెనుదిరిగారు. కార్యక్రమంలో గిరిజనులు గమ్మెల అప్పలనాయుడు, గమ్మెల శ్రీను, కిలో అర్జున్, గమ్మెల శోభన్‌బాబు, జమ్ముల బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

# అమల్లోకి రీసెటిల్‌మెంట్ పాలసీ

- గ్రామాల్లో రోడ్ల విస్తరణకు సర్వే
- నిడమర్రులో పూర్తిచేసిన సిఆర్‌డిఎ అధికారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని పరిధిలో కొత్తగా తీసుకొచ్చిన రీసెటిల్‌మెంట్ పాలసీని అమల్లోకి తెచ్చేందుకు అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చిన సిఆర్‌డిఎ దానికి అనుగుణంగా గ్రామాల్లో భూములు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. తొలివిడతగా మంగళగిరి మండలంలోని నిడమర్రులో ఇళ్ల తొలగింపునకు సర్వే చేశారు. సర్వే ప్రకారం సుమారు 78 ఇళ్లు తొలగించాల్సి ఉందని గుర్తించినట్లు తెలిసింది. రీసెటిల్‌మెంట్ పాలసీలో భాగంగా స్థలానికి స్థలం, ఇంటి నిర్మాణానికి ఖర్చు ఇస్తామని బాధితులకు అధికారులు చెప్పినట్లు సమాచారం. దీనిపై సిపిఎం నాయకత్వం ఇటీవల ఆ గ్రామంలో పర్యటించింది. అయితే రాజధాని పరిధిలో ఉన్న ఆర్టిరియల్ రోడ్లు కొన్ని గ్రామాల మధ్యలో నుండి వెళుతున్నాయి. వాటిని విస్తరించాలంటే ఇళ్లను అనివార్యంగా తొలగించాల్సి ఉంది. ఒక్కో రోడ్డు 150 అడుగులకు పైబడి ఉండటంతో ఇళ్ల కోల్పోయే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. దీనికి సంబంధించి రెండు నెలల క్రితం సిఆర్‌డిఎ రీసెటిల్‌మెంట్ పాలసీ పేరుతో డ్రాఫ్ట్‌ను విడుదల చేసింది. ఈ విషయాన్ని ప్రజాశక్తి తొలుత బయటపెట్టింది. గ్రామాల్లోనూ ఇక నుండి ఇళ్లను తీసుకుంటారని, ఖర్చు తగ్గించుకునేందుకు కొత్త పాలసీని ప్రవేశపెడుతున్నారనే విషయాన్ని చెప్పింది.

ప్రస్తుతం దీన్ని అమలు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. నిడమర్రుతోపాటు కురగల్లు, రాయపూడి, ఐనవోలు, తుళ్లూరు, శాఖమూరు, మందడం, దొండపాడు గ్రామాల్లో నుండి రోడ్లు వేయాల్సి ఉంది. ప్రస్తుతం వాటిల్లోనూ ఇళ్ల కోల్పోయే వారికి రీసెటిల్‌మెంట్ పాలసీ ప్రకారం స్థలాలు, నష్టపరిహారం ఇస్తామని అధికారులు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. త్వరలో ఆయా గ్రామాల్లోనూ పూర్తిస్థాయి సర్వే నిర్వహించనున్నట్లు సమాచారం.

# లిక్కర్ స్కాం రూ.10 వేల కోట్లకు పైనే

- సోమిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో లిక్కర్ స్కాం రూ.10 వేల కోట్లకు పైనే జరిగిందని, ఇది ఇంటర్నేషనల్ స్కామ్ అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో నడిచిన కసిరెడ్డి అండ్ టీం ఎక్సైజ్‌శాఖలోని మద్యం డిపోలకు వెళ్లకుండా, స్కానింగ్ కాకుండా డిస్టలరీల నుంచి నేరుగా దుకాణాలకు స్టాక్ తరలించి అక్రమంగా అమ్మేసుకున్నారని అన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యంలో ప్రమాదకర రసాయనాలు ఉన్నాయని ప్రఖ్యాత ఎస్‌జిఎస్ ల్యాబ్ ఎప్పుడో చెప్పిందని అన్నారు. కమీషన్ల రూపంలో వేలకోట్లు దోచేయడంతో పాటు అమాయకుల ప్రాణాలను బలితీసుకున్న వారిపై ఇడి, సిబిఐతో విచారణ జరిపించాలని కోరారు. మద్యం అమ్మకాల్లో రూ.1.30 లక్షల కోట్ల విలువైన నగదు లావాదేవీలు జరగడం దేశంలో ఎక్కడైనా చూశామా? అని ప్రశ్నించారు. దోపిడీ కోసమే మద్యం వ్యాపారంలో డిజిటల్ పేమెంట్లను అనుమతించలేదని, ప్రముఖ డిస్టలరీలను అడ్డంగా మూసేశారని ఆరోపించారు.

### మేడే పోస్టర్ ఆవిష్కరణ

కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మిక దినోత్సవ వేడుకలు టిఎన్‌యుటియుసి అధ్యక్షులు గొట్టిముక్కల రఘురామరాజు ఆధ్వర్యాన మే 1న విజయవాడలోని సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో జరగనున్నాయి. ఈ వేడుకలను జయప్రదం చేయాలని మంత్రి సుభాష్ కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు సుబ్బారావు, ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణ ఆర్డినెన్స్ చెల్లదని పిటిషన్

**ప్రజాశక్తి-అమరావతి :** ఎస్‌సి వర్గీకరణ కోసం రాష్ట్రం తెచ్చిన ఆర్డినెన్స్ రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించాలని కోరుతూ జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అధ్యక్షులు పరస సురేష్ కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. 'సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఆర్డినెన్స్ ఉంది. జనాభా లెక్కల చట్ట ప్రకారం సర్వే చేసే అధికారం కేంద్రానికే ఉంది. రాష్ట్రప్రభుత్వ జీఓ ఆధారంగా గ్రామ, వార్డు సచివాలయ శాఖ 'కుల ఆధారిత సర్వే' చేసింది. దీనికి చట్టబద్ధత లేదు. ఈ సర్వే డేటాపై ఆధారపడి ఏకసభ్య కమిషన్ ఎస్‌సి రిజర్వేషన్లలో ఉప వర్గీకరణకు సిఫార్సు చేయడం చట్ట, రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించాలి. విచారణ జరిపేందుకు నిపుణులతో స్వతంత్ర కమిషన్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయాలి. ఆర్డినెన్స్, ఏకసభ్య కమిషన్ ఏర్పాటుకు 2024 నవంబర్ 15న ఇచ్చిన జీఓ 86, ఎస్‌సి కులాల సోషల్ ఆడిట్ కోసం విధివిధానాల రూపకల్పనకు వెలువరించిన జీఓ 91ని రద్దు చేయాలి. ఆర్డినెన్స్‌ను సస్పెండ్ చేయాలి' అని హైకోర్టును కోరారు. దీనిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలోని ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ చేయనుంది.

# అవాస్తవాలు చెప్పే వారంతా బాధ్యత వహించాలి

## పేదల ఇళ్ల తొలగింపులో అధికారుల తీరు దుర్మార్గం : ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.మాధవరావు

## పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లో పర్యటించిన హైకోర్టు లాయర్ల బృందం

ప్రజాశక్తి-భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

పేదల ఇళ్ల తొలగింపులో అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పేవన్నీ అవాస్తవాలేనని, రాబోయే రోజు ల్లో వారంతా బాధ్యత వహించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.మాధవ రావు అన్నారు. పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లో ఐలు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైకోర్టు లాయర్ల బృందం శనివారం పర్యటించింది. ఈ సందర్భంగా బాధితులు తమకు జరిగిన అన్యాయం, నష్టాన్ని వివరించి కంటతడి పెట్టుకున్నారు. దీనిపై ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవరావు మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో సుమారు 700 ఇళ్లు కూల్చారన్నారు. ఈ ప్రాంతంలోని కాల్వలోకి మురుగు నీరు వెళ్లందని అధికారులు, ప్రభుత్వం చెబుతున్న దంతా అవాస్తవమన్నారు. ఇదే ప్రాంతానికి 20 ఏళ్ల క్రితం టిడిపి ఎంఎల్ఎ సీసీ రోడ్డు నిర్మించాం న్నారు. ఆ రోడ్డును దాటే మురుగు నీరు కాల్వలోకి రావాలని, అయితే ఆ నీరు రాకుండా ప్రతి ఇంటికీ సెప్టిక్ ట్యాంకు ఉందని అన్నారు. నిజంగా నీరు కలుషితమైతే ఆ నీటిని పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపాలని సూచించారు. బాధితుల ఇళ్ల వెనుక భాగాన ఉన్న భూస్వాములు ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే అవి అధికారుల కు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. బాధితులకు చట్టప్రకారం అనేక హక్కులు ఉన్నాయని, వాటిని సాధించుకునే విధంగా బాధితుల పక్షాన నిలుస్తామని అన్నారు. ఐక్యంగా పోరాడితే చట్టపరంగా వారికి అవసరమైన న్యాయ సహాయాన్ని అంతటినీ తాము అందిస్తామన్నారు.

### పేదలపై దౌర్జన్యం చేసిన అధికారులను వదలం : దిగుపాటి రాజగోపాల్

పేదలపై దౌర్జన్యం చేసిన అధికారులను వదిలిపెట్టేది లేదు. ప్రభుత్వ భూముల్లో పేదలు ఇళ్లు వేసుకుంటే పట్టాలు ఇవ్వాలని అనేక ప్రభుత్వాలు చెప్పాయని ఐలు రాష్ట్ర గౌరవాధ్యక్షులు దిగుపాటి రాజగోపాల్ అన్నారు. ఇక్కడ నివశిస్తున్న పేదల ఇళ్ల వెనుక ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న భూస్వాములే, వీరి ఇళ్ల ముందు ఉన్న కొబ్బరి చెట్ల ఫలసాయం సైతం పొందడం విడ్డూరంగా ఉందని అన్నారు. కోర్టు పరిధిలో ఉన్నంత వరకు ఇక్కడ ఇళ్లను తొలగించే ప్రయత్నాలు ఆపాలన్నారు. పేదలకు పట్టాలిచ్చి, ఇళ్లు కట్టించి అప్పుడు ఇక్కడ ఇళ్లను కూల్చితే తాము కూడా సమర్థిస్తామని, అంతేగాని ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు ఎలా కూల్చుతారని నిలదీశారు.

ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ ఎఎస్ఆర్ నగర్ పక్కనే ఉన్న ఆక్వా చెరువులే కాలుష్యానికి కారణమన్నారు. కోర్టు పరిధిలోని ఇళ్లను కూడా కూల్చివేయడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పేదలపై దౌర్జన్యం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరైనా సరే కోర్టులో దోషులుగా నిలబడాల్సి వస్తుందన్నారు. ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, హైకోర్టు అడ్వకేట్ ఎడపల్లి రమేష్ మాట్లాడుతూ అధికారులు కలుషితమవుతోందని చెబుతున్న పంట కాలువలోని నీటితోనే ఇక్కడి ప్రజలు 30 ఏళ్లుగా అన్నం వండుకుంటున్నారని తెలిపారు. ఈ పర్యటనలో హైకోర్టు లాయర్లు సంపర శ్రీనివాసరావు, మద్దాల సాయితేజ, ఎన్.కోటబాబు, పివిపి.లక్ష్మి పాల్గొన్నారు.


**కెనరా బ్యాంక్ Canara Bank** | **ఎఆర్ఎమ్ బ్రాంచ్ (13591)**
మెలోడీ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాభాగ్, విశాఖపట్నం. ఫోన్: 8332956773

**ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద**
**REDEMPTION NOTICE**

**టు:**
**ఋణగ్రహీత: మెస్సర్స్ మారుతీ కాటన్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాతినిధ్యం వహిస్తున్న డైరెక్టర్ శ్రీ పచ్చల శ్రీనివాసరావు, తండ్రి: పి. శివ శంకరరావు,** ఎస్.నెం. 172/4, 172/5 & 172/6, గర్రాజుచీపురుపల్లి, రాజాం మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్-535128. **డైరెక్టర్/హామీదారు: 1. శ్రీ పచ్చల శ్రీనివాసరావు, తండ్రి: పి. శివ శంకరరావు,** డి.నెం. 5-72-75, పండరీపురం, 1వ లేన్ కట్ రోడ్డు, గుంటూరు సిటీ, ఆంధ్రప్రదేశ్-522002, **2. శ్రీమతి పచ్చల సునీత, భర్త: శ్రీ పచ్చల శ్రీనివాసరావు,** డి.నెం. 5-72-75, పండరీపురం, 1వ లేన్ కట్ రోడ్డు, గుంటూరు సిటీ, ఆంధ్రప్రదేశ్-522002.
డియర్ సర్/మేడమ్,

**విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).**

**కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్ బ్రాంచ్, విశాఖపట్నం** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు నర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

**ఋణగ్రహీత/సంస్థ మెస్సర్స్ మారుతీ కాటన్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, తనఖాదారు మరియు హామీదారులు** (పైన తెలిపిన పేర్లు) వారిని లోను అకౌంటుకు సంబంధించిన బకాయి **రూ.13,34,73,975.66/-** (అక్షరాల పదమూడు కోట్ల ముప్పై నాలుగు లక్షల డబ్భై మూడు వేల తొమ్మిది వందల డబ్భై ఐదు రూపాయలు మరియు అరవై ఆరు పైసలు) మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద 07.07.2023** తేదిన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత/సంస్థ తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **తేది. 22.09.2023** న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం సందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక **స్వాధీనం తీసుకున్నారు** మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును **సాక్షి & ది హిందూ** వార్తాపత్రికలలో తేది. 23.09.2023 న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **25.04.2025** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.18,40,26,026.85/-** (**అక్షరాల పద్దెనిమిది కోట్ల నలభై లక్షల ఇరవై ఆరు వేల ఇరవై ఆరు రూపాయలు మరియు ఎనభై ఐదు పైసలు మాత్రమే**) + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గౌరవనీయ హైకోర్టు, హైదరాబాద్ న్యాయవ్యవస్థ నిర్దేశించిన రిట్ పిటీషన్ నెం. 8155/2018 ప్రతిపాదనకు అనుగుణంగా ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయ ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అములులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

**తేది: 25.04.2025, ప్రదేశం: విశాఖపట్నం** — **సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్**



**డిసిబి బ్యాంక్ లిమిటెడ్** | **డిసిబి బ్యాంక్**
జ్యోతి మజెస్టిక్, జంజారా హిల్స్, హైదరాబాద్-తెలంగాణ-500034

**స్వాధీనతా ప్రకటన**

ఏదైతే, దిగువ సంతకందారు అయిన డిసిబి బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 (2002 యొక్క 54) రూల్ 3 తో చదువబడే సెక్షన్ 13(12) సెక్యూరిటీ ఇంట్రస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ సదరు నోటీసు రోజు తేది నుండి 60 రోజులలోగా క్రింద పేర్కొన్న పట్టికలోని మొత్తాన్ని దానిపై తదుపరి వడ్డీతో తిరిగి చెల్లించాల్సిందిగా ఋణగ్రహీతలు **(ఋణగ్రహీతలు మరియు సహ ఋణగ్రహీతలు)** కోరుతూ డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది.

ఋణగ్రహీత మరియు సహ ఋణగ్రహీత పేర్కొన్న మొత్తమును తిరిగి చెల్లించడంలో విఫలమయినందున, ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా సెక్యూరిటీ ఇంట్రస్ట్ రూల్స్ 2002 యొక్క సెక్షన్ 14(1)తో చదువుతూ రూల్ 8తో కూడా చదువుతూ సెక్షన్ 13 సబ్ సెక్షన్ (4) క్రింద దిగువసంతకాదారు తనకు సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ క్రింద తెలిపిన ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది.

ముఖ్యంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తి **(స్థిరాస్తి వివరణ)** తో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు డిసిబి బ్యాంక్ లిమిటెడ్‌కు మొత్తం మరియు దానిపై వడ్డీ, ఖర్చులు చెల్లించి జరుపవచ్చు.

ఋణగ్రహీతలు జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అవ్వేనించడమైనది.

| | |
|---|---|
| 1 | లాంఛనప్రాయ స్వాధీనతా తేదీ: 23 ఏప్రిల్, 2025 |
| డిమాండ్ నోటీసు తేదీ | 21-11-2024 |
| ఋణగ్రహీత(లు) మరియు (సహ-ఋణగ్రహీత(ల) పేరు | **శ్రీ.కొనకళ్ల రాంబాబు, శ్రీమతి. కొనకళ్ల కల్పన మరియు శ్రీ.కొనకళ్ల వెంకట నాంచారయ్య** |
| ఋణ ఖాతా నెంబరు | **DBLAGAG00438270/DBLAGAG00486121/ DBLAGAG00525149** |
| పూర్తి బకాయి ఉన్న మొత్తం | 21 నంబర్, 2024 నాటికి రూ.7,66,886.30/- (ఏడు లక్షల అరవై ఆరు వేల ఎనిమిది వందల ఎనభై ఆరు రూపాయల ముప్పై పైసలు మాత్రమే) |
| స్థిరాస్తులకు సంబంధించిన వివరణ | కృష్ణాజిల్లా, గుడివాడ గ్రామం, ఆర్.ఎస్.నం.296 లో ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ బేరింగ్ డో.నం.1/591 ప్లాట్ నం.87 కొలత 389 చ.గ.లు. అనగా.. 325.24 చ.మీ.లు. హద్దులు : తూర్పు : యనిగళ్ల రామారావు సైట్, దక్షిణం : ప్లాట్ నం.88, ఉత్తరం : కొల్లూరు హరికృష్ణ సైట్, పడమర : రోడ్డు (సెక్యూర్డ్ అసెట్స్) |
| 2 | లాంఛనప్రాయ స్వాధీనతా తేదీ:25 ఏప్రిల్, 2025 |
| డిమాండ్ నోటీసు తేదీ | 27-11-2024 |
| ఋణగ్రహీత(లు) మరియు (సహ-ఋణగ్రహీత(ల) పేరు | **శ్రీ.రాజ వెంకట నాగ శేషగిరి దుర్గారావు, శ్రీ.రాజ నాగరాజు మరియు శ్రీమతి. రాజ కోటేశ్వరమ్మ** |
| ఋణ ఖాతా నెంబరు | **DAHLNAL00574414** |
| పూర్తి బకాయి ఉన్న మొత్తం | 27 నవంబరు, 2024 నాటికి రూ.39,72,179/- (ముప్పై తొమ్మిది లక్షల డెబ్భై రెండు వేల ఒక వందా డెబ్భై తొమ్మిది రూపాయలు మాత్రమే) |
| స్థిరాస్తులకు సంబంధించిన వివరణ | గుంటూరు జిల్లా, నల్లపాడు గ్రామం వద్ద ఉన్న మూల్యానం నం.1021011066, డో.నం.35 మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ డో.నం.3-29-8/9 బయటి కొలత 80 చ.గ.లు. హద్దులు : తూర్పు : వల్లూరు రామసుబ్బారావు ఆస్తి, దక్షిణం : బాలసుబ్రమణ్యం ఆస్తి, పడమర : అడగళ్ల వాణి కుసుమ ఆస్తి, ఉత్తరం : 6 అ.లు. వెడల్పు మార్గం. (సెక్యూర్డ్ అసెట్స్) |

**తేది : 27.04.2025** — **డిసిబి బ్యాంక్ లిమిటెడ్ తరపున**
**ప్రదేశం : విజయవాడ** — **అధీకృత అధికారి**



**Paper Publication**
**[Substituted Service]**
**FORM NO.14**
**{See Regulation 33(2)}**
**OFFICE OF THE RECOVERY OFFICER-I**
**DEBTS RECOVERY TRIBUNAL**
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Narayana Bhavanam,
Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

**DEMAND NOT

## ప్రముఖ చరిత్రకారుడు ఎంజిఎస్ నారాయణన్ కన్నుమూత

**కొజికోడ్ :** ప్రముఖ చరిత్రకారుడు ఎంజిఎస్ నారాయణన్ (92) కన్నుమూశారు. గత కొన్నిరోజులుగా ఆయన వయోసంబంధిత సమస్యలతో బాధపడుతూ శనివారం కొజికోడ్‌లోని మాలపరంబాలోని తన నివాసం 'మైత్రి'లో తుదిశ్వాస విడిచారు. ఆయన ప్రముఖ విద్యావేత్తగా, రచయితగా, రాజకీయ పరిశీలకులుగా భారతీయ చరిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ (ఐసిహెచ్ఆర్) ఛైర్మన్‌గానూ ఎనలేని సేవలందించారు. ఆయనకు భార్య ప్రేమలత, ఇద్దరు కుమారులు విజయ్, వినయ్‌లు ఉన్నారు. ఎన్ విజయ్‌కుమార్ భారత వైమానిక దళంలో పనిచేస్తున్నారు. ఎన్ వినయ్ బెంగళూరులో ప్రముఖ నృతకారుడుగా ఉన్నారు. ఎంజిఎస్ నారాయణన్ మృతి పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సంతాపం ప్రకటించారు ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. మితవాద శక్తులు చరిత్రకు వక్రభాష్యాలు చెప్పేందుకు చేసిన ప్రయత్నాలను ఎంజిఎస్ ధీరోచితంగా తిప్పికొట్టారని నిజమైన ప్రజల చరిత్రను రక్షించారని విజయన్ కొనియాడారు.

## రాహుల్ గాంధీకి పుణె కోర్టు సమన్లు

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి పుణె కోర్టు శనివారం సమన్లు జారీ చేసింది. లండన్ పర్యటన సమయంలో స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్‌ను ఉద్దేశిస్తూ రాహుల్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ సమన్లు అందాయి. లండన్ పర్యటన సమయంలో సావర్కర్‌ను రాహుల్ ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో సావర్కర్ మనవడు సత్యకి సావర్కర్.. రాహుల్‌పై పరువునష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు పోలీసులు గతంలో తేల్చారు. కాగా.. దీనిపై తాజాగా విచారణ జరిపిన న్యాయస్థానం మే 9న ఆయన తమముందు హాజరుకావాలని కోరుతూ సమన్లు జారీ చేసింది.

## ఆస్ట్రేలియాలో ప్రవాసీ భారతీయుల నిరసన

**సిడ్నీ :** పహల్గాం ఉగ్రదాడిపై దేశీయంగా, అంతర్జాతీయంగా రోజురోజుకు నిరసనలు మిన్నంటుతున్నాయి. పలు దేశాల్లో ఉన్న ప్రవాస భారతీయులు పాక్ ఎంబసీ ఎదుట భారీగా నిరసన ప్రదర్శనలు చేపడుతున్నారు. పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా తమ గళం వినిపిస్తున్నారు. శనివారం ఆస్ట్రేలియాలోని మెల్‌బర్న్‌లో ప్రవాస భారతీయులు భారీ నిరసన తెలిపారు. ప్లకార్డులు చేబూని ర్యాలీ తీశారు. పాక్ దేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాద కార్యకలాపాలు ఆపాలనీ, పహల్గాం బాధితులకు సరైన న్యాయం చేయాలని, ఆదేశ సైన్యం.. ఉగ్రవాద ఆర్మీ అని ప్రవాస భారతీయులు నినదించారు. అదే విధంగా ఆస్ట్రేలియాలోని పాక్ రాయబార కార్యాలయం ఎదుట కూడా నిరసన ప్రదర్శన చేపట్టారు. మరోవైపు నేపాల్‌లోని పాక్ రాయబార ఆఫీస్ వద్ద కూడా ఆ దేశంలోని భారతీయులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి లండన్‌లోని పాక్ ఎంబసీ ఎదుట కూడా ఇండియన్స్ భారీ నిరసన ర్యాలీ చేపట్టిన విషయం తెలిసిందే. అదే విధంగా పలు దేశాల అధినేతలు భారత్‌కు బాసటగా నిలుస్తున్నారు. ఉగ్రవాదాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ఈనెల 22న పహల్గాం బైసరన్ లోయలో అమాయక పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడిన విషయం విదితమే. ఈదాడిలో 26మంది ప్రాణాలు కోల్పోయారు.

## గుజరాత్ పోలీసుల అదుపులో వలసదారులు

**అహ్మదాబాద్ :** గుజరాత్‌లో చేపట్టిన భారీ ఆపరేషన్‌లో 1000 మందికిపైగా బంగ్లాదేశీ అక్రమ వలసదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా తప్పుడు ధ్రువపత్రాలతో రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు గుజరాత్ హోంమంత్రి హర్ష్ సంఘవి వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి రాష్ట్రంలోని పలు నగరాల్లో పోలీసులు పెద్దయెత్తున తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగానే అహ్మదాబాద్‌లో 890 మందిని, సూరత్‌లో 134 మందిని అదుపులోకి తీసుకున్నట్లు హోంమంత్రి తెలిపారు. వీరంతా పశ్చిమ బెంగాల్‌లో సరిహద్దులు దాటి భారత్‌లోకి ప్రవేశించినట్లు పేర్కొన్నారు.

## 44,676 ఎకరాల భూ సమీకరణ

(మొదటి పేజీ తరవాయి)

ప్రభుత్వం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలను రైతులతో సమావేశాలు నిర్వహించి ముందుగా వారిని సిద్ధం చేయాలని సూచించింది. ప్రకటన వచ్చిన తరువాత అభిప్రాయాల కంటే ముందుగానే వారికి విషయం చెప్పేస్తే వ్యతిరేకత రాకుండా ఉంటుందని సూచించింది. ఆ మేరకు ఎమ్మెల్యేలు కార్యాచరణ మొదలుపెట్టారు. ఇప్పటికే దీనిపై సోషల్ మీడియాలోనూ ప్రచారం మొదలుపెట్టారు. ఈసారి పూలింగులో కొత్త జాతీయ రహదారి వరకూ చేపట్టనున్నారు.

# స్టార్టప్‌లకు గడ్డుకాలం

- రెండేళ్లలో 28వేలకు పైగా కంపెనీలు క్లోజ్
- కొత్తగా వచ్చేవి కూడా చాలా తక్కువే..!
- ఈ ఏడాదిలో స్థాపించిన అంకుర సంస్థలు 125 మాత్రమే
- 'ట్రాక్సన్' నివేదిక సమాచారం

**న్యూఢిల్లీ :** దేశంలోని మోడీ పాలనలో అంకుర సంస్థలు(స్టార్టప్‌లు) అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలవాలనీ, ఉద్యోగ కల్పనలో తమ వంతు పాత్ర పోషించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని చూస్తున్న యువపారిశ్రామికవేత్తలకు అలాంటి పరిస్థితులు కనబడటం లేదు. ఇది వారిని తీవ్ర నిరాశకు, కలవరానికి గురి చేస్తున్నది. దేశంలో వేల సంఖ్యలో స్టార్టప్‌లు మూతపడుతుండటమే ఈ పరిస్థితికి నిదర్శనం. భారత్‌లో గత రెండేండ్లలో 28 వేలకు పైగా స్టార్టప్‌లు క్లోజ్ అయ్యాయి. డేటా ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ట్రాక్సన్ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది.

**రెండేండ్లలో 12 రెట్లు అధికం**

ఈ నివేదిక సమాచారం ప్రకారం.. గత రెండేండ్లలో 28,638 స్టార్టప్‌లు క్లోజ్ అయ్యాయి. ఇందులో, 2023లో 15,921, 2024లో 12,717 కంపెనీలు ఉన్నాయి. స్టార్టప్‌లు మూతపడుతున్న తీరు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నది. గత రెండేండ్లలో మూతపడిన స్టార్టప్‌ల సంఖ్య అనేది.. 2019 నుంచి 2022 మధ్య క్లోజ్ అయిన కంపెనీల సంఖ్య కంటే 12 రెట్లు అధికంగా కావటం గమనార్హం. ఈ మూడేండ్లలో క్లోజ్ అయిన అంకుర సంస్థల సంఖ్య 2300.

**తగ్గిపోతున్న స్టార్టప్‌లు**

దేశంలో కొత్తగా ఏర్పాటు చేసే స్టార్టప్‌ల సంఖ్య కూడా తగ్గిపోవటం ఆందోళనను కలిగిస్తున్నది. 2019 నుంచి 2022 మధ్య నెలకొల్పబడిన అంకుర సంస్థల సంఖ్య 9600కు పైగా ఉండగా.. అది 2024లో 5264కు పడిపోయింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు స్థాపించబడిన స్టార్టప్‌లు 125 మాత్రమే కావటం గమనార్హం. ఈ మూసివేతలు అధికంగా అగ్రిటెక్, ఫిన్‌టెక్, ఎడ్‌టెక్, హెల్త్‌టెక్ రంగాలలో జరిగాయని తెలుస్తున్నది. స్టార్టప్‌ల కొనుగోలు సంఖ్య కూడా తగ్గిపోయింది. 2021లో ఇది 248గా ఉండగా.. గతేడాది 131కి పడిపోయింది. ఇక ఈ ఏడాదిలో ఇప్పటికే 259 స్టార్టప్‌లు క్లోజ్ అయ్యాయి. రాబోయే నెలల్లో ఈ సంఖ్య ఇంకా పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ప్రభుత్వ చేయూత లేకే ఈ పరిస్థితి**

అంకుర సంస్థలు దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకం. యువతను ఉద్యోగార్థుల్లా కాకుండా.. ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. వారి ఆర్థిక స్వావలంబనకు అవకాశాన్ని కల్పిస్తాయి. కాబట్టి.. వివిధ రంగాల్లో కొత్తగా కంపెనీలు ఏర్పాటు చేసేవారికి, యువతకు ప్రభుత్వం నుంచి మద్దతు చాలా తప్పనిసరి. స్టార్టప్‌లకు ఎదురయ్యే కష్టాలను గుర్తించి, వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలి. అయితే, కొన్నేండ్ల క్రితం స్టార్టప్‌లపై ప్రభుత్వాలు పెట్టిన శ్రద్ధ.. ప్రస్తుతం కనబడటం లేదు. ఈ కారణంగానే అంకుర సంస్థలు మూతపడుతు, కొత్తవి ఏర్పాటు కాక.. క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని నిపుణులు చెప్తున్నారు.

# విమానయానం ప్రియం..!

- అంతర్జాతీయ రూట్లలో 12 శాతం ఛార్జిల పెంపు
- పాకిస్తాన్ గగనతలం మూసివేత ప్రభావం
- డిజిసిఎ కీలక సూచనలు

**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ ప్రయాణాలు చేసే వారిపై మరింత భారం పెరగనుంది. పహెల్గాం ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో పాక్ ఆ దేశ గగనతలాన్ని మూసివేసింది. దీంతో భారత్‌లో రిజిస్టర్ అయిన అన్ని విమానాలతోపాటు ఇక్కడి యాజమాన్యంలో ఉన్న విమానాలు పాక్ గగనతలం గుండా ప్రయాణించేందుకు అనుమతి లేదు. యూరప్, అమెరికా, మిడిల్‌ఈస్ట్ తదితర దేశాలకు పాక్ గగనతలంపై నుంచి భారత విమాన సర్వీసులు వెళ్లే అవకాశాలు లేకపోవడంతో చుట్టూ తిరిగి ప్రయాణించడంతో వ్యయాలు పెరిగాయి. ఆయా భారాన్ని ప్రయాణికులపై మోపాలని విమాన సంస్థలు నిర్ణయించాయి. దాదాపు 8 శాతం నుంచి 12 శాతం వరకు పెంచనున్నట్లు తెలుస్తోంది. భారత్ నుంచి ఉత్తర అమెరికా, బ్రిటన్, యూరప్ తదితర దేశాలకు వెళ్లే అంతర్జాతీయ ప్రయాణికుల సమయం మరింత పెరిగిందని ఇప్పటికే ఎయిర్ ఇండియా, ఇండిగో లాంటి సంస్థలు తమ ప్రయాణికులకు సమాచారం ఇస్తున్నాయి. అమెరికా, యూరోపియన్ దేశాలకు వెళ్లే విమాన ప్రయాణ సమయం 2 గంటల నుంచి 2.5 గంటల వరకు పెరగిందని ఓ పైలట్ తెలిపారు. దీంతో చమురు, నిర్వహణ వ్యయం పెరగడంతో విమాన ఛార్జీలను పెంచాలని ఆయా సంస్థలు భావిస్తున్నాయన్నారు.

ఢిల్లీ, అమృత్‌సర్, జైపూర్, లక్నో, వారణాసి తదితర నగరాల నుంచి ప్రయాణించేవారు అదనపు సమయం వెచ్చించడంతో పాటు అదనపు వ్యయం భరించాల్సి వస్తోందని విమానయాన సంస్థల వర్గాలు పేర్కొన్నాయి. ప్రయాణానికి అదనపు సమయం పట్టడం వల్ల ఇతర దేశాల్లో కనెక్టింగ్ విమానాలు అందుకోవడం కష్టం కావొచ్చు. ఇది కూడా ప్రయాణీలపై భారం పెంచనుంది. కాగా.. భారత విమానాలకు తమ గగనతలాన్ని పాక్ మూసివేయడం ఇదే మొదటిసారి కాదు. బాలాకోట్ వైమానిక దాడుల నేపథ్యంలో 2019 ఫిబ్రవరిలోనూ ఇలాంటి పరిస్థితి తలెత్తింది.

**డిజిసిఎ అడ్వైజరీ..**

భారత విమానాలపై పాక్ ఆంక్షలు విధించిన నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) విమానయాన సంస్థలకు పలు సూచనలు జారీ చేసింది. అంతర్జాతీయ విమానాల రాకపోకలకు ప్రయాణ సమయం పెరగనున్న నేపథ్యంలో విమానయాన సంస్థలకు పలు అడ్వైజరీలు జారీ చేసింది. విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని ప్రయాణికులకు అందించాలని సూచించింది. విమానాల్లో ప్రయాణికులకు భోజనం, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సదుపాయం, కస్టమర్‌కేర్ సర్వీసులతో సహా ఇతర సదుపాయాలను అందుబాటులో ఉంచాలని పేర్కొంది.

## విద్యార్థి 'వీసా' రిజిస్ట్రేషన్ల పునరుద్ధరణ

**వాషింగ్టన్ :** అమెరికాలో చదువుకుంటున్న వేలాది మంది విదేశీ విద్యార్థుల వీసా రిజిస్ట్రేషన్లను ట్రంప్ ప్రభుత్వం పునరుద్ధరించింది. స్వల్ప కారణాలతో, చట్టపరమైన ఉల్లంఘనలతో రద్దు చేసిన వీసాలు కూడా వీటిలో ఉన్నాయి. ట్రంప్ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను న్యాయమూర్తులు పరిశీలించారు. విదేశీ విద్యార్థుల ఆచూకీ తెలుసుకోవడానికి ఉపయోగించే ఫెడరల్ డేటాబేస్ నుంచి విద్యార్థులను పెద్ద సంఖ్యలో తొలగించడం చట్టవిరుద్ధమని వారు తేల్చారు. దీంతో తమ ఉత్తర్వులను రద్దు చేసుకుంటున్నామని న్యాయ మంత్రిత్వ శాఖ కోర్టుకు తెలిపింది. ఫెడరల్ డేటాబేస్ నుంచి తమ పేర్లను తొలగించడంపై వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చట్టపరంగా తమకు లభిస్తున్న ఇమ్మిగ్రేషన్ హోదాను కోల్పోతామని, తమను వెంటనే స్వదేశాలకు తరలిస్తారని వారు భయపడ్డారు. ప్రభుత్వ చర్యను సవాలు చేస్తూ పలువురు విద్యార్థులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. తాము చదువుతున్న విద్యా సంస్థలు తమను ఇప్పటికే తరగతులకు హాజరు కానివ్వడం లేదని, పరిశోధనలు చేయనివ్వడం లేదని, గ్రాడ్యుయేషన్‌కు కొన్ని వారాల ముందే ఇలాంటి చర్యలు చేపట్టారని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. విద్యార్థులను తరగతులకు అనుమతిస్తారా లేక వారు వెంటనే దేశం నుంచి వెళ్లిపోవాల్సిన అవసరం ఉన్నదా అని న్యాయమూర్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు ప్రభుత్వ న్యాయవాదులు ఇష్టపడలేదు. దీనిపై న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఫెడరల్ డేటాబేస్ నుంచి విద్యార్థులను తొలగించడంపై ఈ నెల ప్రారంభంలో వందకు పైగా వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిలో 50 కేసులపై తీర్పు వెలువరించిన న్యాయమూర్తులు విద్యార్థులకు అనుకూలంగా ఆదేశాలు జారీ చేశారు.

# శాంతిదూతకు కన్నీటి వీడ్కోలు

- ముగిసిన పోప్ అంత్యక్రియలు
- 4 లక్షల మందిపైగా అశ్రునివాళి

పోప్‌కు మతపెద్దల నివాళి

**వాటికన్ సిటీ :** ప్రపంచ ప్రజల మధ్య యుద్ధాలు కూడదని, శాంతి, సోదరభావం పెంపొందాలని జీవితాంతం ఆకాంక్షించిన శాంతిదూత, పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు శనివారం ఇక్కడ సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో జరిగాయి. వాటికన్‌సిటీ సాంప్రదాయ లాంఛనాల అనంతరం ఆయన భౌతిక కాయాన్ని శాంటా మారియా మాగియోర్‌లో ఖననం చేశారు. ఈ కార్యక్రమానికి వందలాది మంది ప్రపంచ నేతలు, కేథలిక్కు మత పెద్దలు సహా నాలుగు లక్షల మంది పైగా హాజరై తమ అధ్యాత్మిక నేతకు అశ్రునివాళులర్పించారు. గత మూడు రోజులుగా ప్రజల సందర్శనార్థం వుంచిన పోప్ భౌతిక కాయాన్ని లక్షలాది మంది ప్రజలు దర్శించుకున్నారు. ఇక సందర్శన ముగిసినట్లేనని నిర్వాహకులు ప్రకటించడంతో చూడలేని వేలాదిమంది కన్నీటితో వెనుదిరగాల్సి వచ్చింది. ఆ జన సందోహాన్ని చూస్తుంటే పోప్‌గా ఆయన ప్రాధాన్యతలు, పాస్టర్‌గా ఆయన ఆకాంక్షలు అన్నీ ప్రతిబింబించాయి. పోప్ భౌతిక కాయం వున్న శవపేటికను వీక్షించేందుకు రోమ్ నగర వీధుల్లో శనివారం లక్షలాది మంది ప్రజలు వరుసలు తీరి నిలుచున్నారు. అంత్యక్రియలు జరిగే ప్రాంతానికి శవ పేటికను తీసుకెళ్ళు తుండగా, వీరందరూ నివాళులు అర్పించారు.

భారత్ నుండి శుక్రవారమే వాటికన్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా పోప్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. ఆ ఫోటోలను పంచుకుంటూ ప్రధాని నరేంద్ర మోడీ సమాజానికి పోప్ చేసిన సేవలను ఈ ప్రపంచం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని వ్యాఖ్యానించారు. చర్చి అన్నది అందరికీ ఒక నివాసం వంటిదని పోప్ విశ్వసించేవారని, అలాంటి వారికి చర్చి తలుపులు తెరిచే వుంటాయని అనేవారని ఈ సందర్భంగా కేథలిక్ మత పెద్దలు గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరి పట్ల కరుణ భావనతో వుంటూ ప్రజల్లో పోప్‌గా ఆయన నిలిచారని వ్యాఖ్యానించారు.

## ట్రంప్- జెలెన్‌స్కీ భేటీ

- పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలకు ముందు సమావేశం

**రోమ్ :** పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హాజరయ్యారు. అంత్యక్రియల్లో పాల్గొనే ముందు ట్రంప్, జెలెన్‌స్కీలు రోమ్‌లో 15 నిమిషాల పాటు భేటీ అయ్యారు. ఇరు దేశాధ్యక్షులు రష్యా- ఉక్రెయిన్ యుద్ధం గురించి, శాంతి చర్చల గురించి చర్చలు జరిపినట్టు ఉక్రెయిన్ అధ్యక్ష ప్రతినిధి సెర్జీ నికిఫోరోవ్ తెలిపారు. అమెరికాలోని ఓవల్ కార్యాలయంలో ట్రంప్‌నకు, జెలెన్‌స్కీకి వాగ్వాదం జరిగిన తర్వాత వారు కలవడం ఇదే మొదటిసారి. ఇటీవల యుద్ధం ముగింపు గురించి ట్రంప్ మాట్లాడుతూ.. ఈ వారంలోనే ఓ ఒప్పందానికి వచ్చే అవకాశమున్నదని పేర్కొన్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే పోప్ అంత్యక్రియల కార్యక్రమంలో వీరిద్దరు ఒకే దగ్గర కూర్చోకపోవడంతో వీరి మధ్య ఇంకా మనస్పర్థలు ఉన్నాయన్న వార్తలు వచ్చాయి. వీటిపై వైట్ హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చియుంగ్ స్పందిస్తూ.. కార్యక్రమంలో ఫ్రెంచ్ అక్షర క్రమంలో అంత్యక్రియలకు హాజరైన వివిధ దేశాల ప్రతినిధులకు సీటింగ్ ఏర్పాటు చేశారనీ, అంతకు మించి వేరే కారణం లేదని స్పష్టతనిచ్చారు. కాగా, పోప్ అంత్యక్రియలకు జెలెన్‌స్కీ తన భార్య ఒలేనా జెలెన్‌స్కీతో హాజరయ్యారు.

# ఇరాన్ పోర్టులో శక్తివంతమైన పేలుడు

- నలుగురు మృతి - 500 మందికి పైగా గాయాలు

**టెహరాన్ :** దక్షిణ ఇరాన్‌లో శనివారం అతి పెద్ద పేలుడు సంభవించి, మంటలు చెలరేగాయి. ఈ దారుణ ఘటనలో నలుగురు మరణించారు. మరో 500 మంది పైగా గాయపడ్డారు. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ పేర్కొన్న వివరాల ప్రకారం.. బందర్ అబ్బాస్ వెలుపల కంటెయినర్ షిప్‌మెంట్‌లకు ఉపయోగించే ప్రధాన ఓడరేవు అయిన షాహిద్ రజాయ్ పోర్టులో ఈ పేలుడు సంభవించింది. ఇరాన్ రాజధాని టెహరాన్‌కు దాదాపు 1050 కిలోమీటర్ల దూరంలో హోర్ముజ్ జలసంధిపై ఈ ఓడరేవు వుంది. ఇక్కడ నుండి ఏడాదికి దాదాపు 8 కోట్ల టన్నుల ఉత్పత్తులు రవాణా అవుతాయి. పేలుడు జరిగిన వెంటనే పెద్ద మొత్తంలో దట్టంగా ఆకాశంలో పొగ కమ్ముకుంది. ఈ దృశ్యాలు సోషల్ మీడియా వీడియోల్లో బాగా వైరల్ అయ్యాయి. పేలుడు ధాటికి సమీప భవనాల గ్లాస్ తలుపులు, కిటికీలు కిలోమీటర్ల మేర విసిరేసినట్లుగా పడ్డాయి. ఈ పేలుడుకు కారణాలేంటనేది అధికారులు చెప్పలేదు. కానీ పోర్టులో బాగా మండే గుణం కలిగిన వస్తువుల వల్ల ఈ పేలుడు జరిగి వుంటుందని భావిస్తున్నారు. ఇరాన్‌లో ఇలా పారిశ్రామిక ప్రమాదాలు చాలా సర్వసాధారణం. ముఖ్యంగా అంతర్జాతీయ ఆంక్షల కారణంగా కాలం చెల్లిన చమురు కేంద్రాలు చాలా ఇబ్బందులు పడుతున్నాయి. అయితే ఇంధన సదుపాయాలేవీ ఈ పేలుడులో ధ్వంసమవలేదని, అలాగే ఈ పేలుడుకు అవి కారణం కూడా కావని ఇరాన్ ప్రభుత్వ టివి స్పష్టంగా తేల్చి చెప్పింది. నగరంలోని రాజాయ్ పోర్టులో కంటెయినర్ల నుండి పేలుడు సంభవించిందని ప్రావిన్షియల్ వివత్తు నిర్వహణా అధికారి మెహ్రాదాద్ హసన్‌జాదా చెప్పారు. పేలుడు తీవ్రత కారణంగా ఒక భవనం కూలిపోయిందని ప్రభుత్వ టివి వర్గాలు తెలిపాయి. ఇంతకుమించి వివరాలు వెల్లడించలేదు.

## ఉగ్రవాదుల రహస్య స్థావరం ధ్వంసం

- పెద్దయెత్తున ఆయుధాలు స్వాధీనం

**న్యూఢిల్లీ :** పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి తర్వాత ఉగ్రవాదులను పట్టుకునేందుకు భద్రతా దళాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగా కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని భద్రతాదళాలు గుర్తించి.. ధ్వంసం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే వారి స్థావరాల నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఉగ్రస్థావరాలు ఉన్నాయని నిర్దిష్ట నిఘా వర్గాల సమాచారం మేరకు ఉత్తర కశ్మీర్ జిల్లాలోని సెడోరి నాలా అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు సోదాలు నిర్వహించాయని అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించాలనే లక్ష్యంతో ఉగ్రవాదులు కుట్రపన్నుతున్నారని సమాచారం వచ్చిందని, ఈ సమయంలో సైన్యం వారి స్థావరాలను ధ్వంసం చేయడం ఉగ్రవేటలో మరో ముందడుగని అన్నారు.

## పాక్ ప్రధాని ప్రకటనకు ప్రాధాన్యత లేదు : ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్ :** పహల్గాం దాడిపై తటస్థ దర్యాప్తునకు సిద్ధమేనంటూ పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ చేసిన ప్రకటనను జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా నిరసించారు. పాక్ ప్రకటనకు అసలు ప్రాధాన్యతే లేదని అబ్దుల్లా పేర్కొన్నారు. పహల్గాంలో దాడి జరిగిన విషయాన్నే తొలుత వారు (పాక్) గుర్తించలేదని, ఇప్పుడు స్వరం మారుతోందని విమర్శించారు. తొలుత మనపైనే ఆరోపణలు చేసిన వ్యక్తులు ఇప్పుడు ఒక్కసారిగా ఆ సంఘటన గురించి మాట్లాడితే దానికి ప్రాధాన్యత ఇవ్వాలనుకోవడం లేదని అబ్దుల్లా పేర్కొన్నారు. ఈ దాడి నేపథ్యంలో కాశ్మీర్‌లో చేసుకున్న బుకింగ్స్‌ను పెద్ద ఎత్తున రద్దు చేసుకోవడం, పెద్ద సంఖ్యలో పర్యాటకులు వెళ్ళిపోతున్న సంఘటనలను ఒమర్ ప్రస్తావించారు. పర్యాటకుల్లో నెలకొన్న భయాన్ని తాను అర్థం చేసుకోగలనన్నారు. అయితే ఇలాంటి సమయాల్లో కాశ్మీర్‌ను వీడి వెళితే మన శత్రువులు గెలవడానికి అవకాశం ఇచ్చినట్లవుతుందని అన్నారు. కాశ్మీర్ నుండి పర్యాటకులందరినీ బయటకు పంపివేయడానికే శత్రువులు వారిని లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు.

## భద్రతా బలగాల కదలికలపై లైవ్ కవరేజీ వద్దు

- మీడియా సంస్థలకు కేంద్రం ఆదేశాలు

**న్యూఢిల్లీ :** రక్షణ శాఖ ఆపరేషన్లు, భద్రతా బలగాల కదలికలకు సంబంధించిన ప్రత్యక్ష ప్రసారాలు చేయకుండా సంయమనం పాటించాల్సిందిగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ శనివారం అన్ని మీడియా సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. జాతీయ భద్రతా ప్రయోజనాల దృష్ట్యా అన్ని మీడియా వేదికలు, వార్తా సంస్థలు, సోషల్ మీడియా యూజర్లు అత్యంత బాధ్యతతో వ్యవహరిస్తూ, రక్షణ రంగ, భద్రతాపరమైన అంశాలపై రిపోర్టింగ్ చేసేటపుడు ప్రస్తుతమున్న చట్టాలు, నిబంధనలకు పూర్తిగా కట్టుబడి వుండాలని పేర్కొంది. పహల్గాం దాడి నేపథ్యంలో పెద్ద ఎత్తున ఉగ్రవాద వ్యతిరేక చర్యలు చేపట్టాలని కేంద్రం యోచిస్తోంది. ఈ పరిస్థితుల్లో వాస్తవిక కవరేజ్, సంబంధిత చిత్రాలను పంచుకోవడం, లేదా రక్షణ రంగ ఆపరేషన్లకు సంబంధించి మూలాల నుండి రిపోర్టింగ్ చేయడం ఆపాలని కోరింది. కార్గిల్ యుద్ధం, ముంబయి తీవ్రవాద దాడులు, కాందహార్ హైజాకింగ్ వంటి కొన్ని సంఘటనల సమయాల్లో కవరేజీపై ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రసారాలు కావడంతో అనుకోని విపత్కర పర్యవసానాలు ఎదురయ్యాయని మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు.

## పర్యాటకులను కాపాడిన రవాణా రంగ హీరోలకు ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ అభినందనలు

**న్యూఢిల్లీ :** పహల్గాంలో ఉగ్ర దాడి జరిగినపుడు శ్రీనగర్‌లో ఆటో రిక్షా డ్రైవర్లు మానవత్వంతో, సామరస్యంతో అందించిన తోడ్పాటును అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) అభినందించింది. దాడి నుండి తప్పించుకుని బయటపడిన పర్యాటకులు విమానాశ్రయాలకు, రైల్వే స్టేషన్లకు వెళ్ళడానికి ఆటో రిక్షా డ్రైవర్లందరూ స్వచ్ఛందంగా, ఉచితంగా రవాణాను అందించారు. పర్యాటకులపై జరిగిన దాడి అత్యంత అమానుషమని, తీవ్రంగా ఖండించదగినదని సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్ ప్రాంత ప్రజలందరూ ముక్త కంఠంతో ఈ తీవ్రవాద దాడిని ఖండించారన్నారు. కుల, మతాలతో నిమిత్తం లేకుండా ఈ ఖండనలు వచ్చాయన్నారు. పర్యాటకులను కాపాడేందుకు తన ప్రాణాలను పణంగా పెట్టిన గుర్రపు రైతు ఆదిల్ మృతికి సమాఖ్య తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసింది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియచేసింది. మరో టూరిస్ట్ గైడ్ నజక్ వీరోచితంగా చత్తీస్‌గఢ్‌కు చెందిన 11మంది పర్యాటకులను కాపాడారని గుర్తు చేశారు. ఉగ్ర దాడిలో తన తండ్రిని కోల్పోయిన కొచ్చికి చెందిన ఆరతి మీనన్‌కు ఆస్పత్రిలో అన్ని లాంఛనాలు పూర్తయ్యేవరకు, విమానాశ్రయానికి తిరిగి వచ్చేవరకు అండగా నిలిచిన టాక్సీ డ్రైవర్లు ముసాఫిర్, సమీర్‌లను కూడా సమాఖ్య అభినందించింది. ఆరతి వారిని తన సోదరులుగా భావిస్తున్నానంటూ ప్రశంసించారు. ఇలాంటి వార్తలు అనేకం వచ్చాయని, అటువంటి హీరోలందరికీ ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ గౌరవంగా వందనం చేస్తోందని లక్ష్మయ్య పేర్కొన్నారు. వాస్తవం ఇలా

**మీ కోసం**

వంటింట్లో వాడే చిన్న కత్తెర పదును పోయినప్పుడు దాంతో అల్యూమినియం పేపరును కట్ చేస్తే పదును పెరుగుతుంది.

**జీవన సౌరభం**

పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా ... అవసరమైన అవకాశాలను సృష్టించుకోవడం అభివృద్ధి లక్షణం.



## చేదూ విలువైనదే ...

**తో**టలో ఠీవిగా ఉన్న వృక్షాలు గాలికి కులాసాగా ఊగుతున్నాయి. అంతలో మామిడి చెట్టు చూపు తనతో సమానంగా ఊగుతున్న వేప చెట్టుపై పడింది. అది వెంటనే "ఏయ్ వేప చెట్టూ! ఏం చూసుకుని తెగ ఊగుతున్నావ్? నిలువెల్లా చేదు నింపుకున్నందుకా?' అని హేళన చేసింది.

ఆ మాటలకు వేప చెట్టు చిన్నబోయింది. బదులివ్వబోయింది. అంతలో 'మామయ్యా! ఇక్కడ పెద్ద చెట్లు భలే ఉన్నాయి. మామిడి కాయలు నాకు భలే ఇష్టం. మామిడికాయ పప్పు, ఆవకాయ, మాగాయ నాకు ఎంత ఇష్టమో! మామిడి పళ్ళయితే చాలా చాలా యిష్టం! కానీ ఈ వేప చెట్టు పెద్దగా ఉండి ఏం ప్రయోజనం? ఒకటే చేదు. యాక్" అన్నాడు అప్పుడే అక్కడికి వచ్చిన వసంత్ వికారంగా మొహం పెట్టి.

ఆ సంభాషణ విన్న మామిడి చెట్టు, వేప చెట్టుతో "విన్నావా? నా గురించి ఎంత గొప్పగా చెప్పాడో!" అంది గర్వంగా.

అంతలో వసంత్ మామయ్య 'నువ్వు అనుకునేది తప్పు వసంత్! మామిడి చెట్టు ఎంత గొప్పదో వేప చెట్టు కూడా అంత గొప్పదే. రుచికి చేదు అయినా, ఆరోగ్యానికి చాలా మంచిది. వేపలో ఔషధ విలువలు చాలా ఉన్నాయి. గతంలో ప్రతి ఇంటి ముందు వేపచెట్టు ఉండేది. వేప గాలి మంచిదంటారు. వేప చెట్టులోని ప్రతి భాగం విలువైనదే. ఎన్నో మందుల తయారీలలో వేప ఉపయోగపడుతోంది. క్యాన్సర్ కణాలను నిరోధించడంలో వేప బాగా పనిచేస్తుందని పరిశోధనల్లో తేలింది. ఇది క్రిమి సంహారి కూడా. సౌందర్య సాధనాల తయారీలో కూడా వేప ఉపయోగపడుతోంది" అని వివరించాడు.

"అయితే వేప చెట్టు కూడా గొప్పదే మామయ్య!" అన్నాడు వసంత్ అంతా తెలిసినట్టు ముఖం పెట్టి. ఆ మాటలు విన్న మామిడి చెట్టు, వేప చెట్టుతో 'నిన్ను హేళన చేసినందుకు నన్ను మన్నించు. నీ గొప్పతనం ఇప్పుడు బాగా అర్థమైంది" అంది. వేప చెట్టు ఆనందంగా తల వూపింది.

**- జె.శ్యామల,**
**హైదరాబాద్, 99896 01113.**

**దారి చూపండి**

పిల్లలూ, ఇక్కడ ఉన్న కుక్క పిల్ల తన స్నేహితురాలైన పిల్లి పిల్లని కలుసుకోవాలి. మరి దానికి దారి చూపి సాయం చేయరూ!

**నేను గీసిన బొమ్మ**

**- బి.చక్రిక,**
**7వ తరగతి,**
**అరవింద హైస్కూలు,**
**సిబిఎస్ఇ**
**కుంచనపల్లి,**
**గుంటూరు జిల్లా.**

# కాశ్మీర్ ఇప్పుడు ఇద్దరు అన్నలని ఇచ్చింది..

**పహల్గామ్ ఉగ్రదాడి జరిగి ఐదు రోజులవుతోంది. దాడిలో మరణించినవారి మృతదేహాలతో బాధితులు సొంతూళ్లకి చేరారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని టూర్ క్యాన్సిల్ చేసుకుని తిరుగు ప్రయాణమైన పర్యాటకులు కూడా పలు రాష్ట్రాల విమానాశ్రయాల్లో కనిపిస్తున్నారు. ఆ భయానక పరిస్థితికి ప్రత్యక్ష సాక్ష్యులు వారు. అంతకుమించి కాశ్మీరీ ప్రజల ప్రేమాభిమానాలను స్వయంగా అనుభవించిన వారు. ఆ పర్యాటకులు, బాధితులు వెల్లడిచేస్తున్న నాటి అనుభవాలు, దేశ సౌభ్రాతృత్వానికి చిహ్నాలు..**

**కే**రళ నుంచి ఆరతి ఆర్ మీనన్ తన తల్లీదండ్రితో, కుమారులతో బైసరన్ క్యాంపు చేరుకున్న కొన్ని క్షణాల్లోనే ముష్కరులు కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో 65 ఏళ్ల ఆరతి తండ్రి కూడా చనిపోయారు. ఆ క్షణం తన కళ్లముందు ఏం జరిగిందో ఆమె ఇలా చెబుతున్నారు.

**బాణాసంచా పేలుళ్లు అనుకున్నాం..**

'దుబాయ్‌లో ఉండే నేను పిల్లలను తీసుకుని కేరళలోని కొచ్చికి వచ్చాను. వేసవి సెలవులు గడుపుదామని కాశ్మీర్ టూర్ ప్లాన్ చేశాం. పిల్లలతో కలసి ఏప్రిల్ 21న మేమంతా కాశ్మీర్ వెళ్లాం. 22 ఉదయం పహల్గామ్ చేరుకున్నాం. బైసరన్ క్యాంపుకు కొంత దూరంలో కారు పార్కు చేశాం. అమ్మ కారులోనే ఉండిపోయింది. నాన్న, నేను, పిల్లలు పోనీల సహాయంతో పచ్చిక బయళ్లకు చేరుకున్నాం. కాశ్మీర్ అందాలను చూస్తూ కొంత దూరం నడిచామో లేదో గన్ షాట్‌లు వినిపించాయి. మొదట వాటిని బాణాసంచా అనుకున్నాం. వరుసగా పేలుళ్లు వినిపిస్తుంటే టెర్రర్ దాడి అని అర్థమైంది.

ప్రాణాలు కాపాడుకోవాలని పక్కనే ఉన్న కంచెవైపు పరుగెత్తాం. కంచె కింద నుండి పాక్కుంటూ సురక్షిత ప్రాంతానికి వెళ్లాలనుకున్నాం. కానీ, ఆ కంచె నుండే ఇద్దరు ముష్కరులు మావైపు వచ్చారు. ఒకతను ఏదో అంటున్నాడు, మాకు అర్థం కాలేదు. అర్థం కాలేదని చెప్పాం. ఆ మరుక్షణమే అతను నాన్నపై కాల్పులు జరిపాడు. నాన్న కింద పడిపోయారు. మావైపు వచ్చిన ఇద్దరు దుండగులను నేను చాలా స్పష్టంగా చూశాను. వాళ్లు ఆర్మీ డ్రెస్సులో లేరు. భయంతో పిల్లలిద్దరూ గట్టిగా కేకలు వేశారు. అప్పుడు ఆ మనుషులు మమ్మల్ని దాటుకుని వెళ్లారు. నాన్న చనిపోయాడని నాకు తెలుస్తూనే ఉంది. అయినా పిల్లలిద్దరినీ పట్టుకుని దూరంగా పరుగెత్తాను. అడవిలోకి వెళ్లిపోయాను. ఎటూ దారి కనిపించలేదు.

గంటపాటు అక్కడే పిచ్చిదానిలా తిరిగాను. ఫోను సిగ్నల్ రాగానే మా డ్రైవర్ ముసఫిర్‌కి ఫోన్ చేశాను. అప్పుడే మా వైపు కొన్ని పోనీ (గుర్రాలు)లు పరుగెత్తుకుంటూ వచ్చాయి. వాటి వెంట మేము కూడా పరుగెత్తాం' అంటూ ఆ భయంకర క్షణాలని ఆరతి గుర్తుచేసుకున్నారు.

**తెల్లవార్లూ మాతోనే హాస్పిటల్‌లో ఉన్నారు..**

ఆ తరువాత కాశ్మీర్ నుండి కొచ్చికి వచ్చేంత వరకు కాశ్మీర్‌లో ఆరతి ఎంతోమంది కాశ్మీరీలని కలిశారు. వారంతా తనని కుటుంబ సభ్యురాలిగా చూసుకున్నారని ఆమె చెప్పారు. 'మా డ్రైవర్ ముసఫిర్, మరో వ్యక్తి సమీర్ ఇప్పుడు కాశ్మీర్ నాకిచ్చిన అన్నదమ్ములు. నేను క్షేమంగా ఇక్కడి వరకు చేరుకున్నానంటే వారి సాయం వల్లే. నాన్న మృతదేహం మార్చురీ నుంచి ఇక్కడికి తీసుకొచ్చేంత వరకు అన్నీ వారే చూసుకున్నారు. నాన్న శవం కోసం తెల్లవారుజాము 3 గంటల వరకు నేను హాస్పటల్‌లో ఉండాల్సి వచ్చింది. అప్పుడు నన్ను ఎంతో శ్రద్ధగా, వాళ్ల చెల్లిలాగా చూసుకున్నారు. ఆ క్షణం నా కళ్ల వెంట కన్నీళ్లు కారుతూనే ఉన్నాయి. నాన్న పోయిన బాధని దిగమింగుకున్న నా కళ్లు, వాళ్ల ప్రేమకి వర్షించాయి' అంటూ కాశ్మీర్ ప్రజలు తన పట్ల చూపించిన ప్రేమని ఆమె మీడియా ముందు చెప్పారు.

శ్రీనగర్ నుండి వెనుదిరిగిన ఆరతి వాళ్లతో అన్న మాటలను కూడా చెప్పారు. 'నాన్నని కోల్పోయిన నాకు ఈ కాశ్మీర్ ఇద్దరు సోదరులను ఇచ్చింది. అల్లా మిమ్మల్ని రక్షించాలి' అని వారితో నేను అన్నాను. అప్పుడు నా ముఖంలో నాన్న పోయిన దు:ఖాన్ని కనిపించనివ్వలేదు. ఎందుకంటే అప్పటికి అమ్మకి ఆ విషయం చెప్పలేదు' అంటున్న ఆరతి, కొచ్చి విమానాశ్రయానికి చేరుకున్న తరువాతే తండ్రి మృతి వార్త తల్లితో చెప్పారు.

**కాశ్మీర్ ప్రజల ప్రేమను ఎప్పటికీ మర్చిపోలేం..**

తమిళనాడు నుండి ఏప్రిల్ 19న శ్రీనగర్‌కి చేరుకున్న జయతి, ఆమె కొడుకు దాడి జరిగినప్పుడు ఘటన జరిగిన ప్రాంతానికి 3 కి.మీ దూరంలోని బెటవ్ లోయలో ఉన్నారు. ఆ అనుభవాన్ని వాళ్లు ఇలా చెప్పారు. 'బైసరన్‌లో కాల్పులు జరిగాయని తెలిసి మేము చాలా భయపడిపోయాం. కానీ మేము బస చేసిన చోట ఉన్న స్థానికులు మాకు ధైర్యం చెప్పారు. ఎంతమందిని వీలైతే అంతమందిని సురక్షిత

ప్రాంతాలకి తరలిస్తామని భరోసా ఇచ్చారు. మమ్మల్ని వాళ్లు సొంత తమ్ముళ్లా, అక్కల్లా చూసుకున్నారు' అని తమిళనాడుకు చేరుకున్న వాళ్లు చెప్పారు. ఆ ప్రయాణం గురించి జయతి ఇంకా ఇలా చెబుతున్నారు. 'కాశ్మీర్‌లో సూపర్ డ్రైవర్స్ ఉన్నారు. నేను మున్నార్ నుంచి కొడైకెనాల్ వరకు యాత్ర చేశాను. కానీ కాశ్మీర్‌లో ఉన్నటువంటి నైపుణ్యం గల డ్రైవర్లను ఎక్కడా చూడలేదు. ఎవరికీ ఇబ్బంది లేకుండా, వాహనాలకు డ్యామేజీ జరగకుండా చాలా నేర్పుగా వాళ్లు వాహనాలని నడిపిస్తారు. ఆ విషయమే నేను అడిగినప్పుడు అతడు నవ్వుతూ ' మీ (పర్యాటకుల) వల్లే మేము బతుకుతున్నాం. మీకు ఏ ఇబ్బంది కలగకుండా చూసుకోవాలి. అలాగే క్షేమంగా, సకాలంలో గమ్యం చేర్చాలి. అందుకే వేగంగా డ్రైవింగ్ చేసినా జాగ్రత్తగా ఉంటాం' అన్నాడు అని ఆమె చెప్పారు. ఈ ఘటనతో తాము ట్రిప్‌ని మధ్యలోనే క్యాన్సిల్ చేసుకుని వచ్చాము. అంత మంచి మనుషులతో ఎక్కువ రోజులు గడపలేకపోయాం' అంటూ జయతి ఒకింత బాధగా చెప్పారు. ఆమె మాటలకు అడ్డు పడుతూ, జయతి కొడుకు ఫోనులో ఓ ఫొటోని చూపిస్తూ ఇలా అన్నారు.

**నాకు అన్నలా కనిపించాడు..**

'ప్రజలంతా ముస్లింలు, క్రిస్టియన్లు అని మాట్లాడుతున్నారు. ఇదిగో ఈ ఫొటో చూడండి. మమ్మల్ని కాశ్మీర్‌లో అందమైన ప్రదేశాలకి తిప్పిన మా డ్రైవర్‌తో మేము దిగిన ఫొటో ఇది. అతను ముస్లిం. దాడి తరువాత మాకు ధైర్యం చెప్పి విమానాశ్రయానికి చేర్చేవరకు కూడా అతను మాకు సాయంగా నిలిచాడు. భయపడొద్దని మాకు ధైర్యం చెప్పాడు. నాకు అప్పుడు అతను ఒక అన్నలా కనిపించాడు. మేమంతా కొన్ని గంటలపాటు వాళ్లతో కలిసి ప్రయాణించాం. వారి మాటల్లో, మా పట్ల చూపించిన ప్రేమలో మాకు ఒకటే అర్థమైంది. కులం, మతంతో వారికి సంబంధం లేదు. కాశ్మీర్‌కి వచ్చిన అతిథులను గౌరవంగా చూసుకోవడమే వాళ్లకి తెలిసింది' అంటున్నాడు.

**మాకు శిక్ష వేయకండి..**

దాడిలో భర్తని కోల్పోయి ఇంటికి చేరిన ఓ కుటుంబం తమకెదురైన అనుభవాన్ని ఇలా చెప్పింది. 'నా భర్తని చంపింది ముస్లింలే. అయితే మేం క్షేమంగా ఇంటికి వచ్చేలా చేసింది కూడా ముస్లింలే. అందరినీ ఒకే గాటన కట్టేయలేం. మేం బయల్దేరిన దగ్గర నుండి మాకు ఆతిథ్యమిచ్చింది, పోనీల ద్వారా బైసరన్‌కి చేర్చింది, హోటల్ సిబ్బంది.. అందరూ ముస్లింలే. వారంతా మమ్మల్ని చాలా ప్రేమగా చూసుకున్నారు. మేం ముస్లింలతోనే కలిసి ఉంటున్నాం. వాళ్లతో పాటే పెరిగాం' అని తల్లి చెబుతుంటే కూతురు కూడా తన అనుభవాన్ని ఇలా చెప్పారు. 'మేము ఈ రోజు ఇలా మాట్లాడుతున్నామంటే కాశ్మీరీ ముస్లింలు చేసిన సాయం వల్లే. మమ్మల్ని ఎయిర్‌పోర్ట్ వరకు చాలా క్షేమంగా తీసుకువచ్చారు. మాకు వీడ్కోలు పలుకుతూ క్యాబ్ డ్రైవర్ రెండు చేతులూ జోడించి ఇలా అన్నాడు : 'మేం తప్పు చేయలేదు. మమ్మల్ని ద్వేషించకండి. ఎవరో చేసిన తప్పుకి మాకు శిక్ష వేయకండి' అని ఆమె చెప్పింది.

ఈ మాటల్లో ఎంతో బాధ అంతకుమించి అభద్రత కనిపిస్తోంది. అందుకే ఇప్పుడు ఆలోచించి అడుగులు వేయాలి. ఉన్మాదం తలకెక్కిన వ్యక్తులు చేసే ప్రలోభాలకు లోబడి, మనతో చిరకాలం నుంచి స్నేహం చేస్తున్న అబ్దుల్ భాయ్‌ని వదులుకుంటామా! మనకి ఏ కష్టమొచ్చినా, 'నేనున్నాన'ంటూ సాయం చేసే సలీమా అక్కని ఇంటికి రావద్దని చెబుతామా! ఆలోచించండి..

## మొదటి సినిమా పారితోషికం రూ.2500 : నాని

**'నా** మొదటి జీతం రూ.2500. క్లాప్ అసిస్టెంట్‌గా పని చేసినందుకుగాను ఇచ్చారు. అది డబ్బు రూపంలో కాకుండా చెక్ ఇచ్చారు. అయితే ఆ నిర్మాణ సంస్థ ఏదో కారణాలతో వేరే బ్యాంకుకు మారిపోయింది. అప్పటికే అందరూ చెక్‌ను తమ ఖాతాల్లో డిపాజిట్ చేసుకున్నారు. నేను మాత్రం ఆ చెక్కును అందరికీ చూపించుకుంటూ 20 రోజులపాటు తిరిగాను. ఆ తర్వాత బ్యాంకుకు వెళ్లి విత్‌డ్రా చేద్దామంటే ఆ చెక్కుబౌన్స్ అయ్యింది. మళ్లీ వెళ్లి ఆ సంస్థ ప్రతినిధులను అడగటం ఇష్టం లేక దాన్ని అలాగే దాచుకున్నాను. ఆ డబ్బులు నాకు రాకపోయినా మంచి జ్ఞాపకంగా ఉండిపోయింది. రెండో సినిమా 'అల్లరి బుల్లోడు'కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశా. మొదటి నెల రూ.4000 పారితోషికం ఇచ్చారు. చెక్‌మాత్రం వద్దని చెప్పే రూ.100ల నోట్లు ఇచ్చారు. వాటిని జేబులో పెట్టుకుని నేనే హైదరాబాద్ కింగ్ అన్నట్లుగా తిరిగాను. నా ఫ్రెండ్స్‌ను బయటకు తీసుకెళ్లాను. దానితోపాటు తర్వాత మూడు నెలల జీతం దాచిపెట్టి అమ్మానాన్నలకు ఉంగరాలు చేయించాను. రాధా గోపాలం, అష్టం, ఢీ చిత్రాలకు సహాయ దర్శకుడిగా పనిచేశాను. అష్టాచమ్మా సినిమాతో హీరోగా మారా. స్నేహితుడా, భీమిలి కబడ్డీ జట్టు, అలా మొదలైంది, పిల్ల జమీందార్, ఈగ, ఎటో వెళ్లిపోయింది మనసు, ఎవడే సుబ్రహ్మణ్యం, భలే భలే మగాడివోయ్, జెంటిల్‌మన్, మజ్ను, నేను లోకల్, నిన్నుకోరి, జెర్సీ, శ్యామ్‌సింగరాయ్, దసరా, హాయ్ నాన్న, హిట్ వంటి అనేక సినిమాలు చేశాను' అని కథానాయకుడు నాని అన్నారు. మే 1 ఆయన నటించిన హిట్ 3 సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఆయన మీడియాతో పై విధంగా మాట్లాడారు.

## మే 9న సమంత 'శుభం' విడుదల

**టా**లీవుడ్ కథానాయిక సమంత రూతుప్రభు నిర్మించిన చిత్రం 'శుభం'. మే 9న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. హారర్, కామెడీ, వ్యంగ్యం కలగలిసిన డ్రామా. 'ఆల్ఫామేల్' భావనపై చమత్కారమైన ఇతివృత్తంతో ఈ సినిమా తెరకెక్కింది. దర్శకత్వం పువిన్ కండ్రేగుల, రచన వసంత మార్గంటి. శ్రీయా కొంతం, శాలిని కొండేపూడి, చరణ్ పేరి, హర్షిత్ మల్లిరెడ్డి నటించారు. ఇటీవల విడుదల చేసిన టీజర్‌లో ఒక జంట, వారి వివాహం, కుటుంబ జీవన విషయాలను ప్రస్తావించారు. సమంత నిర్మాణంలో వస్తున్న తొలి చిత్రం ఇదే. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ నిర్మించింది.

**జోడీ రిపీట్**

**శ**ర్వానంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. ఇందులో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు ఓ పోస్టర్ ద్వారా చిత్రబృందం ప్రకటించింది. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. 60ల కాలం నాటి నేపథ్యంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో శర్వానంద్ ప్రత్యేకంగా పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా కోసం హైదరాబాద్ సమీపంలో 15 ఎకరాల్లో ఓ భారీ సెట్‌ను సిద్ధం చేశారు. శర్వానంద్ - అనుపమ గతంలో కలిసి 'శతమానం భవతి'లో నటించారు.

## 'కాంత' సముద్రఖని

**దు**ల్కర్ సల్మాన్ నటిస్తున్న తాజా చిత్రం 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్ర షూటింగ్ ముగిసింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటోంది. ఈ సినిమాలో విలక్షణ నటుడు సముద్రఖని ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. శనివారం ఆయన పుట్టినరోజు సందర్భంగా సినిమాలోని ఆయన లుక్‌ను చిత్రబృందం విడుదల చేశారు. 1950ల కాలంలో జరగబోయే ఈ సినిమాలో ఆయన ఇంటెన్స్ లుక్‌తో కనిపిస్తున్నారు.

## బాలీవుడ్ రిస్క్ చేయడం మానేసింది

**నె**ట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలైన 'అడాలసెన్స్' అనే బ్రిటీష్ వెబ్ సిరీస్‌పై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు కురిశాయి. ఈ మినీ సిరీస్‌పై బాలీవుడ్ ప్రముఖులు కరణ్ జోహర్, అనురాగ్ కశ్యప్‌తో పాటూ ఆలియా భట్ లాంటి వారు ప్రశంసలు కురిపించారు. తాజాగా బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ మాట్లాడారు. 'ఈ మినీ సిరీస్ ప్రతీ ఎపిసోడ్‌ను సింగిల్ టేక్‌లో రూపొందించారు. ప్రపంచవ్యాప్తంగా ఆదరణ సొంతం చేసుకున్న ఈ సిరీస్ కథ పరంగా సూపర్ హిట్ అయింది. అలాంటి కథను రూపొందిద్దామని బాలీవుడ్‌లో ఎవరినైనా సంప్రదిస్తే పిచ్చోళ్లలా చూస్తారు. దానికి కారణం బాలీవుడ్ కొత్తదనాన్ని పూర్తిగా మర్చిపోయింది' అని ఇమ్రాన్ అన్నారు.

## 'కొరగజ్జ' కోసం కొత్త ప్రయోగం చేశా : గోపీ సుందర్

**'కొ**రగజ్జ' చిత్రానికి సంగీతం కంపోజ్ చేయడానికి ఎంతో రీసెర్చ్ చేయాల్సివచ్చింది. సంగీతంలో కొత్త ప్రయోగాల్ని చేయాల్సి వచ్చింది. అందుకే కాస్త ఎక్కువ సమయం పట్టింది. గత చరిత్రను తెలుసుకోవాల్సివచ్చింది. అందుకే కాస్త ఎక్కువ సమయం పట్టింది. నాటి ఆచారాలు, సంప్రదాయాల్ని అర్థం చేసుకున్న తర్వాత నాకు ఈ ట్యూన్స్ వచ్చాయి. దర్శకుడికి నా పని నచ్చినందుకు, నేను ఇచ్చిన మ్యూజిక్‌ను ఇష్ట పడినందుకు సంతోషంగా ఉంది. ఈ సినిమా ద్వారా కొత్త సంగీతాన్ని అన్వేషించడానికి, కొత్త శైలిని కనిపెట్టడానికి నాకు వీలు కల్పించింది. ఈ చిత్రం నాకు ఎంతో సవాల్‌గా అనిపించింది' అని ప్రముఖ సంగీత దర్శకుడు గోపీ సుందర్ అన్నారు. త్రివిక్రమ సినిమాస్, సక్సే ఫిల్మ్ బ్యానర్‌పై సుధీర్ అత్తవర్ దర్శకత్వం వహించిన చిత్రం 'కొరగజ్జ'. కర్నాటక, కేరళలోని కరావలి (తులునాడు) ప్రాంతంలో, ముంబైలోని కొన్ని ప్రదేశాల్లో పూజించబడే ప్రధాన దేవత కొరగజ్జ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఈ చిత్రానికి గోపీ సుందర్ సంగీతాన్ని అందించారు. సాహిత్యం సుధీర్ అత్తవర్. శ్రేయ ఘోషల్, సునిధి చౌహాన్, శంకర్ మహదేవన్, జావేద్ ఆలీ, స్వరూప్‌ఖాన్, అర్మాన్ మాలిక్ వంటి ప్రతిభావంతులైన గాయకులు పాడారు. కబీర్‌బేడి, సందీప్ సోపార్కర్, గణేష్ ఆచార్య, భవ్య, శ్రుతి వంటివారు నటించారు. మనోజ్ పిళ్లై సినిమాటోగ్రఫీ అందించారు.

# పంజాబ్-కోల్‌కతా మ్యాచ్ వర్షార్పణం

- **నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్‌కు వర్షం అడ్డంకి**
- **ఇరుజట్లకు ఒక్కో పాయింట్**

**కోల్‌కతా:** పంజాబ్ కింగ్స్ ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్ సిమ్రన్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 120పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీరికి తోడు శ్రేయస్ ఇన్నింగ్స్ కూడా తోడవ్వడంతో పంజాబ్ కింగ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 201 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో కోల్‌కతా ఇన్నింగ్స్‌కు వర్షం అడ్డంకిగా నిలిచింది. తొలి ఓవర్ ముగిసిన తర్వాత భారీ వర్షంతో మ్యాచ్ అర్ధాంతరంగా నిలిచింది. ఆ సమయానికి కోల్‌కతా జట్టు ఒక ఓవర్‌లో 7పరుగులు చేసింది. దీంతో ఇరుజట్లకు ఒక్కో పాయింట్ కేటాయించారు.

టాస్ గెలిచిన పంజాబ్‌కు ఓపెనర్లు శుభారంభం ఇచ్చారు. ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్ సింగ్(83), ప్రియాన్ష్ ఆర్య(69) అర్ధసెంచరీలతో

**పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | ర | పా | నె.ర. |
|---|---|---|---|---|---|---|
| గుజరాత్ | 8 | 6 | 2 | 0 | 12 | +1.10 |
| ఢిల్లీ | 8 | 6 | 2 | 0 | 12 | +0.65 |
| బెంగళూరు | 9 | 6 | 3 | 0 | 12 | +0.48 |
| ముంబయి | 9 | 5 | 4 | 0 | 10 | +0.67 |
| పంజాబ్ | 9 | 5 | 3 | 1 | 11 | +0.17 |
| లక్నో | 9 | 5 | 4 | 0 | 8 | -0.05 |
| కోల్‌కతా | 8 | 3 | 5 | 1 | 7 | +0.21 |
| సన్‌రైజర్స్ | 9 | 3 | 6 | 0 | 6 | -1.10 |
| రాజస్తాన్ | 9 | 2 | 7 | 0 | 4 | -0.62 |
| చెన్నై | 9 | 2 | 7 | 0 | 4 | -1.30 |

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

రాణించారు. వైభవ్ అరోరా వేసిన తొలి బంతికే ప్రియాన్ష్ ఆర్య బౌండరీ రాబట్టాడు. ఔట్ సైడ్ పడిన చివరి బంతిని ఫోర్‌గా మలిచాడు. సకారియా రెండో ఓవర్లో రెచ్చిపోయిన ప్రియాన్ష్, ప్రభ్‌సిమ్రన్‌లు బౌండరీలతో చెలరేగారు. 18 పరుగులు పిండుకున్నారు. ఆ తర్వాత కూడా ఈ జోడీ కోల్‌కతా బౌలర్లను ఉతికేశారు. హర్షిత్ రానా వేసిన 5వ ఓవర్లో సిక్సర్ బాదిన ప్రభ్‌సిమ్రన్.. స్కోర్ 50 దాటించాడు. వీళ్లిద్దరూ ధనాధన్ ఆడడంతో అయ్యర్ సేన పవర్ ప్లేలో 56 రన్స్ కొట్టింది. ఈ సీజన్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ బాదిన ప్రియాన్ష్.. కోల్‌కతాపై కీలక ఇన్నింగ్స్ ఆడాడు 27 బంతుల్లోనే హాఫ్ సెంచరీకి చేరువయ్యాడు. హర్షిత్ రానా వేసిన 10 ఓవర్లో వరుసగా4, 6, 4 బాదిన ప్రియాన్ష్ ఫిఫ్టీ సాధించాడు. ఆండ్రూ రస్సెల్ ఈ జోడీని విడదీశాడు. ఆ తర్వాత ప్రభ్‌సిమ్రన్ స్వీప్ షాట్లతో అలరిస్తూ.. అర్ధ శతకం సాధించాడు. సెంచరీ దిశగా వెళ్తున్న అతడిని వైభవ్ ఔట్ చేసి కోల్‌కతాను ఊపిరిపీల్చుకోనిచ్చాడు. ఆఖర్లో వరుసగా మూడు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత వచ్చిన గ్లెన్ మ్యాక్స్‌వెల్(7), మార్కో యాన్సెన్(3)లు విఫలం అయ్యారు. వరుసగా 3 వికెట్లు పడడంతో పంజాబ్ స్కోర్ వేగం తగ్గింది. అయితే.. శ్రేయస్ అయ్యర్(25నాటౌట్), జోష్ ఇంగ్లిస్(11 నాటౌట్)లు ధాటిగా ఆడారు. ఆఖరి రెండు ఓవర్లలో ఇంగ్లిస్ దంచికొట్టాడు. రస్సెల్ వేసిన 20వ ఓవర్లో బౌండరీతో స్కోర్ 200 దాటించాడు. కోల్‌కతా బౌలర్లు వైభవ్ అరోరాకు రెండు, వరుణ్ చక్రవర్తి, రస్సెల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. పంజాబ్‌లోని ముల్లన్‌పూర్‌లో కోల్‌కతా బౌలర్ల ధాటికి 111 పరుగులకే కుప్పకూలిన పంజాబ్ కింగ్స్ ఈసారి భారీ స్కోర్ చేసింది.

**స్కోర్‌బోర్డు...**

**పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్:** ప్రియాన్ష్ ఆర్యా (సి)వైభవ్ అరోరా (బి)రస్సెల్ 69, ప్రభ్‌సిమ్రన్ (సి)రువన్ పావెల్ (బి)వైభవ్ అరోరా 83, శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 25, గ్లెన్ మ్యాక్స్‌వెల్ (బి)వరుణ్ చక్రవర్తి 7, మార్కో జాన్సెన్ (సి)వెంకటేశ్ అయ్యర్ (బి)వైభవ్ అరోరా 3, ఇంగ్లిస్ (నాటౌట్) 11, అదనం 3. (20ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 201పరుగులు. **వికెట్ల పతనం:** 1/120, 2/160, 3/172, 4/184 **బౌలింగ్:** వైభవ్ అరోరా 4-0-34-2, చేతన్ సకారియా 3-0-39-0, హర్షిత్ రాణా 2-0-27-0, వరుణ్ చక్రవర్తి 4-0-39-1, సునీల్ నరైన్ 4-0-35-0, ఆండ్రీ రస్సెల్ 3-0-27-1.

**ఐపిఎల్‌లో నేడు**

**ముంబయి ఇండియన్స్ × లక్నో సూపర్‌జెయింట్స్**
వేదిక: ముంబయి; మ.3.30గం॥లకు

**ఢిల్లీ క్యాపిటల్స్ × రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు**
వేదిక: ఢిల్లీ; రా.7.30గం॥లకు

## హర్మన్‌ప్రీత్ సేనకు తొలి పరీక్ష

- **నేడు శ్రీలంకతో ఢీ**
- **మహిళల ట్రయాంగులర్ సిరీస్**

**కొలంబో:** మహిళల ట్రయాంగులర్ సిరీస్‌లో భాగంగా భారతజట్టు తన తొలి లీగ్ మ్యాచ్‌ను శ్రీలంకతో తలపడనుంది. కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్‌లో భారతజట్టు తన తొలి లీగ్ మ్యాచ్‌ను ఆతిథ్య శ్రీలంకతో తలపడనుంది. యువపేసర్ కశ్వీ గౌతమ్ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేయనుంది. వన్డే ఫార్మాట్‌లో జరిగే ట్రయాంగులర్ సిరీస్‌లో మూడో జట్టు దక్షిణాఫ్రికా. బ్యాటింగ్ విభాగంలో దుర్భేద్యఫామ్‌లో ఉన్న టీమిండియాకు ఎలాంటి ప్రయోగాలకు వెళ్లకుండా తొలి మ్యాచ్‌లో నెగ్గాల్సి ఉంది. లీగ్ దశలో ఒక్కో జట్టు మిగిలిన రెండు జట్లతో రెండేసిసార్లు తలపడనుంది. లీగ్ దశ ముగిసిన తర్వాత టాప్-2లో నిలిచి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. మ్యాచ్‌లన్నీ ఉదయం 10.00గం॥లకు ప్రారంభమవుతాయి.

**షెడ్యూల్...**

| | |
|---|---|
| 27(ఆది) | :